
'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 313

శుక్రవారం 26-7-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




బ్రిక్స్ ప్రతినిధిగా ఆయేషా

రష్యాలో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించిన తెలుగమ్మాయి - 2లో



ప్రపంచ మార్కెట్లు పడగొట్టాయ్

సూచీలకు ఐదో రోజూ నష్టాలు.. సెన్సెక్స్ 109 పాయింట్ల పతనం - 13లో



రాష్ట్రపతి భవన్ హాళ్లకు కొత్త పేర్లు

రాష్ట్రపతి భవన్.. అశోక్ హాల్ పేరును అశోక మండపంగా, దర్బార్ హాల్ పేరును గణతంత్ర మండపంగా మార్చారు.

వివరాలు 6లో ▸



'మహా'వృష్టి


ఎడతెగని వానలతో మహారాష్ట్రలోని ముంబై, థానె జిల్లాలు జలమయమయ్యాయి. వర్ష సంబంధిత ఘటనల్లో ఆరుగురు మరణించారు.

వివరాలు 6లో ▸

లూటెన్స్‌లో ఆప్ ఆఫీస్

కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఢిల్లీలోని లూటెన్స్ ప్రాంతంలో ఆమ్ ఆద్మీ పార్టీకి కేంద్రం కొత్త కార్యాలయం కేటాయించింది.

వివరాలు 6లో ▸



కొత్త తరానికి చాన్సివ్వడానికే..

కొత్త తరానికి అవకాశం ఇచ్చేందుకే అమెరికా దేశాధ్యక్ష రేసు నుంచి తప్పుకున్నానని బైడెన్ చెప్పారు.

వివరాలు 6లో ▸



పారిస్ పిలుస్తోంది

నేటి నుంచి ఒలింపిక్స్.. 206 దేశాల నుంచి 10,500 మంది అథ్లెట్లు

32 క్రీడాంశాలు... 329 మెడల్ ఈవెంట్లు

భారత్ నుంచి బరిలో 117 మంది

నేటి రాత్రి 11 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం

క్రీడాకారుల కలల వేదిక ఒలింపిక్స్ సమయం వచ్చేసింది... ప్రపంచవ్యాప్తంగా ఆటగాళ్లంతా అసాధారణ ప్రదర్శనతో పతకాలపై గురి పెట్టే క్రీడా సంబరానికి నేటితో తెర లేవనుంది... అథ్లెట్లను ఆయా దేశపు హీరోలుగా మార్చి శిఖరాన నిలిపే పక్షం రోజుల క్రీడా పండగకు అంతా సిద్ధమైంది... ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో 33వ ఒలింపిక్ క్రీడలు శుక్రవారం మొదలు కానున్నాయి. ఆగస్టు 11 వరకు సాగే ఈ మెగా ఈవెంట్‌లో 206 దేశాలకు చెందిన 10,500 మంది అథ్లెట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 32 క్రీడాంశాల్లో మొత్తం 329 మెడల్ ఈవెంట్ల కోసం ఆటగాళ్లు తమ సర్వం ఒడ్డేందుకు బరిలోకి దిగుతున్నారు. గత ఒలింపిక్స్‌లో 7 పతకాలతో అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసిన భారత బృందం ఈసారి అంతకంటే మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని పట్టుదలగా ఉంది. 117 మందితో కూడిన మన సైన్యం 16 క్రీడాంశాల్లో పోటీ పడుతోంది. గత మూడేళ్లలో వేర్వేరు టోర్నీల్లో మన ఆటగాళ్లు సాధించిన విజయాలు ఒలింపిక్స్‌లో మరింత మెరుగైన ప్రదర్శనపై ఆశలు రేపుతున్నాయి.

12లో

ఏదైనా ఉంటే నాతో తేల్చుకోండి

కోపం ఉంటే నాపై చూపండి

చంద్రబాబు అరాచక పాలనను ఎన్డీటీవీ ఇంటర్వ్యూలో నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

- నాపై ఉన్న కోపాన్ని అమాయకులపై ఎందుకు చూపిస్తారు?
- వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సామాన్యులపై కక్ష సాధింపు చర్యలు ఎందుకు?
- ఇది మానవత్వం అనిపించుకుంటుందా?
- ఈ అరాచకాన్ని తెలియ జెప్పాలని అన్ని పార్టీలనూ ధర్నాకు ఆహ్వానించాం
- దారుణకాండ ఫొటోలు, వీడియోలు చూసి మాకు మద్దతు ఇవ్వాలని కోరాం
- ఎన్నికలప్పుడు అరచేతిలో వైకుంఠం చూపిస్తూ అబద్ధాలు చెప్పారు.. ఇప్పుడు ఆ హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే అరాచకం



సాక్షి, అమరావతి: 'ఏదైనా ఉంటే నాతో తేల్చుకోవాలి.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు, మీకు ఓట్లు వేయని సామాన్య ప్రజలపై ఎందుకు దాడులు చేస్తున్నారు? ఇది మానవత్వం అనిపించుకుంటుందా?' అని చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. 'కోపం ఉంటే నాపై చూపండి.. నన్ను చంపాలనుకుంటే చంపేయండి.. నాపై ఉన్న కోపాన్ని అమాయకులపై

మిగతా 2వ పేజీలో ▶



కొత్త డయాఫ్రమ్ వాల్

- సమాంతరంగా నిర్మించాలన్న నిపుణుల ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- ప్రాజెక్టు పూర్తికి అవసరమైనన్ని నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం
- దీన్ని కేంద్ర జల్ శక్తి శాఖకు పంపాలని నిర్ణయం
- గతంలో బాబు నిర్వాకం వల్లే దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్

10లో



'పోలవరం' వ్యయంపై బాబు శ్వేతపత్రం బోగస్

- పార్లమెంట్‌లో కేంద్ర జలశక్తి మంత్రి ప్రకటనతో వాస్తవాలు వెలుగులోకి..
- మూడేళ్లలో పోలవరం ప్రాజెక్టుపై రూ.8,044.31 కోట్ల విలువైన పనులు
- కానీ, బాబు శ్వేతపత్రంలో రూ.4,167 కోట్లే గత ప్రభుత్వం ఖర్చుచేసిందంటూ అవాస్తవాలు
- టీడీపీ ఎంపీల ప్రశ్నలకు మంత్రి సమాధానం

10లో

సొంత పత్రం.. రోత నాటకం!

నిస్సిగ్గుగా చంద్రబాబు నిరాధార ఆరోపణలు, వక్రీకరణలు

- జగన్ క్యాంపు కార్యాలయం ఫర్నిచర్ ఫైల్‌ను నెల రోజులుగా తొక్కిపెట్టింది బాబే.. తీసుకెళ్లాలని పదేపదే చెబుతున్నా నిర్ణయం తీసుకోకుండా నిర్లజ్జగా నిందలు
- నెలన్నరగా సాగుతున్న దారుణాలు, నరమేధంపై మౌనం
- ఈ అరాచక పాలన చూశాక రాష్ట్రపతి పాలన విధించాలని దేశం మొత్తం డిమాండ్ చేయడం కనపడలేదా?
- వైఎస్సార్‌సీపీ హయాంలో గణనీయంగా తగ్గిన నేరాలు
- ఎన్‌సీఆర్‌బీ నివేదికలే తిరుగులేని నిదర్శనం
- గంజాయి నిర్మూలనకు ఆపరేషన్ పరివర్తన్, 11,500 ఎకరాల్లో తోటలు ధ్వంసం చేసింది గత సర్కారు కాదా బాబూ?
- దిశ యాప్ ద్వారా నిమిషాల వ్యవధిలో బాధితులకు భద్రత.. ఏకంగా 19 జాతీయ అవార్డులు
- జీరో ఎఫ్ఐఆర్, సచివాలయాల్లో మహిళా పోలీసులతో పూర్తి భరోసా కల్పించిన జగన్ ప్రభుత్వం

3లో



నేరాలను ఉపేక్షించం

- శాంతి భద్రతలపై అసెంబ్లీలో సీఎం చంద్రబాబు శ్వేతపత్రం..
- నేటి నుంచి కఠినంగా వ్యవహరిస్తాం
- ప్రజలు కక్ష తీర్చుకోమని అధికారం అప్పగించలేదు.. గత ప్రభుత్వ హయాంలో నేరాలు పెరిగిపోయాయి

3లో



కేంద్రం స్పష్టీకరణ

నీట్–యూజీ రివైజ్డ్ ఫలితాలను విడుదల చేయలేదు

నీట్–యూజీ 2024 రివైజ్డ్ ఫలితాలను గురువారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసిందంటూ వచ్చిన వార్తలపై కేంద్రం స్పందించింది. రివైజ్డ్ ఫలితాలను విడుదల చేయలేదని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో షేర్ అవుతున్న లింక్ పాతదేనని స్పష్టం చేసింది. త్వరలోనే ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్‌లో రివైజ్డ్ ఫలితాలను ఉంచుతామని తెలిపింది.

- వివరాలు 6లో



సోమిరెడ్డి అనుచరుల దురాగతం

- వాటర్ బేస్ కంపెనీ ఉద్యోగులపై దాడి
- 16 మందికి గాయాలు
- తమ అనుచరులకే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్
- సోమిరెడ్డి ఒత్తిడితో ఫిర్యాదు చేసేందుకు జంకుతున్న యాజమాన్యం

5లో

ఆషాఢంతో విడదీయని మునగ బంధం

సాధారణ రోజుల్లో మునక్కాడలు తిన్నా.. మునగాకు తినేది ఈ మాసంలోనే..

ఆరోగ్యంతో కూడిన పురాతనాచారం

నాడు ఆచారంతో మొదలై..

నేడు విదేశాలకు ఎగుమతి దాకా..





మునగ చెట్టు

మలికిపురం: నేటి ఆధునిక సమాజంలో ఎన్ని ఆహారపు అలవాట్లు చేరినా ఆషాఢ మాసంలో మునగ ఆకుల కూర తినాలనే ఆచారం మాత్రం ఇప్పటికీ పదిలంగానే ఉంది. తెలుగు నాట ప్రతి ఇంటి పెరట్లోనూ వారి తోటల్లోనూ మునగ చెట్లను పెంచుకుంటారు. సాధారణంగా ఆషాఢం మాసం వచ్చే సరికి మునగ చెట్లు కూడా లేలేత పచ్చని ఆకులతో నిగనిగలాడుతూ ఉంటాయి. మునగాకు తినేందుకు కూడా ఈ తెలుగు నెలలో అనుకూలంగా ఉంటుంది. మిగిలిన నెలలలో ముదిరిపోయి అంత రుచి ఉండదని అంటారు. సరిగ్గా ఆషాఢం నెల ఆది నుంచీ ఈ మునగాకు బంధం పెనవేసుకుంది. మునగ ఆకుతో 300 పైగా వ్యాధులు దూరం అవుతాయని ఆయుర్వేద వైద్యులతో పాటు పూర్వీకులు కూడా చెబుతారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో సిద్ధ వైద్యంలో ఉపయోగిస్తారు.

పోషకాలు అధికం

మునగ ఆకులు చాలా బలమైన. పుష్టికరమైన ఆహారం. బీటా కెరోటీన్, విటమిన్ సి, మాంసకృతులు, ఇనుము, పొటాషియం ,కాల్షియం, ఫాస్పరస్ ఎక్కువగా కలిగి ఉంటాయి. మునగాకులో ఎన్నో ఔషధ గుణాలు, అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలున్నాయని పరిశోధనల్లో వెల్లడైంది. మనం డబ్బులిచ్చి కొనే ఏ ఆకు కూరల్లోనూ మునగాకు స్థాయిలో ఈ విటమిన్లు వుండవు. అలాగే ఐరన్ కూడా మునగాకులో పుష్కలంగా వుంటాయి. కళ్ల వ్యాధులకు సంబంధించిన మెడిసిన్‌లో మునగాకును వాడతారు. పాల నుంచి లభించే క్యాల్షియం 17 రెట్లు అధికంగా మునగాకు నుంచి వస్తుంది. పెరుగు నుంచి పొందే ప్రోటీన్లను 8 రెట్లు అధికంగా మునగాకు నుంచి పొందవచ్చు. మూత్రపిండాల వ్యాధిలో సైతం సంబంధిత మందులతో పాటు లేత కొబ్బరి నీటిలో ఒక చెంచా మునగ పువ్వుల రసం కలిపి తాగితే మంచి ఫలితాలు ఉంటాయంటారు. నేడు అనేక ప్రాంతాల్లో ప్రత్యేక మునగ సాగు క్షేత్రాల ద్వారా మునగాకు పొడిని తయారు చేసి అనేక ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

– తోట సత్యనారాయణ, రిపోర్టర్, మలికిపురం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

పోషకాల గని మునగ

మునగాకు పోషకాల గనిగా భావించవచ్చు. ఇందులో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. అనేక రోగాలపై పోరాడే శక్తి కూడా మునగాకుకు ఉంది. ప్రతి ఒక్కరూ తప్పకుండా దీన్ని ఆహారంలో చేర్చుకోవాలి.

– డాక్టర్ దుర్గా ప్రసాద్, ఎంబీబీఎస్. ప్రభుత్వ వైద్యాధికారి, విశ్వేశ్వరాయపురం

అనాదిగా వస్తున్న సాంప్రదాయం..

ఆషాఢ మాసంలో మునగాకు విని యోగం అనేది అనాదిగా వస్తున్న ఆచారం. ఆరోగ్యంతో కూడిన ఆహారం కనుక దీనిని ఆషాఢ మాసంలో తప్పక తీసుకోవాలని మన పెద్దలు చెప్పారు. దీని ప్రాముఖ్యత ఏమిటోనేటి ఆధునిక ప్రపంచానికి తెలిసింది.

– యెనుముల గంగా భవాని, గృహిణి, కేశనపల్లి

ఇంకుంటూత్





ముర్ము టీచర్

దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము టీచర్‌గా మారారు. రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు చేపట్టి రెండేళ్లయిన సందర్భంగా గురువారం ఆమె డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ కేంద్రీయ విద్యాలయలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులతో ముచ్చటించారు. భూతాపం పర్యవసానాలు, తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వారికి వివరించారు.

6లో

టీడీఆర్ బాండ్ల స్కామ్‌లో కారుమూరిని 'ఫిక్స్' చేద్దాం



- శాసన సభలో కూటమి సభ్యుల ప్రతిపాదన
- నివేదిక రాగానే తప్పకుండా చేద్దామన్న మంత్రి నారాయణ

10లో

వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీస్తే ఊరుకోం



- పరువునష్టం దావా వేస్తాం
- మదనపల్లి ఘటనపై దుష్ప్రచారం తగదు
- పోలీసుల అదుపులో ఉన్నది టీడీపీ మనిషే.. మా వ్యాపారాలన్నీ పారదర్శకం
- వైఎస్సార్‌సీపీ నేత మిథున్‌రెడ్డి

14లో

క్లుప్తంగా...

కోవిడ్, భూసేకరణ వల్లే పోలవరం నిర్మాణం జాప్యం

వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యానికి కోవిడ్ మహమ్మారితోపాటు భూ సేకరణ, పునరావాసం, పరిహారం చెల్లింపుల వ్యవహారాలే కారణమని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు గడచిన మూడేళ్లలో పోలవరం నిర్మాణానికి సంబంధించిన వివరాలు వెల్లడించాలని గురువారం లోక్‌సభలో టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, గంటి హరీష్ మాథుర్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సమాధానం ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు కోసం 2021–24 వరకు మొత్తం రూ.8,044.31 కోట్లు ఇచ్చామని కేంద్ర మంత్రి తెలిపారు.

కాకినాడ ఎంపీకి హైకోర్టు నోటీసులు

ఉదయ్ ఎన్నిక రద్దు చేయాలంటూ ఎన్నికల పిటిషన్

సాక్షి, అమరావతి: కాకినాడ పార్లమెంట్ స్థానానికి జనసేన పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందిన తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఎన్నికను సవాలు చేస్తూ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ (ఈపీ) దాఖలైంది. ఉదయ్ శ్రీనివాస్ తన ఎన్నికల అఫిడవిట్‌లో అవాస్తవాలను పొందుపరిచారని, అందువల్ల ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ కాకినాడ జిల్లా, గండేపల్లి గ్రామానికి చెందిన రైతు జి.పాట్టియ్య ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. ఉదయ్ శ్రీనివాస్‌తో పాటు ఎన్నికల్లో పోటీ చేసిన పలువురు అభ్యర్థులు, రిటర్నింగ్ అధికారి, మరికొందరికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 27కు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయ్ శ్రీనివాస్ తన ఎన్నికల అఫిడవిట్‌లో విద్యార్హతలను తప్పుగా పేర్కొన్నారని పాట్టియ్య తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. అలాగే రెండు పాన్‌కార్డులు ఉంటే ఒక కార్డు గురించే ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారని తెలిపారు. అంతేకాక రిటర్నింగ్ అధికారిని సైతం ప్రభావితం చేసి కొందరి నామినేషన్లను తిరస్కరించేలా చేశారని కూడా వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసి, విచారణ ఆగస్టు 27కు వాయిదా వేశారు.

ఎంబీయూలో రేపు తొలి ఉపగ్రహ ప్రయోగం

చంద్రగిరి (తిరుపతి జిల్లా): మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ) నుంచి శనివారం తొలి ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నట్లు యూనివర్సిటీ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు ఎంబీయూ బెలూన్ శాటిలైట్‌ను నింగిలోకి ప్రయోగించనున్నారు. వర్సిటీ విద్యార్థులు తయారుచేసిన ఈ శాటిలైట్‌కు సంబంధించిన అన్ని భాగాలను జాతీయ వాతావరణ పరిశోధన ప్రయోగశాల (ఎన్ఏఆర్ఎల్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ) సహకారంతో అభివృద్ధి చేశారు. వాతావరణంలోని డయాకోపెడ్ స్థాయి, ఓజోన్ సాంద్రతలు, ఉష్ణోగ్రత, తేమ, వాతావరణ పీడనం వంటి క్లిష్టమైన పర్యావరణ పరిమితులను పర్యవేక్షించేలా ఈ శాటిలైట్‌ను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇస్రో చంద్రయాన్–3 ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వీరముత్తువేల్, డాక్టర్ కల్పన కాళహస్తి, ఓషన్ శాట్–3 ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ తెన్మొయి సెల్వీ, ఎంబీయూ చాన్సలర్ మోహన్‌బాబు, ప్రో–చాన్సలర్ మంచు విష్ణు హాజరుకానున్నట్లు తెలిపారు.

రూ.2,91,159 కోట్ల అంచనాతో తెలంగాణ బడ్జెట్

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2,91,159 కోట్ల అంచనాతో ప్రతిపాదించిన బడ్జెట్‌ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గురువారం ప్రవేశపెట్టారు. రెవెన్యూ వ్యయం రూ.2,20,945 కోట్లుగా, మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా అంచనా వేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ప్రభుత్వ తీరు–దాని పర్యవసానాలు, పరిస్థితిని చక్కదిద్దేందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న దిద్దుబాటు చర్యలు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న విధానాలు వంటి అంశాలను వివరిస్తూ భట్టివిక్రమార్క సుదీర్ఘంగా ప్రసంగించారు. 'గత ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలు, వైఫల్యాలను గుర్తించి ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుకుని కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మేమిచ్చిన హామీలను అమలు చేసి చూపాలన్న పట్టుదలతో ఉన్నాం. సంకల్ప బలం, చిత్తశుద్ధి, సమర్థత, నిజాయితీలే పునాదులుగా నిర్మితమైన మా ప్రభుత్వానికి అలవి కానివి అంటూ లేవని తొలి అడుగుతోనే నిరూపించాం. మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు, అర్హులకు రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ సరఫరా, నిరుపేదల సొంతింటి కలను నిజం చేసేలా ఇందిరమ్మ పథకానికి శ్రీకారం, అర్హులకు ఉచితంగా నెలకు 200 యూనిట్ల విద్యుత్ సరఫరా అమలులోకి తెచ్చాం. ఈ బడ్జెట్ మమ్మల్ని నమ్మిన ప్రజల ఆకాంక్షలు, వారి నమ్మకాల ప్రతిబింబం' అని ఈ సందర్భంగా భట్టి పేర్కొన్నారు.

ప్రకృతికే ప్రత్యేకం


విశాఖపట్నంలోని ఎర్రమట్టి దిబ్బలు

వారసత్వ సంపదకు సజీవ సాక్ష్యం ఎర్రమట్టి దిబ్బలు

విశాఖకు సహజ సిద్ధంగా ప్రకృతి ప్రసాదించిన వరం

- 18,500 ఏళ్ల క్రితం ఏర్పడినట్టు చెబుతున్న పురాతత్వ శాస్త్రవేత్తలు
- దక్షిణాసియాలో మూడుచోట్ల మాత్రమే అరుదైన సంపద
- సముద్రపు ఇసుకతో మట్టి, ఖనిజాలతో మిళితమై ఏర్పడిన దిబ్బలు
- 2014లో జాతీయ వారసత్వ ప్రదేశంగా ప్రకటించిన జాతీయ భూ విజ్ఞాన సర్వే సంస్థ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: నీలి సముద్రం సవ్వడి ఓవైపు.. పచ్చందాల ప్రకృతి మరోవైపు.. మధ్యలో సూరీడే కిందికి దిగి.. ఎర్రరంగు పులిమినట్టుంటే అరుదైన వారసత్వ సంపద ఎర్రమట్టి దిబ్బలు చూపరుల్ని కట్టిపడేస్తుంటాయి. 'ఇందువదన కుందరదన.. మందగమన మధురవచన..' అంటూ ఛాలెంజ్ చేసిన చిరంజీవికి సూపర్ హిట్ ఇచ్చింది ఈ దిబ్బలే. చరిత్రకు సాక్ష్యంగా ఉన్న ఇక్కడే సినిమా జీవితాన్ని మొదలుపెట్టిన కమల్‌హాసన్, రజనీకాంత్ చలనచిత్ర రంగంలో 'మరోచరిత్ర' సృష్టించారు. సహజ సిద్ధమైన ప్రకృతికి ప్రతిరూపంగా.. విశాఖకు వచ్చే సందర్శకులకు వరంగా.. భీమిలిలో అందాల్ని ఎరుపెక్కించిన ఎర్రమట్టి దిబ్బలు నిజంగా అరుదైన సంపదే. దక్షిణాసియాలో కేవలం మూడంటే మూడు ప్రాంతాల్లోనే ఈ అద్భుతం కనువిందు చేస్తోంది. తొలుత ఇసుక కొండలుగా ఏర్పడి.. తర్వాత ఎర్రమట్టి దిబ్బలుగా రూపాంతరం చెందిన ఈ ప్రకృతి వరప్రసాదానికి జాతీయ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు లభించింది.

ఇసుకే అయినా.. మట్టిదిబ్బలని..!

పూర్వకాలంలో వీటిని ఎర్ర ఇసుక కొండలుగానూ పిలిచేవారు. పాయలుగా ఏర్పడిన తర్వాత.. ఎర్రమట్టి దిబ్బలుగా పిలుస్తున్నారు. వాస్తవానికి భౌగోళిక పరంగా ఇది ఇసుక నుంచి రాయి ఏర్పడుతుంది. పొరలు పొరలుగా ఒకచోట చేరిన ఇసుక రేణువులే వేల సంవత్సరాల తర్వాత రాయిగా మారతాయి. అలా ఒకచోట పేరుకుపోయిన ఇసుక క్రమంగా గట్టిపడటం మొదలవుతుంది. అది పూర్తి రాయిగా మారే క్రమంలో కాస్త మట్టిలా అనిపించే విధంగా మారుతుంది. ఇది ఇసుకే అయినా.. మట్టిలా గట్టిగా అనిపిస్తుంది. అదేవిధంగా ఇక్కడ దిబ్బల్లోని ఇసుక, మట్టి ఎరుపు రంగులో ఉండటం వల్ల వీటిని ఎర్రమట్టి దిబ్బలుగా పిలవడం అలవాటైపోయింది.

జియో హెరిటేజ్ ప్రాంతంగా..



విశాఖపట్నం నుంచి భీమునిపట్నం వెళ్లే మార్గంలోని మట్టి దిబ్బలు 10 చదరపు కిలోమీటర్ల మేర విశాఖ–భీమునిపట్నం మధ్య విస్తరించి ఉన్నాయి. ఇవి ఒకప్పుడు 40 మీటర్ల ఎత్తున ఉండేవి. జాతీయ భూవిజ్ఞాన సర్వే సంస్థ (జీఎస్ఐ) ఈ దిబ్బల ప్రదేశ రక్షణ, నిర్వహణ కోసం 2014లో జాతీయ వారసత్వ ప్రదేశం (జియో హెరిటేజ్ సైట్)గా ప్రకటించింది. అందరికీ అందుబాటులో ఉండటంతో పాటు ఎక్కువ అధ్యయనాలు, పరిశోధనలు చేసిన ప్రాంతాన్ని జియో హెరిటేజ్ సైట్‌గా గుర్తిస్తారు. ఈ నేపథ్యంలో తమిళనాడులోని టెరిశాండ్స్‌తో పోలిస్తే ఇక్కడి ఎర్రమట్టి దిబ్బలు అందరికీ అందుబాటులో ఉండటంతోపాటు అధ్యయనాలు, పరిశోధనలు జరగడంతో దీనికి ఈ గుర్తింపు వచ్చింది. మొత్తం 1,195 ఎకరాల్లో 262.92 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఎర్రమట్టి దిబ్బలు ఉన్న ప్రాంతాన్ని జియో హెరిటేజ్ సైట్‌గా గుర్తించారు. ఈ దిబ్బలను గమనించడం ద్వారా ఇక్కడి వాతావరణ పరిస్థితుల గురించి అధ్యయనం చేసేందుకు దోహదపడతాయని చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఒక్కసారి వీటిని ధ్వంసం చేస్తే.. తిరిగి ఏర్పాటయ్యే అవకాశమే లేదు.

ఎలా ఏర్పడ్డాయంటే..!

- ఎర్రమట్టి దిబ్బలు సుమారు 18,500 నుంచి 20,000 సంవత్సరాల కిందట ఏర్పడినట్టు భౌగోళిక చరిత్ర చెబుతోంది.
- కొన్ని వేల సంవత్సరాల క్రితం బంగాళాఖాతం ప్రస్తుత తీర రేఖ నుంచి కనీసం 5 నుంచి 10 కి.మీ. వెనక్కి ఉండేది.
- తూర్పు కనుమలలో ఖొండలైట్ శిలలు విస్తరించి ఉన్నాయి. ఈ శిలల్లో గార్నెట్, క్వార్ట్జ్, సిల్లిమనైట్, ఫెల్డ్‌స్పార్, ఇనుప ఖనిజాలు విస్తారంగా ఉంటాయి.
- భారీ వర్షాలు పడే సమయంలో ఈ కొండల నుంచి నీటి ప్రవాహాల ద్వారా కొట్టుకొచ్చిన మట్టి పదార్థాలు బంగాళాఖాతంలో కలుస్తాయి. ఇలా వరద నీటితో పాటు తూర్పుకనుమల్లో ఉన్న ఖనిజాలు కొట్టుకొచ్చి సముద్ర తీరంలోకి ఇసుకతో కలిసిపోయి.. మిశ్రమంగా ఏర్పడి పేరుకున్నాయి.
- కొండల్లోని మట్టి, సముద్రపు ఇసుక, ఖొండలైట్ శిలల్లోని ఖనిజాలన్నీ కలిసి గట్టిదనాన్ని సంతరించుకోవడం వల్ల ఇవి ఏర్పడ్డాయి.
- ఖనిజాల సమ్మేళనాలు ఆక్సీకరణం చెందడం వల్ల ఈ కొండలు ఎర్రగా మారిపోయాయి. పూర్వం వీటిని ఎర్ర ఇసుక కొండలుగా పిలిచేవారు.
- కాలక్రమేణా ఈ గుట్టల్లో పేరుకుపోయిన మిశ్రమ అవక్షేపాల్లో వదులుగా ఉండేచోట నీటి ప్రవాహాల తాకిడితో కొట్టుకుపోవడం వల్ల ఆ ప్రాంతంలో చిన్న చిన్న లోయలుగా రూపాంతరం చెందాయి.
- క్రమంగా భారీ వర్షాల సమయంలో దాదాపు 3 వేల సంవత్సరాల క్రితం వరకూ ఎర్రమట్టి దిబ్బల్లో నిరంతరం మార్పులు సంభవించాయి.

మూడుచోట్ల మాత్రమే..!

అరుదైన ఎర్రమట్టి దిబ్బలు దక్షిణాసియాలో కేవలం మూడు చోట్ల మాత్రమే ఉన్నాయి. విశాఖలోని భీమిలి వద్ద ఏర్పడిన వీటిని ఎర్రమట్టి దిబ్బలుగా పిలుస్తారు.

- తమిళనాడులోని తూటికూడి జిల్లాలో ఏర్పడిన దిబ్బలను టెరిశాండ్స్ పేరుతో పిలుస్తారు.
- శ్రీలంకలోని విల్‌పట్టు నేషనల్ పార్కు సమీపంలో పాయింట్ కుర్దిమళై పేరుతో ఇవి విస్తరించి ఉన్నాయి.
- శ్రీలంక, తమిళనాడులో ఉన్న ఎర్రమట్టి దిబ్బలు జనావాసాలకు దూరంగా ఉంటాయి కాబట్టి.. వాటి వద్దకు వెళ్లేందుకు ఎవరూ ఆసక్తి చూపరు.
- విశాఖలోని ఎర్రమట్టి దిబ్బలు జనావాసాలకు ఆనుకుని ఉండటం వల్ల గుర్తింపు పొందాయి. తెలుగు సినీ పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్‌కు తరలి వచ్చిన తర్వాత ప్రతి 5 సినిమాల్లో ఒక చిత్రానికి సంబంధించిన పాట/సీన్ కచ్చితంగా భీమిలి ఎర్రమట్టి దిబ్బల వద్ద చిత్రీకరించేవారు.
- ముఖ్యంగా చిరంజీవి నటించిన ఏ సినిమా అయినా ఎర్రమట్టి దిబ్బలవద్ద చిత్రీకరిస్తే.. సూపర్‌హిట్ అవ్వాల్సిందే అనే సెంటిమెంట్ కూడా ఉండటం గమనార్హం. మరోచరిత్ర, ఛాలెంజ్, అభిలాష, కలియుగ పాండవులు, ఎర్రమందారం, రావోయి చందమామ, అడవిదొంగ, చామంతి, మాతోపెట్టుకోకు, పరుగోపరుగు.. తాజాగా వరుణ్ సందేశ్ నటిస్తున్న మట్కా వరకూ ప్రతి సినిమాకు ఎర్రమట్టి దిబ్బలు షూటింగ్‌లకు కేరాఫ్‌గా మారింది.
- అంతేకాదు.. ఇవి మన పురావస్తు నాగరికతకు చిహ్నాలుగా ఉండటంతో పాటు కార్తీక మాసంలో ఇక్కడ వనభోజనాలకు కూడా కేంద్రంగా మారింది.

ఎర్రమట్టి దిబ్బల్ని పరిరక్షించుకోవాలి

వాటర్ మేన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్


ఎర్రమట్టి దిబ్బలను పరిశీలిస్తున్న రాజేంద్రసింగ్

కొమ్మాది (విశాఖ): ప్రపంచంలోనే అరుదైన, జాతీయ భౌగోళిక వారసత్వ సంపద అయిన ఎర్రమట్టి దిబ్బలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరితోపాటు ప్రభుత్వానికి కూడా ఉందని వాటర్ మేన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ అన్నారు. ఆక్రమణకు గురవుతున్న ఎర్రమట్టి దిబ్బలను గురువారం ఆయన పరిశీలించారు. రాజేంద్ర సింగ్ మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న ఎర్రమట్టి దిబ్బలను విచ్చలవిడిగా తవ్వేస్తుంటే ప్రభుత్వం, అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వీటి పరిరక్షణ కోసం ఎంతవరకైనా పోరాడతామన్నారు. సముద్ర నీటిని కూడా మంచినీటిగా మార్చే శక్తి ఈ ఎర్రమట్టి దిబ్బలకు ఉందని ఆయన గుర్తు చేశారు. ఆయన వెంట జలబిరాదరి జాతీయ కన్వీనర్ బి.సత్యనారాయణ ఉన్నారు.

ఏదైనా ఉంటే నాతో తేల్చుకోండి

▶ మొదటి పేజీ తరువాయి

ఎందుకు చూపిస్తారు?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి సాగిస్తున్న నరమేధాన్ని యావత్ దేశానికి చాటి చెప్పేలా బుధవారం ఢిల్లీలో వైఎస్ జగన్ భారీ ఎత్తున ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పలు జాతీయ మీడియా ఛానల్స్ ప్రతినిధులు వైఎస్ జగన్‌ను ఇంటర్వ్యూ చేశారు. ఎన్డీటీవీ ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ ఇంటర్వ్యూలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఎన్డీటీవీ ప్రతినిధి: రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న దారుణకాండను నిరసిస్తూ మీరు చేస్తున్న ధర్నాకు సంఘీభావం తెలిపేందుకు సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ వచ్చారు. ఆయన ఇండియా కూటమిలో భాగస్వామి. ఆయన మీకు సంఘీభావం తెలపడాన్ని బట్టి చూస్తే రాజకీయ పునరేకీకరణ జరుగుతోందని అనుకోవచ్చా?

వైఎస్ జగన్: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, ఆస్తుల విధ్వంసాలు యథేచ్ఛగా కొనసాగిస్తోంది. సీఎం చంద్రబాబు కుమారుడు లోకేశ్ రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ బుక్ పేరుతో హోర్డింగ్‌లు పెట్టి.. ఆ హోర్డింగ్‌ల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారుల పేర్లు ప్రచురించి.. టీడీపీ శ్రేణులను దాడులకు పురిగొల్పుతున్నారు. ఆ దాడుల పట్ల చూసీ చూడనట్లు వ్యవహరించాలని పోలీసు అధికారులను ఆదేశిస్తున్నారు. దాంతో టీడీపీ శ్రేణులు పెట్రేగిపోయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు, టీడీపీ కూటమికి ఓటు వేయని ప్రజలపై దాడులు చేస్తున్నాయి. హత్యలు చేస్తున్నాయి.. హత్యాయత్నాలకు తెగబడుతున్నాయి.. వాటికి సంబంధించి వీడియోలు, ఫొటోలు.. తదితర సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పైగా బాధితులపైనే అక్రమ కేసులు బనాయిస్తున్నారు. నాగరిక సమాజం ఖండించాల్సిన ఈ దారుణకాండను యావత్ దేశం దృష్టికి తీసుకురావాలనే ఈ ధర్నా నిర్వహిస్తున్నాం. టీడీపీ కూటమి ప్రభుత్వ హత్య, హత్యాయత్నాలు, దాడులకు సంబంధించి వీడియో, ఫొటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశాం. దీన్ని సందర్శించాలని అన్ని రాజకీయ పార్టీలనూ ఆహ్వానించాం. సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌నూ ఆహ్వానించాం.

ఎన్డీటీవీ ప్రతినిధి: టీడీపీ ప్రభుత్వ దమనకాండపై ప్రధాని, హోంమంత్రి, రాష్ట్రపతికి లేఖలు రాశారు కదా? వారు ఏమైనా స్పందించారా?

వైఎస్ జగన్: గత 45-50 రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న అరాచక, ఆటవిక పాలనపై ప్రధాని మోదీ, హోం శాఖ మంత్రి అమిత్‌షా, రాష్ట్రపతికి లేఖలు రాశాను. ఇదే రీతిలో అన్ని పార్టీలనూ ధర్నాకు ఆహ్వానించాను. టీడీపీ ప్రభుత్వ అరాచకాలకు సంబంధించి వీడియో క్లిప్పింగ్‌లు.. ఫొటోలు చూశాక.. ఆ దారుణకాండను ఖండించాలా? వద్దా? అన్నది నిర్ణయించుకోవాలని విజ్ఞప్తి చేశాను. ప్రజాస్వామ్యం అంటే సమన్యాయం. సమన్యాయం లేకపోతే అది ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది? మేం అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి ఘటనలకు ఆస్కారమే ఇవ్వలేదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు, టీడీపీకి ఓటు వేయని ప్రజలపై దాడులు చేస్తూ కొత్త ఒరవడి సృష్టిస్తోంది. ఇలాంటి అరాచకాలను ఖండించకపోతే ప్రజాస్వామ్యం మనుగడ సాధించదు.

ఎన్డీటీవీ ప్రతినిధి: మీ ప్రభుత్వ పాలనలో కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తనను జైలు పాలు చేశారని సీఎం చంద్రబాబు అంటున్నారు కదా?

వైఎస్ జగన్: మేం అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి కక్ష సాధింపు చర్యలు చేపట్టలేదు. టీడీపీ సానుభూతిపరులు, సామాన్యులపై దాడులు జరిగిన దాఖలాలే లేవు. అవినీతికి పాల్పడిన చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించింది. కోర్టు రిమాండ్‌పై చంద్రబాబు జైలుకెళ్లారు. ఇదెలా కక్ష సాధింపు అవుతుంది? ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 1000కి పైగా దాడులు చేశారు.. 300 హత్యాయత్నాలు జరిగాయి.. 30కిపైగా హత్యలు చేశారు.

ఎన్డీటీవీ ప్రతినిధి: నిన్న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించారు. పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయడానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. వీటిని ఎలా చూస్తారు?

వైఎస్ జగన్: అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు అప్పు ఇవ్వడంలో ఏముంది? విభజన చట్టం ప్రకారం పోలవరాన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే. చంద్రబాబు అరాచక పాలన ఎందుకు సాగిస్తున్నారంటే.. శాంతిభద్రతలను ఎందుకు గాలికొదిలేశారంటే.. ఎన్నికలకు ముందు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తూ అబద్ధపు హామీలు ఇచ్చారు. ఆ హామీలను అమలు చేయలేరు. దీన్నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే అరాచక పాలన సాగిస్తున్నారు.

ఎన్డీటీవీ ప్రతినిధి: అఖిలేష్ యాదవ్ మీకు సంఘీభావం తెలిపి వెళ్లగానే.. ఇండియా కూటమిలో మరో భాగస్వామి మీకు సంఘీభావం తెలపడానికి వచ్చారు.. దీన్ని బట్టి చూస్తే ఇది రాజకీయ పునరేకీకరణ కాదా?

వైఎస్ జగన్: టీడీపీ అరాచక పాలనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు చూసి.. ప్రజాస్వామ్య పరిరక్షణకు మద్దతు ఇవ్వాలని అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేశాం. మా ఆహ్వానాన్ని అందుకున్న పార్టీలు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మాకు సంఘీభావం తెలపడానికి ముందుకొస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వ అరాచకాలను వివరించడానికి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరాను. ప్రధాని అపాయింట్‌మెంట్ ఇస్తారనే ఆశిస్తున్నాను.

తాడేపల్లికి చేరుకున్న వైఎస్ జగన్

- గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం
- ఢిల్లీలో ధర్నా విజయవంతం.. పలు పార్టీల మద్దతు: మార్గాని భరత్
- రాష్ట్రంలో విధ్వంసకాండను దేశం దృష్టికి తీసుకెళ్లాం: మేరుగ నాగార్జున


గన్నవరం ఎయిర్‌పోర్టులో పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న జగన్

విమానాశ్రయం (గన్నవరం): రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వ అరాచక పాలనకు నిరసనగా దేశ రాజధాని న్యూఢిల్లీలో ధర్నా నిర్వహించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. న్యూఢిల్లీ నుంచి ఎయిరిండియా విమానంలో ఆయన ఉదయం 8.25 గంటలకు ఇక్కడికి విచ్చేశారు. ఇదే విమానంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎంపీ మార్గాని భరత్, మాజీ మంత్రులు మేరుగ నాగార్జున, పేర్ని నాని, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు దేవినేని అవినాష్, పేర్ని కిట్టు తదితరులు వచ్చారు. విమానాశ్రయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డుమార్గం ద్వారా తాడేపల్లి చేరుకున్నారు. కాగా, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న అరాచక పాలనపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో చేపట్టిన ధర్నా విజయవంతమైందని రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ అన్నారు. గన్నవరం విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీడీపీ దమనకాండపై ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌కు మంచి స్పందన వచ్చిందన్నారు. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌తోపాటు పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమకు సంఘీభావం తెలియజేశారని చెప్పారు. చంద్రబాబు దుర్మార్గపు పాలన గురించి దేశ ప్రజలందరికీ తెలిసిందన్నారు. త్వరలో ప్రధాని మోదీని కూడా కలిసి రాష్ట్రంలోని పరిస్థితులను వివరిస్తామని చెప్పారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న సంఘటనలను యావత్ దేశం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ సందర్భంగా ఏపీలో రాష్ట్రపతి పాలన అవసరమేనని పలు పార్టీల నేతలు అభిప్రాయపడ్డారని తెలిపారు.

రూ.15 వేల కోట్లలో గ్రాంట్ ఎంత.. రుణమెంత?

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ



సాక్షి, విశాఖపట్నం: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్ సహకారంతో రూ.15 వేల కోట్లు ఇస్తున్నట్టు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడంపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ స్పందించారు. రూ.15 వేల కోట్ల సాయం ప్రకటించడం సంతోషమే అయినా.. దాని వెనుక ఉన్న రుణభారాలపై పునరాలోచన చేసుకోవాలని సీఎం చంద్రబాబుకు గురువారం బహిరంగ లేఖ రాశారు. వరల్డ్ బ్యాంక్, ఇతర సంస్థల భాగస్వామ్యంతో ఇచ్చే నిధులకు అదనంగా ఫైనాన్స్ కమిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాల్సి ఉంటుందని శర్మ లేఖలో ప్రస్తావించారు. వరల్డ్ బ్యాంక్, ఇతర విదేశీ సంస్థల నుంచి వచ్చే నిధులు డాలర్స్ రూపంలో ఉండటం వల్ల.. ఎక్స్ఛేంజ్ ధర పెరిగి రుణభారం అధికమవుతుందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. రూ.15 వేల కోట్లలో గ్రాంట్ ఎంత, రుణమెంత అనే దానిపై కేంద్ర ఆర్థిక శాఖతో చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. వరల్డ్ బ్యాంక్ ఇచ్చే రుణాలు అనేక షరతులతో ముడిపడి ఉంటాయనీ.. ఇలా ప్రతి అంశంపై ప్రభుత్వం దూరదృష్టితో వ్యవహరించాలన్నారు.

బ్రిక్స్ ప్రతినిధిగా ఆంధ్రా అమ్మాయి

- రష్యాలో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించిన ఆయేషా
- హెచ్‌సీయూలో ఆర్గానిక్ సింథసిస్‌లో పీహెచ్‌డీ చేస్తున్న ఆయేషా



సాక్షి, హైదరాబాద్: రష్యాలోని ఉలియనోస్క్ సిటీలో జరుగుతున్న బ్రిక్స్ దేశాల యూత్ మినిస్టర్స్ సదస్సులో భారత్‌తోపాటు వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ అంతర్జాతీయ వేదికపై పలువురు తమ ఆలోచనలు పంచుకుంటున్నారు. అప్పుడే ఒక మ్మాయి లేచి నిల్చుంది. తన మదిలో మెదులుతున్న భావనలను వేదికపై నిలబడి సగర్వంగా చాటిచెప్పింది. ఆమె చెప్పిన మాటలకు అక్కడున్న వారంతా చప్పట్లు కొట్టి ప్రశంసలతో ముంచెత్తారు. ఆమె పేరే షేక్ ఆయేషా. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న ఆయేషా దేశం తరపున బ్రిక్స్ సదస్సులో ప్రతినిధిగా పాల్గొన్న ఏకైక తెలుగమ్మాయి కావడం విశేషం.

పెందుర్తి టు సెంట్రల్ యూనివర్సిటీ

ఏపీలోని పెందుర్తికి చెందిన మదీనాబీబీ, వెంకటరమణ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వారిలో చిన్న కుమార్తె ఆయేషా. ఆమె డిగ్రీ వరకు విశాఖపట్నంలో చదవగా, విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేసింది. మూడేళ్ల క్రితం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సింథటిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీలో చేరింది.

ఐదు రోజుల సదస్సు

ఈ నెల 22న రష్యాలో ప్రారంభమైన బ్రిక్స్ యూత్ సదస్సు శుక్రవారంతో ముగియనుంది. ఈ సదస్సులో సామాజిక సేవ విషయంలో బ్రిక్స్ దేశాల మధ్య ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ ఉంటే బాగుంటుందని ఆయేషా ప్రతిపాదించింది. సంస్కృతి, యువత నాయకత్వం, కమ్యూనిటీ సర్వీస్ విషయంలో వలంటీర్ వర్క్ ఎలా జరుగుతుందనే విషయాలను బ్రిక్స్ దేశాల యువత పరస్పరం పంచుకోవాలని చెప్పింది. దీనిపై సదస్సులో చర్చ జరిగిందని, బ్రిక్స్ దేశాలు మద్దతిచ్చాయని ఆయేషా వెల్లడించింది.

సొంత పత్రం..రోత నాటకం!

నిస్సిగ్గుగా చంద్రబాబు నిరాధార ఆరోపణలు, వక్రీకరణలు

సాక్షి, అమరావతి: శాసనసభ వేదికగా సీఎం చంద్రబాబు మరోసారి తన కపట నాటకాన్ని ప్రదర్శించారు. శాంతి భద్రతలపై శ్వేతపత్రం ముసుగులో టీడీపీ రూపొందించిన ఓ కరపత్రాన్ని చదివి వినిపించారు. తాను ముఖ్యమంత్రిననే విషయాన్ని విస్మరించి టీడీపీ అధ్యక్షుడి పాత్ర పోషించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌పై నిస్సిగ్గుగా నిరాధార ఆరోపణలు, వక్రీకరణలతో సభను తప్పుదారి పట్టించేందుకు యత్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కళ్లెదుటే పచ్చమూకలు యథేచ్ఛగా సాగిస్తున్న హత్యలు, విధ్వంస కాండపై మౌనముద్ర వహిస్తూ నేరాలను ఏమాత్రం ఉపేక్షించబోనంటూ గాంభీర్యంగా ప్రకటించారు.

చంద్రబాబు ఆరోపణలు వాస్తవాలు

వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. హత్యలు, దాడులు, మహిళలపై వేధింపులు అమాంతం పెరిగాయి.

చంద్రబాబు కాకి లెక్కలతో చట్టసభను పక్కదారి పట్టించేందుకు యత్నించడం విస్తుగొలుపుతోంది. సర్కారు సొంత లెక్కలు ఎలా ఉన్నా దేశంలో ఏటా నేరాల వివరాలను వెల్లడించే జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదికలు మాత్రం వాస్తవాలను కళ్లకు కట్టినట్లు వెల్లడిస్తున్నాయి. 2014–19 వరకు టీడీపీ హయాంతో పోలిస్తే 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ పాలనలో ఏపీలో అన్ని రకాల నేరాలు తగ్గాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇరు ప్రభుత్వాల పాలన చివరి ఏడాదిలో నేరాలు, దాడులు, ప్రమాదాలు ఎలా ఉన్నాయో చెప్పేందుకు అధికారిక నివేదికలే నిదర్శనం.

	హత్యలు	దాడులు	దోపిడీలు, దొంగతనాలు	ఎస్సీ, ఎస్టీలపై నేరాలు	రోడ్డు ప్రమాదాలు
టీడీపీ ప్రభుత్వం 2018	883	20,464	13,734	2,528	20,369
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023	802	17,382	3,696	2,180	17,417

వైఎస్సార్‌సీపీ హయాంలో గంజాయి, డ్రగ్స్ దందా విచ్చలవిడిగా పెరిగింది.

రాష్ట్రంలో దశాబ్దాలుగా సాగుతున్న గంజాయి దందాను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థంగా కట్టడి చేసింది. గతంలో చంద్రబాబు హయాంలో టీడీపీ నేతల కనుసన్నల్లోనే ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో గంజాయి సాగు, అక్రమ రవాణా జరిగాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏవోబీలో గంజాయి సాగును కూకటి వేళ్లతో పెకలించింది. రెండు దశల్లో నిర్వహించిన 'ఆపరేషన్ పరివర్తన్' ద్వారా 11,500 ఎకరాల్లో గంజాయి సాగును ధ్వంసం చేసింది.

మహిళల భద్రతలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విఫలమైంది. దిశ యాప్‌తో ప్రయోజనం లేదు.

మహిళా భద్రత కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు చేపట్టింది. దిశ మొబైల్ యాప్, దిశ పోలీసు స్టేషన్లు, ఫోరెన్సిక్ ల్యాబ్‌లు, ప్రత్యేక కోర్టుల ఏర్పాటు, ప్రత్యేకంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం తదితర చర్యలతో నెలకొల్పిన వ్యవస్థలు మహిళల భద్రతకు గట్టి భరోసానిచ్చాయి. అందుకే దిశ యాప్‌ను ఏకంగా 1.56 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆపదలో ఉన్న అక్కచెల్లెమ్మలు దిశ యాప్‌లో ఎస్‌వోఎస్ బటన్ నొక్కినా, ఫోన్‌ను షేక్ చేసినా నిమిషాల వ్యవధిలోనే సాయం అందించి పోలీసులు కాపాడిన ఘటనలు అనేకం ఉన్నాయి. 2024 ఏప్రిల్ నాటికి యాప్ ద్వారా వచ్చిన 31,607 ఎస్‌వోఎస్ కాల్స్‌పై పోలీసులు తక్షణమే స్పందించి బాధితులకు భద్రత కల్పించారు. దిశ యాప్ జాతీయ స్థాయిలో ఏకంగా 19 అవార్డులు సాధించడం మహిళల భద్రత పట్ల గత ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. నేరం ఎక్కడ జరిగిందన్న విషయంతో సంబంధం లేకుండా తక్షణమే బాధితులకు భరోసా కల్పించి కేసులు నమోదు చేసేలా జీరో ఎఫ్ఐఆర్ విధానాన్ని తీసుకొచ్చారు. గ్రామ సచివాలయాల్లో మహిళా పోలీసులను నియమించి అక్క చెల్లెమ్మల భద్రత పట్ల అత్యంత శ్రద్ధ వహించారు.

చంద్రబాబుతో సహా టీడీపీ, జనసేన నేతలపై కేసులు పెట్టారు. వైఎస్ వివేకా హత్య కేసు దర్యాప్తును అడ్డుకున్నారు.

చంద్రబాబుపై రాజకీయ కక్షతో కేసులు నమోదు చేయలేదు. 2014–19లో టీడీపీ సర్కారు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ)లో నిధులు కొల్లగొట్టిన విషయాన్ని 2018లోనే కేంద్ర జీఎస్టీ అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు. ఏసీబీకి కూడా సమాచారం ఇచ్చారు. అయితే ఆ విషయాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం తొక్కి పెట్టింది. అనంతరం పుణేకు చెందిన ఓ సామాజికవేత్త ఈ విషయాన్ని ఏపీ ప్రభుత్వం దృష్టికి తేవడంతో సీఐడీ విచారణ మొదలైంది. నాడు ఏకంగా 13 చోట్ల ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు సంతకాలు చేసి మరీ స్కిల్ నిధులు కొల్లగొట్టారని ఆధారాలతో నిరూపితమైంది. అందువల్లే సీఐడీ ఆయన్ను అరెస్ట్ చేసింది. సీఐడీ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం రిమాండ్ విధించడంతో చంద్రబాబు 52 రోజులు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్నారు. అదే రీతిలో అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో అక్రమాలు, అసైన్డ్ భూముల కుంభకోణాల్లో చంద్రబాబు పాత్రను సీఐడీ ఆధారాలతో సహా బట్టబయలు చేసింది. ఇందులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అక్రమంగా వేధించడమనే ప్రశ్నే ఉత్పన్నం కాదు.

- వైఎస్ వివేకా హత్య కేసు దర్యాప్తును వైఎస్ జగన్ ప్రభావితం చేశారన్నది పూర్తి అవాస్తవం. కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ఆ కేసును దర్యాప్తు చేస్తోందనే విషయాన్ని విస్మరించి చంద్రబాబు నిరాధార ఆరోపణలు చేశారు.

కోడెలపై ఫర్నిచర్ దొంగతనం కేసు పెట్టారు. కానీ వైఎస్ జగన్ ప్రభుత్వ ఫర్నిచర్‌ను వెనక్కి ఇవ్వకున్నా పట్టించుకోలేదు.

స్పీకర్ కార్యాలయం కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన ఫర్నిచర్‌ను కోడెల శివప్రసాద్ గుంటూరులోని తమ కుటుంబానికి చెందిన ఆటోమొబైల్ షోరూమ్‌కు అక్రమంగా తరలించారు. అందుకే అప్పట్లో శాసన సభ స్పీకర్ ఆదేశాలతో పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ఫర్నిచర్‌ను వైఎస్ జగన్ ఎక్కడికి తరలించుకుపోలేదు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి రెండు సార్లు సాధారణ పరిపాలన శాఖ (జీ ఏడీ) ముఖ్య కార్యదర్శికి లేఖలు రాశారు. క్యాంపు కార్యాలయంలో ఉన్న ఫర్నిచర్‌ను వెనక్కి తీసుకోవాలని కోరుతూ జూన్ 15, 19వ తేదీల్లో రెండుసార్లు ఈ మెయిల్ ద్వారా లేఖలు పంపారు. అయినా సరే కూటమి ప్రభుత్వం స్పందించలేదు. దాంతో జూలై 1న మరో లేఖ రాశారు. ఆ ఫర్నిచర్‌ను వెనక్కి అయినా తీసుకోండి.. లేదంటే ఆ ఫర్నిచర్ విలువ చెబితే ఆమేరకు డబ్బులు చెల్లిస్తామని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వమే ఇప్పటివరకు నిర్ణయం తీసుకోలేదు. ఇక వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి పది దఫాలకుపైగా జీఏడీ ముఖ్య కార్యదర్శికి ఫోన్ చేసి ఆ ఫర్నిచర్‌ను వెనక్కి తీసుకెళ్లాలని సూచించారు. అయినా సరే ప్రభుత్వం స్పందించలేదు. ఇలా ఉంటే బాబు వక్రీకరించి బురదజల్లేందుకు యత్నించడం విడ్డూరంగా ఉంది. దీని వెనుక పక్కా కుట్ర దాగి ఉంది.

ఇంతకీ ఆ కుట్ర ఏమిటంటే...


ఫర్నిచర్‌ను తీసుకెళ్లాలని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి పంపిన లేఖపై జీఏడీ అధికారులు సమీక్షించారు. దీనిపై ఏ నిర్ణయం తీసుకోవాలనే అంశంపై సలహా కోసం సంబధిత ఫైల్‌ను ఆర్థిక శాఖ పరిశీలనకు పంపారు. దాన్ని పరిశీలించిన ఆర్థిక శాఖ.. ముఖ్యమంత్రి కార్యాలయం అభిప్రాయాన్ని తెలుసుకోవాలని భావించింది. ఈ నేపథ్యంలో ఆ ఫైల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాలయానికి పంపింది. సంబంధిత ఫైల్ ముఖ్యమంత్రి కార్యాలయంలో నెల రోజులుగా పెండింగ్‌లో ఉంది. అంటే ఆ ఫర్నిచర్‌ను వెనక్కి తీసుకెళ్లడంపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా చంద్రబాబు కార్యాలయమే ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందని స్పష్టంగా తెలుస్తోంది. చంద్రబాబే ఉద్దేశపూర్వకంగా ఆ ఫైల్‌ను తొక్కి పెట్టారు. మరోవైపు శాసనసభ వేదికగా వైఎస్ జగన్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. దుష్ప్రచారం కుట్రతో దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారు. చంద్రబాబూ...! ఇప్పటికైనా సరే సీఎంమ స్థాయికి తగ్గట్టుగా హుందాగా వ్యవహరించండి. శాసనసభలో మంది బలాన్ని చూసుకుని అడ్డగోలు ఆరోపణలు చేయాలనే మీ కుట్రలను సమర్థంగా తిప్పికొడతాం అని వైఎస్సార్ సీపీ శ్రేణులు స్పష్టం చేస్తున్నాయి.

దేశమంతా నిరసిస్తున్నా పట్టదా?

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జరుగుతున్న నరమేధం, దమనకాండపై మాత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నోరు మెదపలేదు. శ్వేతపత్రం పేరుతో వైఎస్సార్‌సీపీ సర్కారుపై బురద చల్లడం మినహా తన హయాంలో కొనసాగుతున్న మారణహోమంపై స్పందించాలనే ధ్యాసే లేకుండా వ్యవహరించారు. నెలన్నరలో 36 హత్యలు, 20 అత్యాచారాలు, వెయ్యికిపైగాగా దాడులతో రాష్ట్రంలో నెలకొన్న దారుణ పరిస్థితులపై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. తాజాగా వైఎస్సార్‌సీపీ ఢిల్లీలో నిర్వహించిన ధర్నాలో ఆ మారణహోమం ఫోటోలు, వీడియోలను పరిశీలించిన వివిధ జాతీయ పార్టీ నేతలు నివ్వెరపోయారు. దేశమంతా దీన్ని తీవ్రంగా ఖండించి నిరసిస్తున్నా సీఎం చంద్రబాబు శాసనసభలో కనీసం స్పందించకపోవడం ద్వారా టీడీపీ రౌడీ మూకల దమనకాండకు వత్తాసు పలికినట్లు స్పష్టమవుతోంది.

నేరాలను ఉపేక్షించం

శాంతి భద్రతలపై అసెంబ్లీలో సీఎం చంద్రబాబు శ్వేతపత్రం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నేటి నుంచి నేరాలు జరిగితే సహించబోమని.. ఎంతటి వారైనా, ఏ పార్టీకి చెందిన వారైనా కఠినమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. గత ఐదేళ్లలో గాడి తప్పిన శాంతి భద్రతలను గాటన పెడతానన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు, నేర చరితులకు స్థానం లేదని చెప్పారు. ప్రజలు కక్ష తీర్చుకోమని మనకు అధికారం ఇవ్వలేదని, రాజకీయ కక్షలు తీర్చుకోవాలనుకోవడం సరి కాదని సూచించారు. పోలీస్ శాఖలో మార్పు తీసుకొచ్చి కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన పెంచుతామన్నారు. 2019–24 వరకు రాష్ట్రంలో శాంతి భద్రతలు, గంజాయిపై గురువారం శాసనసభలో సీఎం శ్వేతపత్రం విడుదల చేశారు. రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని, హైదరాబాద్‌లో మతకల్లోలాలను తానే అరికట్టానని చెప్పారు. 2019–24 మధ్య రాష్ట్రంలో చీకటి పాలన నడిచిందని, పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రజాస్వామ్య పునాదులపై దాడులు చేశారని ఆరోపించారు. మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌పై తప్పుడు కేసులు పెట్టి ఆత్మహత్య చేసుకునేలా చేశారని, రామతీర్థం విషయంలో అశోక్‌గజపతిరాజుపై కేసులు పెట్టారని చెప్పారు. శస్త్ర చికిత్స చేయించుకున్న అచ్చెన్నాయుడిని అరెస్టు చేసి 600 కి.మీ తరలించారన్నారు. ప్రశ్నపత్రం లీకైందని పొంగూరు నారాయణపై కేసు పెట్టారని, రఘురామ కృష్ణరాజును అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారని ఆరోపించారు. సభలో ఉన్న కూటమి సభ్యుల్లో 80 శాతం మందిపై గత ప్రభుత్వం కేసులు పెట్టిందంటూ ప్రజెంటేషన్ ఇచ్చారు. వినుకొండలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గంజాయి మత్తులో దాడులు చేసుకోగా ఒకరు హత్యకు గురైనట్లు మాజీ ఎమ్మెల్యే సైతం ఒప్పుకోగా మాజీ సీఎం మాత్రం శాంతి భద్రతలు విఫలమయ్యాయని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో ప్రతిపక్షాలను నియంత్రించేందుకు జీవో నం.1 తెచ్చి టీడీపీ నాయకులపై 591 కేసులు, జనసేనపై 24 కేసులు పెట్టారన్నారు. అంగళ్లు, పుంగనూరు దాడుల ఘటనల్లో తిరిగి తనపైనే కేసులు పెట్టారన్నారు. ఐదేళ్లల్లో మహిళలు, ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగిపోయాయని, 300 మంది బీసీలు హత్యకు గురయ్యారని చెప్పారు. గత ఐదేళ్లలో ఎస్సీలపై 10,377, ఎస్టీలపై 1,768, మహిళలపై 89,875, చిన్నారులపై 8,641 పోక్సో కేసులు, నేరాలు జరిగాయన్నారు. ఏపీని గంజాయి రహిత రాష్ట్రంగా మారుస్తామని తెలిపారు.

చట్ట ప్రకారం నడుచుకోండి

నాగార్జున యాదవ్ విషయంలో కుప్పం పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి యనమల సాయి నాగార్జున అలియాస్ నాగార్జున యాదవ్ విషయంలో చట్ట ప్రకారం నడుచుకోవాలని కుప్పం పోలీసులను హైకోర్టు ఆదేశించింది. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ)లోని సెక్షన్ 35 (3) నిర్దేశించిన విధంగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాల్సిందేనని చెప్పింది. ఈ కేసులో ఫిర్యాదుదారు వరుణ్‌కు నోటీసులు జారీ చేసి, వాటిని వ్యక్తిగతంగా అందచేసేందుకు యాదవ్ న్యాయవాదికి అనుమతినిచ్చింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: ప్రముఖ విద్యావేత్త, భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి(గురుపూజోత్సవం)ని పురస్కరించుకుని సెప్టెంబర్ 5వ తేదీన ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత గల ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను ఆగస్టు 5వ తేదీలోగా మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాల్లో అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అర్హత సాధించిన వారికి రాష్ట్ర స్థాయి, నేషనల్ ఫౌండేషన్ ఫర్ టీచర్ అవార్డును ప్రదానం చేస్తామని తెలిపారు. అవార్డుకు దరఖాస్తు చేయని ఉపాధ్యాయుల తరపున ముగ్గురు సహ ఉపాధ్యాయులు ఉత్తమ అవార్డుకు సిఫారసు చేస్తూ దరఖాస్తు సమర్పించాలని సూచించారు. అందిన దరఖాస్తులను మండల, డివిజన్, జిల్లా స్థాయిలో కమిటీల ద్వారా స్క్రూటినీ చేసి ఆగస్టు 17వ తేదీ లోగా రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి పంపించాలని తెలిపారు.

ఆరోగ్యశ్రీ స్థానంలో బీమా పథకం!

సాక్షి, అమరావతి: ఆరోగ్యశ్రీ స్థానంలో బీమాను ప్రవేశపెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో బీమా రంగ నిపుణులతో వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం సమావేశమైనట్టు తెలిసింది. ఈ సందర్భంగా దేశంలో తమిళనాడు, గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో బీమా పథకాన్ని ఏ విధంగా అమలు చేస్తున్నారో ఆయన అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల్లో ఎంత మంది లబ్ధిదారులు కవర్ అవుతున్నారు? అందులో ఎంత మంది పథకాన్ని వినియోగించుకుంటున్నారు? ఎంత ఖర్చవుతోంది? వంటి అంశాలపై ఇంకా లోతుగా అధ్యయనం చేయాలని నిర్ణయించారు. కాగా, సీఎం ఆదేశాల మేరకు బీమా పథకాన్ని ప్రవేశపెట్టడానికి వైద్య శాఖ కసరత్తు ప్రారంభించింది. దేశంలో 14 రాష్ట్రాల్లో బీమా పథకం అమలు చేస్తున్నట్టు నిర్ధారించిన అధికారులు.. ఆయా రాష్ట్రాల్లో పథకం అమలు తీరు తెన్నులపై ఆరా తీస్తున్నారు.

ఆస్తిని పంచుకునే సమయంలో బంధువులు, తండ్రిలేని బిడ్డలు, నిరుపేదలు వస్తే అందులో నుంచి వారికీ కొంత ఇవ్వండి. (ఆ సందర్భాన) వారితో మృదువుగా మాట్లాడండి.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 26 జూలై 2024

పునః సమీక్ష జరగాలి!

కొద్దివారాలుగా కొనసాగుతున్న వివాదం కీలక ఘట్టానికి చేరుకుంది. దేశవ్యాప్తంగా వైద్యవిద్యా కళాశాలల్లో ప్రవేశం కోసం ఏటా జరిపే జాతీయస్థాయి పరీక్ష 'నీట్'లో అక్రమాలు జరిగాయన్న అంశంపై విచారణ చేస్తున్న దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నపత్రాల లీకైనమాట నిజమంటూనే, వ్యవస్థీకృతంగా భారీస్థాయిలో లీకులు జరగనందున పునఃపరీక్ష జరపాల్సిన అవసరం లేదని తేల్చేసింది. 'నీట్' వివాదంతో నెలన్నరగా నిద్ర లేని రాత్రులు గడుపుతున్న విద్యార్థులకూ, వారి తల్లితండ్రులకూ ఇది ఒకింత ఊరట, మరింత స్పష్టత. అభ్యర్థుల మానసిక ఒత్తిడిని దృష్టిలో ఉంచుకొని, దాదాపు 23 లక్షల మందికి పైగా హాజరైన పరీక్షను మళ్ళీ నిర్వహించాలని అనుకోకపోవడం మంచిదే. అయితే పేపర్ లీకులు, ఒకదాని బదులు మరొక ప్రశ్నపత్రం ఇవ్వడం, ఒకరి బదులు మరొకరు పరీక్షలు రాయడం, నిర్ణీత కేంద్రాల నుంచి మునుపెన్నడూ లేనంత మంది టాపర్లుగా అవతరించడం – ఇలా 'నీట్' నిర్వహణలో ఈసారి వివిధ స్థాయుల్లో జరిగిన అవకతవకలు అనేకం. వీటన్నిటితో వ్యవస్థపై ఏర్పడ్డ అపనమ్మకాన్ని తొలగించడం ఎలా అన్నది ఇప్పుడు అతి పెద్ద ప్రశ్న.

మొదట అసలు లోపాలు లేవని వాదించి, ఆనక తప్పుల్ని అంగీకరించినా కీలక చర్యలు చేపట్టడానికి కార్యనిర్వాహక వ్యవస్థ వెనకాడడం చూశాం. చివరకు న్యాయవ్యవస్థ జోక్యంతో ప్రక్షాళన అవసరమనే అంశం చర్చకు వచ్చింది. సుప్రీమ్‌కోర్ట్ ఆదేశాలతో 'జాతీయ పరీక్షా సంస్థ' (ఎన్టీఏ) 'నీట్' పరీక్షా ఫలితాలను సవరించి, గురువారం ప్రకటించాల్సి వచ్చింది. భౌతికశాస్త్రంలో ఒక ప్రశ్నకు రెండు జవాబులూ సరైనవేనంటూ విద్యార్థులకు ఈ ఏటి పరీక్షలో గ్రేస్ మార్కులు కలిపిన ఘనత 'నీట్'ది. అత్యధిక సంఖ్యలో టాపర్లు రావడానికీ అదే కారణమైంది. సదరు వివాదాస్పద ప్రశ్నకు సరైన జవాబు ఒకటేనంటూ సుప్రీమ్ జోక్యం తర్వాత ఐఐటీ – ఢిల్లీ నిపుణుల సంఘం ఖరారు చేసింది. దాంతో అయిదేసి మార్కులు కోతపడి, దాదాపు 4.2 లక్షల మంది విద్యార్థుల మార్కులు మారాయి. జూన్ 4న తొలుత ఫలితాలు ప్రకటించినప్పుడు టాప్ స్కోరర్ల సంఖ్య 61 కాగా, ఇప్పుడీ వివాదాలు, విచారణలు, మార్పుల తర్వాత అది 17కు తగ్గింది. మార్కులు, దరిమిలా ర్యాంకుల్లో మార్పులతో తాజా జాబితాను ఎన్టీఏ విడుదల చేయాల్సి వచ్చింది. పునఃపరీక్ష ఉండదని కోర్ట్ తేల్చేయడంతో, సవరించిన ర్యాంకుల్ని బట్టి ఇప్పుడిక ప్రవేశాలు జరగనున్నాయి.

ఎంబీబీఎస్ చదువు కోసం పెట్టిన ఈ దేశవ్యాప్త 'నీట్ – యూజీ' పరీక్షలు లోపభూయిష్ఠమనీ, మరీ ముఖ్యంగా స్థానిక విద్యార్థుల అవకాశాలకు హానికరమనీ రాష్ట్రాలు గగ్గోలు పెడుతున్నాయి. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమైన 'నీట్' వద్దంటూ తమిళనాడు కొన్నేళ్ళుగా పోరాడుతుంటే, పశ్చిమ బెంగాల్ సైతం బుధవారం గొంతు కలిపింది. తాజాగా కర్ణాటక అసెంబ్లీ సైతం 'నీట్' వద్దని గురువారం బిల్లును ఆమోదించింది. సొంతంగా రాష్ట్రస్థాయి మెడికల్ ఎంట్రన్ టెస్ట్ పెడతామంటూ తీర్మానించింది. అది చట్టపరంగా సాధ్యమేనా, కేంద్రం, సుప్రీమ్ కోర్ట్ ఏమంటాయన్నది పక్కన పెడితే, 'నీట్' పట్ల పెరుగుతున్న అపనమ్మకం, రాష్ట్రాల్లో అసంతృప్తికి ఇది నిదర్శనం. అసలు ఒకప్పుడు ఎక్కడికక్కడ రాష్ట్రస్థాయి ప్రవేశపరీక్షలే ఉండేవి. దేశంలో వైద్యవిద్య చదవదలచిన పిల్లలు ప్రతి రాష్ట్రంలో పరీక్షలు రాసే ఈ శ్రమ, ఖర్చును తప్పించడం కోసం జాతీయస్థాయిలో అందరికీ ఒకే పరీక్ష 'నీట్'ను ప్రవేశపెట్టారు. మంచి ఆలోచనగా మొదలైనా, ఆచరణలో అది అవకతవకలకు ఆస్కారమిస్తూ, విద్యార్థుల్ని మరింత ఒత్తిడికి గురి చేసేదిగా మారడమే విషాదం.

మళ్ళీ పరీక్ష జరపనక్కర లేదని సుప్రీమ్ ప్రకటించింది కానీ, అసలు తప్పులేమీ జరగలేదని మాత్రం అనలేదని గుర్తించాలి. ఇప్పటికైతే పాట్నా, హజారీబాగ్ – ఈ రెండుచోట్లా పేపర్ లీకైనట్టు కోర్టు నిర్ధరించింది. అలాగే, మరిన్ని వివరాలు తవ్వి తీసేందుకు సీబీఐ దర్యాప్తు కొనసాగుతుందనీ స్పష్టం చేసింది. విద్యార్థుల కౌన్సిలింగ్ వగైరా కొనసాగించవచ్చని అనుమతిస్తూనే, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు ఎదురవకుండా, పరీక్షల నిర్వహణ మరింత మెరుగ్గా ఎలా నిర్వహించాలన్న దానిపై మార్గదర్శకాలు రానున్నట్టు పేర్కొంది. అభ్యర్థుల బంగారు భవిష్యత్తు ఆధారపడిన పరీక్షలపై ఎన్టీఏలో నిర్లక్ష్యం ఎంతగా పేరుకుందో ఇటీవలి 'నీట్', యూజీసీ– నెట్ వివాదాలే నిదర్శనం. పరీక్షా కేంద్రాల ఎంపిక మొదలు కీలకమైన పనిని బిడ్డింగ్‌లో అవుట్ సోర్సింగ్‌కు అప్పగించడం దాకా లోపాలు అనేకం. అసలు ముందుగా ఎన్టీఏను ప్రక్షాళన చేయాలంటున్నది అందుకే. 'నీట్' సంగతే తీసుకున్నా పెన్ను– పేపర్ల విధానం నుంచి కంప్యూటర్ ఆధారిత ఆఫ్‌లైన్ పరీక్షకు మారాలని నిపుణుల మాట. 'జేఈఈ'లో లాగా రెండంచెల పరీక్షా విధానం ఉండాలనే సూచనా వినిపిస్తోంది. సంపూర్ణ అధ్యయనం, సమగ్ర చర్చతో తగిన చర్యలు చేపట్టడం ఇక భవిష్యత్ కార్యాచరణ కావాలి.

అసలు ఇవాళ దేశంలో అనేకచోట్ల చదువుల్లో పరీక్షా పత్రాల మొదలు పోటీపరీక్షల ప్రశ్నపత్నాల వరకు అన్నీ విపణిలో యథేచ్ఛగా లభిస్తున్న దుఃస్థితి. ఈ లీకుల జాడ్యాన్ని అరికట్టకపోతే ప్రతిభకు పట్టం అనే మాటకు అర్థం లేకుండా పోతుంది. రకరకాల పేపర్ లీకులతో తరచూ వార్తల్లో నిలుస్తున్న బిహార్ సైతం ఎట్టకేలకు లీకు వీరులను కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వ పరీక్షల (అక్రమాల నిరోధక) బిల్లును అసెంబ్లీలో బుధవారం ఆమోదించింది. అన్నిచోట్లా ఇలాంటి కఠిన చట్టాలు అవసరమే. అయితే, అమలులో చిత్తశుద్ధి, అంతకన్నా ముందు ఆ చట్టాల దాకా పరిస్థితిని రానివ్వ కుండా లీకులకు అడ్డుకట్ట వేయడం ముఖ్యం. 'నీట్' పునర్నిర్వహణకు కోర్టు ఆదేశించకున్నా, తప్పులు జరిగాయని తేటతెల్లమైంది గనక మన పరీక్షా వ్యవస్థలు, విధానాలపై పునఃసమీక్ష, ప్రక్షాళనకు దిగాలి. అదీ పారదర్శకంగా జరగాలి. 'నీట్' లీకువీరులకు కఠిన శిక్షతో అందుకు శ్రీకారం చుట్టాలి.

భారత్, నేపాల్ సంబంధాలకు పరీక్ష

విశ్లేషణ



జయంత్ ప్రసాద్

కేపీ శర్మ ఓలీ నాలుగోసారి నేపాల్ ప్రధాని అయ్యారు. తన తొలి పదవీకాలంలో ఓలీ భారత్‌ను చికాకుపెట్టారు. ఉదాహరణకు, బీర్‌గంజ్ సమీపంలోని థోరి నిజమైన అయోధ్య అని పేర్కొన్నారు. భారత్‌తో నేపాల్ సరిహద్దును విస్తరిస్తూ నేపాల్ మ్యాప్‌ను, రాజ్యాంగాన్ని మార్చారు. అయితే ఆయన చైనా అనుకూలుడనే సాధారణ అభిప్రాయం సరికాదు. ఆయన జాతీయవాద నాయకుడు. నేపాల్ స్థిరత్వాన్ని, అభివృద్ధిని కోరుకుంటారు. అందుకు భారత్‌తో సన్నిహిత సంబంధాలను కలిగి ఉండటం తప్పనిసరి. చైనాతో నేపాల్ సత్సంబంధాలను కొనసాగించడంలో భారత్‌కు ఎలాంటి సమస్య లేదు. కానీ భౌగోళికం, చరిత్ర, సంస్కృతితో పాటు ఇరు దేశాల మధ్య బహిరంగ సరిహద్దు భారత్–నేపాల్ సంబంధాన్ని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి.

నేపాల్‌లో కొత్త ప్రధానమంత్రి అధికారంలోకి రావడంతో, రాజ్యాంగ రాచరికాన్ని స్థాపించిన 1990 నాటి జన ఆందోళన్ నుండి ప్రభుత్వ అధిపతికి సంబంధించి 30వ మార్పును నేపాల్ చూసినట్లయింది. పైగా 2006లో అదే రాచరికాన్ని రద్దు చేసి పార్లమెంటరీ గణతంత్రాన్ని స్థాపించిన లోక్‌తంత్ర ఆందోళన తర్వాత ఆ దేశంలో ప్రభుత్వాధిపతి మారడం 15వ సారి. గత తొమ్మిదేళ్లలో నేపాల్‌లో ప్రభుత్వం 8 సార్లు మారింది. నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీ (యూనిఫైడ్ మార్క్సిస్ట్–లెనినిస్ట్)కి చెందిన కేపీ శర్మ ఓలీ, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్ట్ సెంటర్)కు చెందిన పుష్ప కమల్ దహల్, నేపాలీ కాంగ్రెస్‌కి చెందిన షేర్ బహదూర్ దేవుబా వరుసగా ప్రధానమంత్రులు అవుతున్నారు. అయితే నేపాల్‌లో జరుగుతున్న రాజకీయ మార్పులతో భావజాలానికి సంబంధం లేదు.

ఓలీ స్పష్టమైన మెజారిటీతో నాలుగోసారి ప్రధాని అయ్యారు. 275 మంది సభ్యులున్న ప్రతినిధుల సభలో ఆదివారం (జూలై 21) ఆయన ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానానికి అనుకూలంగా 188 ఓట్లు రావడంతో, మూడింట రెండు వంతుల మెజారిటీతో విజయం సాధించారు. భారత్‌లో నేపాల్ మాజీ రాయబారి, ఖాట్మండు యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ లోక్ రాజ్ బరాల్ ఇటీవల నేపాలీ రాజకీయాలు 'అసంబద్ధతలతో నిండి ఉన్నాయి' అని అభివర్ణించారు. తన తొలి పదవీకాలంలో ఓలీ భారత్‌ను చికాకుపెట్టారు. అనేక భారత్ వ్యతిరేక ఎత్తుగడలు వేశారు. ఉదాహరణకు, బీర్‌గంజ్ సమీపంలోని థోరి నిజమైన అయోధ్య అని పేర్కొన్నారు. నేపాల్ పురావస్తు శాఖ ఈ ప్రాంతంలో తవ్వకాలు జరపడం గురించి పరిశీలిస్తోందని కొన్ని వార్తా సంస్థలు నివేదించాయి. 'సత్యమేవ జయతే' కాదు, 'సింహదేవ జయతే' అనేది భారతదేశ జాతీయ నినాదంగా కనిపిస్తోందని అన్నారు. భారత్‌తో నేపాల్ సరిహద్దును ఉత్తరం వైపు కాకుండా, వాయువ్యంగా విస్తరిస్తూ నేపాల్ మ్యాప్‌ను, రాజ్యాంగాన్ని మార్చారు. తద్వారా వివాదాస్పద ప్రాంతాన్ని అనేక రెట్లు పెంచి, పరిష్కారాన్ని కష్టతరం చేశారు.

ఓలీ చైనా అనుకూలుడనే సాధారణ అభిప్రాయం సరికాదు. ఆయన జాతీయవాద రాజకీయ నాయకుడు. నేపాల్ స్థిరత్వాన్ని, అభివృద్ధిని కోరుకుంటారు. అందుకు భారత్‌తో సన్నిహిత సంబంధాలు తప్పనిసరి. చైనాతో నేపాల్ సత్సంబంధాలను కొనసాగించడంలో భారత్‌కు ఎలాంటి సమస్య లేనప్పటికీ... ఇరు దేశాల మధ్య బహిరంగ సరిహద్దు, భౌగోళికం, చరిత్ర, సంస్కృతి భారత్–నేపాల్ సంబంధాన్ని ప్రత్యేకంగా మారుస్తున్నాయి.

ఇప్పటికే అంగీకరించిన విద్యుత్ వాణిజ్యం, వాతావరణ మార్పుల సహకారం, అనుసంధానంపై చొరవతో కూడిన కార్యక్రమాల ద్వారా దీనిని మరింతగా మార్చవచ్చు. గత రెండేళ్లుగా, నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ కాళీగండకి, త్రిశూలి, దేవిఘాట్‌లోని తన జలవిద్యుత్ కేంద్రాలలో ఉత్పత్తి చేసిన మిగులు విద్యుత్తును ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ ద్వారా భారత్‌కు యూనిట్‌కు రూ. 6 కంటే ఎక్కువ లాభదాయకమైన ధరకు విక్రయిస్తోంది. ఏప్రిల్ 2022లో ఆమోదించిన విద్యుత్ రంగ సహకారంపై భారత్–నేపాల్ ఉమ్మడి దార్శనికతా ప్రకటన మూడు కార్యకలాపాలను అంచనా వేసింది. నేపాల్‌లోని విద్యుత్ రంగ ప్రాజెక్టుల ఉమ్మడి అభివృద్ధి, సీమాంతర సరఫరా మౌలిక వ్యవస్థ, ద్వి–దిశాత్మక విద్యుత్ వాణిజ్యం. అయితే నేపాల్‌లోని కొన్ని ప్రతికూల శక్తులు వీటిని వ్యతిరేకిస్తున్నాయి.



భారత ప్రధాని మోదీతో నేపాల్ ప్రధాని ఓలీ (ఫైల్)

నేపాల్‌కు అత్యంత అనుకూలంగా వ్యవహరించిన భారత ప్రధాని చంద్రశేఖర్ 1991 ఫిబ్రవరిలో ఖాట్మండును సందర్శించినప్పుడు, ఒక విలేఖరుల సమావేశంలో జలవిద్యుత్ రంగంలో భారత్–నేపాల్ సహకార అవకాశాల గురించి విస్తృతంగా మాట్లాడారని గుర్తుచేసుకోవడం ఆసక్తికరం. ఆ సమావేశం తర్వాత నేపాలీ యువ జర్నలిస్ట్ విజయ్ కుమార్‌ను తనతో కలిసి టీ తాగడానికి భారత ప్రధాని ఆహ్వానించారు. అప్పుడు చంద్రశేఖర్ చెప్పిన మొదటి విషయం, ''జనాల మేత కోసం నేను చెప్పిన మాటలను నమ్మవద్దు'' అని. విజయ్ కలవరపడటం చూసి, తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని బల్లియా గ్రామంలో కరెంటు లేని ఒక గుడిసెలో తన పెంపకం గురించి వివరించారు. భారత్ త్వరలో విముక్తి పొందుతుందని తండ్రి ఆయనతో అన్నారు: ''అభివృద్ధి పథంలో మన మిత్రదేశం నేపాల్ నడిచినప్పుడు మనకు కరెంట్ ఇస్తుంది. ఇప్పుడు మన జుట్టు నెరిసిందిగానీ నేపాల్ నుంచి మన ఇంటికి కరెంట్ రాలేదు. నేపాల్ తనను చీకట్లో ఉంచుకుంటుంది, మనల్నీ చీకట్లోనే ఉంచుతుంది.''

పరిస్థితులు ఎలా మారిపోయాయో ఈ ఉదంతం వివరిస్తుంది. గత కొన్ని దశాబ్దాలుగా నేపాల్‌కు భారత్ విద్యుత్తును సరఫరా చేస్తుండగా, ఇప్పుడు అది మారింది. అయితే నేపాల్ మిగులు విద్యుత్తును మాత్రమే భారత్ కొనుగోలు చేస్తోంది. ఇది నేపాల్ వాణిజ్య సంతులనాన్ని సరిదిద్దుతుంది. నేపాల్ తన వాణిజ్యాన్ని సమతుల్యం చేసుకోవడానికి మరొక మార్గం ఏమిటంటే, భారత్ నుంచి పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం ఆపేసి, వాటిని మరో చోటునుంచి దిగుమతి చేసుకోవడం.

నేపాల్‌కు భారత్ ఏకైక చమురు సరఫరాదారు. 2019 సెప్టెంబరులో భారత్‌లోని మోతీహారి (బిహార్) నుండి నేపాల్‌లోని అమలేఖ్‌గంజ్ వరకు దక్షిణాసియాలో మొట్టమొదటి సీమాంతర పెట్రోలియం ఉత్పత్తుల పైప్‌లైన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ, ఓలీ సంయుక్తంగా ప్రారంభించారు. నేపాల్‌కు క్రమం తప్పకుండా సరసమైన పెట్రోలియం సరఫరాలను నిర్ధారించడానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ షెడ్యూల్ కంటే ముందే దీన్ని నిర్మించింది. నేపాల్ విద్యుత్‌ను భారత్ దిగుమతి చేసుకోవడమే కాకుండా, బంగ్లాదేశ్‌కు నేపాల్ విద్యుత్‌ను సరఫరా చేయడానికి అంగీకరించే యోచనలో ఉంది. ఇది దక్షిణాసియాలోని ఏదైనా మూడు దేశాలలో మొదటి త్రైపాక్షిక ఏర్పాటు.

నేపాల్‌తో రవాణా, కనెక్టివిటీ కోసం భారత్ ఇతర దేశాల కంటే ఎక్కువ చేయగలదు. బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ కింద, ట్రాన్స్–హిమాలయన్ మల్టీ–డైమెన్షనల్ కనెక్టివిటీ నెట్‌వర్క్‌ను నిర్మిస్తామని చైనా హామీ ఇచ్చింది. అయితే క్షేత్రస్థాయిలో దానికి ఎలాంటి ఆధారాలు లేవు. ఖాట్మండుకు రైలు మార్గాన్ని నిర్మించడం ద్వారా, జలమార్గాల గుండా బంగాళాఖాతంలోకి నేపాల్‌కు యాక్సెస్‌ను అందించడం ద్వారా నేపాల్ భూపరివేష్టిత పరిస్థితిని సమర్థవంతంగా ముగించేలా భారత్ ప్రతిపాదించింది. బిహార్‌లోని రక్సోల్–ఖాట్మండు రైలు లింక్ తుది స్థాన సర్వే నివేదిక గతేడాది జూన్ నుండి నేపాల్ ప్రభుత్వం వద్ద ఉంది.

నేపాల్‌తో చైనా కుదుర్చుకున్న 2016 ట్రాన్సిట్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ ఒప్పందం అనేక చైనీస్ ఓడరేవుల లోకి నేపాల్‌కు ప్రాప్యతను ఇస్తుంది. కానీ గత ఎనిమిదేళ్లలో, సుదీర్ఘమైన, ఆర్థికంగా లాభసాటి కాని దూరాల కారణంగా ఈ మార్గాలు ఉపయోగించలేదు. నేపాల్‌కు సంబంధించి మూడవ దేశ వాణిజ్యం కోల్‌కతా, విశాఖపట్నంలోని భారతీయ ఓడరేవుల ద్వారా కొనసాగుతోంది. గల్ఫ్, పశ్చిమాసియా, ఆఫ్రికా లేదా యూరప్‌కు ఎగుమతి చేయడానికి నేపాల్‌కు భారత పశ్చిమ తీరప్రాంతంలోని కాండ్లా వంటి ఓడరేవులు అవసరమైతే, భారత్ దాన్ని సులభతరం చేస్తుంది.

నేపాల్‌లో తరచూ జరిగే నాయకత్వ మార్పు స్థానిక రాజకీయ అస్థిరతకు దారితీస్తుంది. తమ సాంస్కృతిక సాన్నిహిత్యం వల్ల భారతీయులు, నేపాలీలు ఒకరి పట్ల మరొకరు కొంత ఉదాసీనంగా ఉన్నారు. బదులుగా, వారు పరస్పరం ఎక్కువగా పట్టించుకోవాలి.

వ్యాసకర్త నేపాల్‌లో భారత మాజీ రాయబారి

('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అదే రహస్యం!



క్రమంగా తమ బరువు తగ్గినవారు వాళ్ల పద్ధతుల గురించి ఇంటి పైకప్పు లేచిపోయేలా అరిచి చెప్పరు. ఎత్తిపొడిచినట్టు ఆ 'రహస్యాన్ని' వాళ్లు చెప్పినా ఎవరూ నమ్మరు. ఎందుకంటే అందులో రహస్యం ఏమీలేదు. ఇంట్లో వండింది తినడం, వ్యాయామం, త్వరగా నిద్రపోవడం... ఇంతే!

– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

తొలి విజేత



72 ఏళ్ల క్రితం, ఈ వారంలో, ఖశాబా దాదాసాహెబ్ జాధవ్ భారత్ తరఫున వ్యక్తిగత విభాగంలో మొట్టమొదటి ఒలింపిక్ పతకాన్ని గెలుచుకున్నారు. ఫిన్‌లాండ్‌లోని హెల్సింకీలో జరిగిన 1952 ఒలింపిక్స్‌లో ఆయన ఈ ఘనత సాధించారు.

– అమిత్ పరంజపే, వ్యాఖ్యాత

ఇండియా అందం



ఒక ముస్లిం మహిళా ఎంపీ పార్లమెంటులో నిలబడి, తన నియోజకవర్గం (కైరానా, ఉత్తర ప్రదేశ్) నుంచి కశ్మీర్‌లోని హిందువుల యాత్రాస్థలి వైష్ణోదేవికి రైలు వేయమని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇదీ ఇండియాలోని అందం. ఈ ఇండియా అంటేనే మోదీ, షా భయపడతారు. వెల్ డన్ ఇక్రా హసన్!

– రోషన్ రాయ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

నూరుశాతం ప్రయత్నించండి!



నూరు శాతం కనీస మద్దతు ధరకు హామీ అనేది కాంగ్రెస్ మేనిఫెస్టోలో భాగమే కదా! అది ఆచరణీయమే అని రాహుల్ గాంధీ నమ్ముతున్నప్పుడు, ఒక పైలట్ ప్రాజెక్టుగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఆయన ఎందుకు చేయరు? అది సఫలమైతే ఆయన విజేత. లేదంటే కనీసం ప్రయత్నించినట్టు అవుతుంది.

– మోహన్ సిన్హా, విశ్లేషకుడు

వ్యతిరేక పార్టీ



తమ జీవిత కాలం డెమోక్రాట్లుగా ఉన్న వాళ్లు (అమెరికాలోని) డెమోక్రాటిక్ పార్టీ వేగంగా యూదు వ్యతిరేకంగా మారుతున్నదన్న వాస్తవాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేరు. ఇది పెరుగుతున్నదే గానీ, తగ్గడం లేదు.

– ఎలాన్ మస్క్, వ్యాపారవేత్త

అంబేడ్కర్ దారిలో అలుపెరుగక...

'ఈ ప్రపంచాన్ని జయించడానికి ప్రేమతో మొదలవ్వు. ప్రేమ త్యాగమై, యుద్ధ గీతమై, అదో గొప్ప పోరాటాన్ని విశ్వవ్యాప్తం చేస్తుంది. నిన్ను విజేతగా నిలబెడుతుంది' అంటారు 71 ఏళ్ల సాహితీ వేత్త, దళితోద్యమ నాయకుడు డా॥ కత్తి పద్మారావు. ఆయన జీవితం – సాహిత్యం – ఉద్యమాలు వేర్వేరు కావు. పరిణామ క్రమంలో ప్రవాహ సదృశ్యంగా కొన సాగుతూ వచ్చిన, గుణవాచి అయిన కాల ధర్మం! అంబేడ్కర్ దార్శనికతనూ, తాత్వికతనూ, వివేచనా నిపుణతనూ ఆకళింపు చేసుకున్న ప్రథమ శ్రేణి ఆచరణ శీలుడాయన. అంబేడ్కర్ మార్గంలో పూలే నుండి పెరియార్ మీదగా చార్వాకుడు, బుద్ధుని వరకూ... ఆ తరువాతి నవ్య సిద్ధాంతకర్తలనూ, చరిత్రకారులనూ పరిశీలించి ఆకలింపు చేసుకున్నారు. సంస్కృత పాండిత్యం వల్ల అపారమైన అధ్యయనం, పరిశీలన, రచనా శక్తి అబ్బింది. జలపాతం సదృశ్యమైన వాక్చాతుర్యం, సమయస్ఫూర్తి, ఉత్తేజ పరచటం, వాదనా పటిమలతో అత్యుత్తమ రీతిలో ప్రజలకు చేరువయ్యారు.



డా॥ కత్తి పద్మారావు

కారంచేడు, కొత్తకోట, నీరుకొండ, పిప్పర్ల బండ్ల పల్లి, చుండూరు, పదిరి కుప్పం, వేంపెంట, లక్షింపేట వంటి ఉద్యమాలలో నాయకునిగా నిలిచి, ప్రభుత్వాలతో పోరాడి, ప్రజాయుద్ధంతో విజయాన్ని సాధించారు. కారంచేడు, చుండూరు వంటి ఉద్యమాలలో బాధితుల పక్షాన నిలబడి వారికి వందల ఎకరాల భూములు ఇప్పించి, బాధిత కుటుంబాల పిల్లలకు ప్రభుత్వ సహాయం ఏర్పాటు చేసి, ఉద్యోగాలు ఇప్పించి, చిల్లిగవ్వ కూడా ప్రభుత్వ సొమ్ములను ఆశించకుండా నిజాయితీగా, నిబద్ధతతో తమ రచనలను నమ్ముకుని, అమ్ముకుని జీవనం సాగిస్తున్న అక్షర సంపన్నులాయన. పార్లమెంటు సాక్షిగా 111 మంది ఎంపీలతో '1989 ప్రివెన్షన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టా'న్ని తీసుకు రాగలిగారు.

'బౌద్ధ దర్శనం', 'చార్వాక దర్శనం', 'దళితుల చరిత్ర,' 'బ్రాహ్మణవాద మూలాలు', 'కులం ప్రత్యామ్నాయ సంస్కృతి', 'పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ', 'భారత రాజకీయాలు – కులాధిపత్య రాజకీయం – ప్రత్యామ్నాయ వ్యక్తిత్వాలు', 'అంబేడ్కర్ చూపు' వంటి 89 రచనలను అందించారు.

ఆయన కుటుంబం అంతా కులాంతర వివాహాలు చేసుకున్నారు. స్వయంగా తన చేతుల మీదుగా కొన్ని వేల కులాంతర వివాహాలు జరిపించడం ద్వారా ఒక సామాజిక మార్పునకు మార్గదర్శిగా నిలిచారు. మొత్తంగా ఆయన రచనల సారాంశం... ఉద్యమ రూపం, ప్రశ్న, ప్రతిఘటన, ప్రగతిగా సాగుతుంది. సమకాలీన రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో కత్తి పద్మారావు పాత్ర ఎవరూ తిరస్కరింపలేనిది.

– శిఖా ఆకాష్, నూజివీడు । 93815 22247

(రేపు డా॥ కత్తి పద్మారావు 71వ జన్మదినం సందర్భంగా...)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

రాష్ట్రపతి భవనంలో మిస్సైల్ మ్యాన్!

సందర్భం



జిల్లా గోవర్ధన్

అదృష్ట దేవత ఎప్పుడు ఎలా తలుపు తడుతుందో ఎవరూ ఊహించలేరు. భారత ప్రభుత్వం ప్రిన్సిపల్ సైంటిఫిక్ సలహాదారుగా, ఢిల్లీలో విధులు నిర్వహిస్తున్న 'మిస్సైల్ మ్యాన్' అవుల్ ఫకీర్ జైనులబ్దీన్ (ఏపీజే) అబ్దుల్ కలాం, 71వ ఏట, విశ్రాంత జీవితం కోసం డిసెంబర్ 2001లో చెన్నై చేరుకున్నారు. హాబీ కోసం అన్నా యూనివర్సిటీలో పార్ట్ టైం ప్రొఫెసర్ వర్కు ఎంచుకున్నారు ఆయన.

ఆ రోజు (జూన్ 10, 2002) సాయంత్రం 5 గం.లు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఛాంబర్‌లో ల్యాండ్ ఫోన్ ఆగకుండా మ్రోగటంతో, స్టాఫ్ విసుగుతో ఫోన్ ఎత్తి తమిళంలో, 'హలో, యారదు'(ఎవరది) అని ప్రశ్నించటంతో, 'దిస్ ఈజ్ ఫ్రమ్ పీఎంఓ ఆఫీస్, ఢిల్లీ. ప్రధాని కలాం సర్‌తో మాట్లాడాలి, పిలవండి' అని అవతలి గొంతు వినిపించింది. పీఎంఓ మాట విని భయంతో, 'సార్, క్లాసులో పాఠం బెబుతున్నారు. అది అవగానే కబురు చేస్తాను సార్' అన్నాడు ఆఫీసు క్లర్కు. ఆరు గంటలకు, లెక్చర్ ముగించిన కలాం వరండాలో నడుస్తున్నది చూసి, వైస్ ఛాన్సలర్ ఏ. కళానిధి ఆయనకు ఎదురెళ్లి ఆతృతగా, 'సార్ ఢిల్లీ నుండి మెసేజ్, ప్రధాని మీతో అర్జంటుగా మాట్లాడాలట' అని అన్నాడు. ఆశ్చర్యంతో కలాం కనుబొమ్మలు ముడివడ్డాయి. 'ఏమై ఉంటుందబ్బా?' అనుకుంటూ వీసీ ఆఫీసు రూం కెళ్ళి, పీఎంఓకు ఫోన్ చేశారు. లైన్లో ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి! 'హలో కలాం సర్, హౌ ఈజ్ యువర్ అకాడమిక్ లైఫ్?' అన్న ఆయన ప్రశ్నకు, 'ఇట్ ఈజ్ వెరీ వండర్‌ఫుల్ సార్' కలాం జవాబు. 'ఇక అది వదలి, మీరు నా కోసం ఢిల్లీ రావలసి ఉంటుంది' అంటూ గట్టిగా నవ్వారు ప్రధాని. సడన్‌గా జోకులు పేల్చి ఎదుటి వారిని తికమక పెట్టడం అటల్‌జీకి వెన్నతో పెట్టిన విద్య. 'వింటున్నారా కలాంజీ' మళ్ళీ ప్రశ్న. 'యస్ సార్.' 'ఇవాళ మధ్యాహ్నం జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ మీటింగులో రాష్ట్రపతి అభ్యర్థిత్వానికి మీ పేరును ప్రస్తావించారు. మీ సమ్మతి కోసమే ఎదురుచూస్తున్నాము.' ఊహించని పీఎం ప్రతిపాదనకు ఎటూ తోచలేదు కలాంజీకి. 'ఆలోచించుకోవటానికి కొంత వ్యవధి ఇవ్వండి సార్' అని మాత్రం అనగలిగారు. 'మీరు జస్ట్ ఓకే అనండి, రాష్ట్రపతి భవనంలోకి తీసుకెళ్ళే బాధ్యత నాది; ఫర్లేదు, రాత్రి 8.30 గంటల వరకూ మీకు సమయం ఉంది. ఆలోచించుకోండి; నో మాత్రం అనొద్దు ప్లీజ్' అంటూ ఫోన్ పెట్టేశారు ప్రధాని.

విషయం విని వైస్ ఛాన్సలర్ కళానిధి సంతోషం పట్టలేక కలాం చేయి అందుకుని, 'అభినందనలు సార్', అని అన్నారు. కలాం గారి మిత్ర బృందంలో ఈ వార్త అదే రాత్రి సుడిగాలిలా వెళ్ళింది. అందరిదీ ఒకే మాట... 'వెతుక్కుంటూ వచ్చిన ఈ అవకాశాన్ని వదలుకోవద్దు' అని. ఇక రాత్రి 8.45 గంటలకు ప్రధాని కార్యాలయం నుండి మళ్ళీ కాల్. ప్రధాని ప్రపోజల్‌కు 'యస్' అన్నారు కలాం. 13వ త్రిశంకు లోక్ సభలో బీజేపీకి దక్కిన సీట్లు కేవలం 182. బహుళ పార్టీల మద్దతుతో ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వం వాజ్‌పేయి నేతృత్వంలో కత్తి మీది సాములా కొనసాగుతోంది. రాష్ట్రపతి ఎన్నికకు బీజేపీ అభ్యర్థికి ఎలెక్టోరల్ కాలేజీలో సరిపోను సంఖ్యా బలం కూడా లేదు అప్పటికి. ఐదు పదుల అలుపెరుగని పార్లమెంటరీ అనుభవం ఆయనది. అదే ఆత్మ విశ్వాసంతో, రాజకీయాలకు అతీతంగా ఉన్న ప్రఖ్యాత సైంటిస్టు, ఏపీజే కలాం పేరును రాష్ట్రపతి పదవికి అధికారికంగా ప్రకటించారు. తనదైన శైలిలో చక చక పావులు కదిపి, ప్రతిపక్షంలోని సీనియర్ నాయకులు శరద్ పవార్, ములాయం సింగ్, లాలూ యాదవ్ లను సంప్రదించి, కలాం అభ్యర్థిత్వాన్ని సుగమం చేశారు వాజ్‌పేయి. ఎన్డీఏ నాయకుల సమక్షంలో జూన్ 18న అబ్దుల్ కలాంతో నామినేషన్ వేయించారు. రెండు రోజుల తర్వాత కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని కలిసి, కలాంకు కాంగ్రెస్ పార్టీ మద్దతు కూడా సంపాదించి, జూలై 25న 11వ రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం జరిపించి తీరారు ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి.



చివరిగా, దేశ ప్రథమ పౌరునిగా అబ్దుల్ కలాం పేరును ఎన్డీఏ తెరపైకి తెచ్చిన ఘనత మన తెలుగు ఐఏఎస్ అధికారి ఎస్వీ ప్రసాద్‌దే అన్న విషయం ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి.

అప్పట్లో అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రికి ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న ప్రసాద్... కలాం పేరు రాష్ట్రపతి పదవి కోసం సూచించారు. ఎన్డీఏ కన్వీనర్ హోదాలో ఉన్న నాటి ఏపీ సీఎం... వాజ్‌పేయికి ఈ ప్రతిపాదన చేశారు.

వ్యాసకర్త విశ్రాంత పీఎఫ్ కమిషనర్, ముంబై । 98190 96949

('టర్నింగ్ పాయింట్స్, ఎ జర్నీ త్రూ ఛాలెంజెస్' అనే అబ్దుల్ కలాం గ్రంథం ఆధారంగా...)

భక్తుని వేదన

సాధారణంగా కష్టాలు ఒకదాని మీద ఒకటి వచ్చి పడుతున్నప్పుడు ప్రతికూల పరిస్థితుల్లో మనిషి నిరాశకు గురవుతాడు. తన ప్రార్థనలు, వినతులు దైవం వినిపించుకోడా ఏమిటి అనే సందేహం కలుగుతుంది. భగవంతునికి అనేక మంది భక్తులుంటారు. వాళ్ళు గొప్పగా పూజలు చేస్తుంటారు. అంతమందిలో తానేం గుర్తుంటాడు? ఇలా ఆలోచిస్తూ సాధారణంగా నిస్పృహకు లోనవుతుంటారు మానవులు.



సరిగ్గా భక్త హృదయాలను చదివినట్లుగా నరసింహ శతక కవి, 'ఓ దేవా! నా వంటి సేవకుల సమూహం నీకు కోట్ల కొలది ఉంటారు. వారి సందడిలో, వారి సేవలలో నన్ను అశ్రద్ధతో మర్చిపోవద్దు. వారి పుణ్యాతిశయం చేత చాలా మంది సేవకులు నీ వెంట పడేవారుండగా నీకు నేనే మాత్రం! నీవు మెచ్చే పనులు నేను చేయలేను. ఈ భూజనులలో నేను పనికిమాలిన వాణ్ణి. అయినా, నీ శుభమైన చూపు నాపై ప్రసరించు' అని ప్రార్థిస్తాడు.

అలాగే 'నా రెండు కన్నులతో నిన్ను చూసే భాగ్యం నాకెప్పుడు? నా మనసులో కోర్కె తీరునట్లు నీ రూపం చూపించు. పాపం చేసినవారికి కనిపించనని ప్రమాణం చేసుకున్నావా? కానీ, పాపులను పరిశుద్ధులను చేసే దేవుడివి నువ్వే అని మహాత్ములంతా నిన్ను స్తుతిస్తారు. పాపులను రక్షించి నందుకే నీకింత కీర్తి. చెడ్డవాడినైననూ నాకు కనిపించవా!' అని వేడుకుంటాడు.

ఇందులో భక్తులందరి వేదనా ఉంది. ఆర్తి ఉంది. తనను మాత్రమే దేవుడు పట్టించుకోవట్లేదేమో అనే సందేహం ఉంది. భగవంతుని కరుణ శీఘ్రంగా తనపై ప్రసరించాలని, ఆ దివ్య రూపాన్ని కళ్లారా దర్శించి తరించాలనే తపన ఉంది. తాను భగవంతుడు మెచ్చే పనులు చేయటం లేదేమో, అందుకే ఆయన దయ తనకు లభించడం లేదేమో, అలా మెప్పించే శక్తి తనకు లేదుకదా అనే నిస్సహాయత ఉంది. భగవంతుని విషయంలో భక్తుల హృదయాలలో సహజంగా కనిపించే వేదన ఇదే!

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.పంచమి ఉ.5.56 వరకు, తదుపరి షష్ఠి తె.3.29 వరకు (తెల్లవారితే శనివారం), **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.7.05 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ఉ.5.41 నుండి 7.10 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.23 వరకు, **అమృతఘడియలు:** ప.2.35 నుండి 4.05 వరకు. ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.40, **సూర్యాస్తమయం:** 6.32.

క్లుప్తంగా

టీటీడీ అదనపు ఈవో, జేఈవోగా వెంకయ్య చౌదరి

సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అదనపు ఈవోగా సీహెచ్ వెంకయ్య చౌదరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులిచ్చారు. జేఈవోగా కూడా వెంకయ్య చౌదరి విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు సీఎంగా పనిచేసిన సమయంలో కూడా ఇండియన్ రెవెన్యూ సర్వీసుకు చెందిన వెంకయ్య చౌదరిని డిప్యుటేషన్‌పై ఏపీకి తీసుకువచ్చి ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా నియమించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన కేంద్ర సర్వీసుకు వెళ్లిపోయారు. మళ్లీ వెంకయ్య చౌదరిని రాష్ట్ర సర్వీసుకు డిప్యుటేషన్‌పై పంపాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం కోరడంతో కేంద్రం అందుకు ఆమోదం తెలిపింది.

ముందస్తు బెయిల్ ఇవ్వండి
హైకోర్టులో వాసుదేవరెడ్డి పిటిషన్

సాక్షి, అమరావతి: కృష్ణాజిల్లా, గుడివాడ పోలీసులు ఈనెల 5న తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఏపీ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) మాజీ ఎండీ డి.వాసుదేవరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీఎస్‌బీసీఎల్ లిక్కర్ గోడౌన్ లీజు గడువు ముగియక ముందే తమను బెదిరించి బలవంతంగా ఖాళీ చేయించారంటూ దుగ్గిరాల ప్రభాకర్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా గుడివాడ పోలీసులు వాసుదేవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొడాల నాని తదితరులపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ తాజాగా వాసుదేవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

పొగాకు రైతుకు శుభవార్త
అదనపు పొగాకు కొనుగోలు చేస్తామని కేంద్రం ప్రకటన

సాక్షి ప్రతినిధి, గుంటూరు: దాదాపు 63 టన్నుల అదనపు పొగాకు కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ వాణిజ్య మంత్రిత్వ శాఖ గెజిట్ విడుదల చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో పొగాకు పంట సాగు చేసి మిచాంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన గుర్తింపు పొందిన రైతులకు చెందిన అదనపు పొగాకు పంటపై విధించే అపరాధ రుసుంను సైతం పూర్తిగా రద్దు చేసింది. పొగాకు బోర్డులో నమోదు అయిన రైతులకు మాత్రమే ఈ అపరాధ రుసుం రద్దు వర్తించనుంది. 2023–24 పంట కాలంలో 142 మిలియన్ కిలోల దిగుబడికి మాత్రమే అనుమతి ఇవ్వగా.. అంతర్జాతీయ డిమాండ్ కారణంగా 205.5 మిలియన్ కిలోల పొగాకును రైతులు పండించారు. దీంతో 63 టన్నుల అదనపు పొగాకును కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. దేశంలో గుజరాత్ తర్వాత అత్యధికంగా పొగాకు పండించే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. ఈ ఏడాది వర్జీనియా పొగాకు ధర రికార్డు స్థాయికి చేరుకుంది. రోజురోజుకు పెరుగుతూ వస్తున్న పొగాకు ధర మార్కెట్లో కిలో గరిష్ఠ ధర రూ. 400, కనిష్ఠ ధర రూ. 259, సగటు ధర రూ. 388 లభించింది. గురువారం పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ తన కార్యాలయంలో మాట్లాడుతూ పొగాకు బోర్డు, కేంద్ర ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నదని వివరించారు. పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దళితుల పొలంలో రోడ్డా!
తక్షణమే తొలగించాలని ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ మారుపూడి విక్టర్ ప్రసాద్ ఆదేశం



పెసర్లంక(భట్టిప్రోలు): దళితుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు సైతం తీవ్రంగా విఫలమవుతున్నారని ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ మారుపూడి విక్టర్ ప్రసాద్ ధ్వజమెత్తారు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెసర్లంక గ్రామానికి చెందిన యన్నం సురేష్ పంట పొలంలో అక్రమంగా రోడ్డు వేసిన విషయమై విచారణ నిమిత్తం గురువారం ఆ గ్రామంలో పర్యటించారు. పంట పొలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత నెల జూన్ 18న అతడి పంట పొలాన్ని ధ్వంసం చేసి మధ్యలో రోడ్డు వేసినా.. ఇప్పటి వరకు నిందితులపై చర్యలెందుకు తీసుకోలేదని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. పోలీసులు బాధితుడిని బెదిరించడంతో దిక్కుతోచని స్థితిలో ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. పోలీస్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే బాధితుడి కుటుంబంపై పలుమార్లు దాడులు జరిగాయన్నారు. తక్షణమే రోడ్డును తొలగించి నిందితులపై కేసు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ జె. రాజదిబోరా, బాపట్ల డీఎస్పీ మురళీ కృష్ణ, వేమూరు సీఐ పి.రామకృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

సోమిరెడ్డి అనుచరుల దురాగతం
వాటర్ బేస్ కంపెనీ ఉద్యోగులపై టీడీపీ నేతల దాడి


వరకయపూడి వద్ద కంపెనీ ఉద్యోగులను బస్సు నుంచి దించి చుట్టుముట్టిన టీడీపీ నేతలు

- 16 మందికి గాయాలు
- తమ అనుచరులకే ఉద్యోగాలివ్వాలని డిమాండ్
- సోమిరెడ్డి ఒత్తిడితో ఫిర్యాదు చేసేందుకు జంకుతున్న యాజమాన్యం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ నేతల దురాగతాలు పెచ్చుమీరాయి. ఇప్పటివరకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడి ఆస్తుల్ని ధ్వంసం చేసిన టీడీపీ నేతలు ఇప్పుడు పారిశ్రామిక రంగంపై కన్నేశారు. పరిశ్రమల యాజమాన్యాల నుంచి సొమ్ములు దండుకునేందుకు భయభ్రాంతుల్ని చేస్తున్నారు. తాజాగా.. టీపీ గూడూరు మండలం అనంతపురంలోని వాటర్ బేస్ కంపెనీ ఉద్యోగులపై టీడీపీ నేతలు దాడికి పాల్పడి 16 మందిని తీవ్రంగా గాయపరిచారు.

పథకం ప్రకారమే దాడి

జిల్లాలోని సముద్ర తీరం వెంబడి రొయ్యల ప్రాసెసింగ్, మేత తయారీ యూనిట్లు ఉన్నాయి. టీపీ గూడూరు మండలం అనంతపురం వద్ద ది వాటర్‌బేస్ లిమిటెడ్ కంపెనీని దశాబ్దం కిందట నెలకొల్పారు. రొయ్యల ఫీడ్ ఉత్పత్తి చేసే ఈ కంపెనీ ఏటా రూ.200 కోట్ల వరకు టర్నోవర్ చేస్తుంది. అందులో 200 మంది ఉద్యోగులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి 150 మంది వరకు రోజువారీ లేబర్‌గా పనిచేస్తున్నారు. ఆ కంపెనీపై టీడీపీ నేతల కన్ను పడింది. ప్రస్తుతం కంపెనీలో పనిచేసే డైలీ లేబర్ పోస్టులు తమ కార్యకర్తలు సూచించిన వారికే ఇవ్వాలనే డిమాండ్ తెరమీదకు తెచ్చారు. 10 రోజుల్లో ఆ కూలీలను తొలగించి తాము చెప్పిన వారినే పెట్టుకోవాలని బెదిరించారు. ప్రస్తుతం పనిచేస్తున్న లేబర్‌ను తొలగించేందుకు న్యాయపరమైన చిక్కులు న్నాయని యాజమాన్యం కొంత సమయం ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేసి యాజమాన్యంపై ఒత్తిడి పెంచేందుకు గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులకు స్కెచ్ వేశారు. నిత్యం నెల్లూరు నుంచి అనంతపురం వద్ద ఉన్న కంపెనీకి ఉద్యోగులను తీసుకొచ్చే వాహనాన్ని టీడీపీ నేతలు, కార్యకర్తలు వరకయపూడి వద్ద అడ్డుకుని అందులో ప్రయాణిస్తున్న ఉద్యోగులను కిందికి దించి కర్రలతో దాడి చేశారు. దాడిలో 16 మంది గాయపడ్డారు. కంపెనీ హెచ్‌ఆర్ హెడ్ ఉత్తమ్‌కుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆయనను చికిత్స కోసం నెల్లూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.


ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీడీపీ నేతలు

ఉద్యోగుల ఆందోళన

ఉద్యోగులపై పథకం ప్రకారం టీడీపీ నేతలు దాడులకు తెగబడటంపై ఉద్యోగులు ఆందోళనకు దిగారు. టీడీపీ నాయకుల నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరుతూ వరకయపూడి రచ్చబండ వద్ద ధర్నా నిర్వహించారు. కంపెనీ యాజమాన్యంపై ఉన్న అక్కసుతో ఉద్యోగులపై దాడులు చేయడం ఎంతవరకు న్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. 16 మంది ఉద్యోగులకు గాయాలైనప్పటికీ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కంపెనీ యాజమాన్యం జంకుతోంది. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆ కంపెనీ యాజమాన్యాన్ని బెదిరింపులకు గురిచేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.


తిరుమల శ్రీవారిని మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వైద్యనాథన్, మైసూర్ మహారాణి ప్రమోదా దేవి ఒడయార్ గురువారం దర్శించుకున్నారు. - తిరుమల


ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత గురువారం దర్శించుకున్నారు. స్వామి వారికి అభిషేకం, అర్చనలు, పూజలు చేయించారు. - తవణంపల్లె


విజయవాడ కనక దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం దర్శించుకున్నారు. పంచహారతుల సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. - ఇంద్రకీలాద్రి

కాపుకాసి కట్టెలతో దాడి

- వైఎస్సార్‌సీపీ నేతలపై విరుచుకుపడిన టీడీపీ నాయకులు
- ఇద్దరికి తీవ్ర గాయాలు


దాడిలో గాయపడిన సుధాకర్, మురళి, బ్రహ్మానందరెడ్డి

యాడికి/పెద్దవడుగూరు: రాజకీయ కక్షతో టీడీపీ నాయకులు కాపుకాసి వైఎస్సార్ సీపీ నేతలపై దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ నాయకులకు తీవ్ర గాయాలయ్యాయి. గురువారం రాత్రి అనంతపురం జిల్లా యాడికి మండలం పుప్పాల గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పుప్పాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్, రంగస్వామిలను ఓ కేసు విషయంపై పోలీసులు గురువారం యాడికికి పిలిపించారు. సాయంత్రం బైండోవర్ చేశారు. అనంతరం సుధాకర్ గ్రామానికే చెందిన మురళితో కలిసి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. వీరి వాహనం రాత్రి 8 గంటల సమయంలో గ్రామ సమీపానికి చేరుకోగా.. అప్పటికే అక్కడ కాపుకాసిన టీడీపీ నాయకులు దేవన్న, గంగిరెడ్డి, ప్రభాకర్, చరణ్, సుంకిరెడ్డి సురేష్, మహేష్ రాజు, శివ, చంద్రన్న తదితరులు కట్టెలతో దాడి చేశారు. ఈ ఘటనలో మురళి, సుధాకర్ తలలు పగిలి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘటనా స్థలానికి రాగా, టీడీపీ నాయకులు పరారయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ నాగార్జునరెడ్డి పుప్పాల చేరుకుని అల్లర్లు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతల దాడి

అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలోని లక్ష్మంపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై గురువారం సాయంత్రం టీడీపీ నాయకులు దాడి చేశారు. దీంతో ఐదుగురికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మంపల్లి గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్త సత్యంరెడ్డి బైక్‌పై ఇంటికి వెళుతుండగా, టీడీపీ నేతలు హితేష్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి వాహనానికి అడ్డు వచ్చారు. అయినప్పటికీ సత్యంరెడ్డి వారిని తప్పించుకుని ఇంటికి వెళ్లడానికి ప్రయత్నించారు. టీడీపీ నేతలు ఆయన వాహనాన్ని వెంబడించి అడ్డుకున్నారు. ఆ సమయంలో అక్కడ ఉన్న వైఎస్సార్‌సీపీ తాడిపత్రి నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బ్రహ్మానందరెడ్డి, మరికొందరు వారిని ప్రశ్నించారు. దీంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతలు హితేష్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, రాజశేఖర్, సోమశేఖర్‌రెడ్డి తమ వెంట తెచ్చుకున్న కర్రలతో దాడిచేశారు. ఈ ఘటనలో బ్రహ్మానందరెడ్డి తలకు తీవ్ర గాయాలు కాగా, సత్యంరెడ్డితోపాటు మరో ఇద్దరు మహిళలు, ఒక వృద్ధుడికి కూడా గాయాలయ్యాయి.

షికారుపాలెంలో మహిళపై దాష్టీకం

వీరబల్లి: ఓ మహిళ పట్ల ఇద్దరు మహిళలు అమానుషంగా ప్రవర్తించారు. చెట్టుకు కట్టేసి మరీ కొట్టి గాయపర్చారు. అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం షికారుపాలెంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. షికారుపాలేనికి చెందిన మనోహర్, విజయలక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలు. అదే గ్రామంలో రబ్బరు పూల వ్యాపారం చేసే బ్రహ్మయ్య భార్య అయిన కొండమ్మతో మనోహర్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమెకూ ఇద్దరు పిల్లలు. బ్రహ్మయ్య స్వయానా మనోహర్ భార్య విజయలక్ష్మికి అన్న. ఐదు నెలల కిందట మనోహర్.. కొండమ్మను తీసుకుని ఊరు వదిలి వెళ్లిపోయాడు. దీంతో మనోహర్ భార్య కూడా పిల్లలతో కలిసి అదే ఊరిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఇదిలా ఉండగా, బుధవారం మనోహర్.. కొండమ్మను షికారుపాలేనికి తెచ్చి తన ఇంట్లో పెట్టుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మనోహర్ భార్య విజయలక్ష్మి, ఆమె తల్లి నాసరమ్మలు కొండమ్మను ఇంట్లోంచి బయటకు లాక్కొచ్చి.. చెట్టుకు కట్టేశారు. వావివరసలు మరచి ప్రవర్తించావంటూ చీపురుకట్టలు, కోడిగుడ్లతో తీవ్రంగా కొట్టారు. సమాచారం అందుకున్న ఎస్ఐ చంద్రమోహన్ సంఘటన స్థలానికి వెళ్లి ఈ దారుణాన్ని నిలువరించారు. కొండమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొండమ్మను రాయచోటి ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

వైవీయూ ఆచార్యుడికి ప్రతిష్ఠాత్మక ఫెలోషిప్



వైవీయూ: విదేశీ పరిశోధకులకు దక్షిణ కొరియా రీసెర్చ్ ఫౌండేషన్ అందించే 'బ్రెయిన్ పూల్ ఫెలోషిప్–2024' కడప వైవీయూ మెటీరియల్ సైన్స్ అండ్ నానోటెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీ శంకర్‌కు లభించింది. దక్షిణ కొరియాలోని ప్రపంచ ర్యాంకింగ్ సంస్థ కొంకుక్ వర్సిటీలో పనిచేయడానికి శంకర్‌ను ఆహ్వానించింది. ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 81 మంది సభ్యుల్లో ఈయన ఒకరు. వీసీ ఆచార్య కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య రఘునాథరెడ్డి గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. శంకర్‌కు పరిశోధనలు చేయడానికి అవసరమైన సమగ్ర సహాయాన్ని వర్సిటీ అందజేస్తుందని హామీ ఇచ్చారు. యోగి వేమన యూనివర్సిటీలో ప్రొఫెసర్ శంకర్ పరిశోధన, అకడమిక్ అంశాలతో పాటు అంతర్జాతీయ శాస్త్రీయ సమాజంలో అత్యుత్తమ ప్రభావవంతమైన శాస్త్రవేత్తల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఆయన 2020, 2021, 2022, 2023ల్లో 'మెటీరియల్స్ అండ్ ఎనర్జీ' రంగంలో ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన శాస్త్రవేత్తల జాబితాలో మొదటి ఇద్దరిలో ఒకరిగా నిలిచారు. పరిశోధనకు గుర్తింపుగా పలు శాస్త్రీయ సంస్థల నుంచి గ్రాంట్‌లు లభించాయి. 2022 సంవత్సరం యూకే (ఎఫ్.ఆర్.ఎస్.సి)లో ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. స్కోపస్ ఇండెక్స్ జర్నల్స్‌లోని పరిశోధనా ప్రచురణ ఆధారంగా గత నాలుగేళ్లలో ఈయన అద్భుతమైన పరిశోధన పత్రాలు రాశారు. శంకర్ స్పందిస్తూ వర్సిటీ అధికారులు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గుప్త నిధుల కోసం విగ్రహాల తొలగింపు?

- విగ్రహాల తొలగింపులో నిబంధనలు పాటించని ఈవో
- విగ్రహాల కింద గుప్త నిధులు మాయమైనట్టు ప్రచారం
- టీడీపీ నేతల హస్తం ఉందని స్థానికుల్లో చర్చ
- దేవదాయ శాఖ అధికారుల రహస్య విచారణ


గర్భగుడిలో విగ్రహాలు తొలిగించిన దృశ్యం(ఇన్‌సెట్‌లో) నల్లగొండలో ఉన్న పురాతన దేవాలయం

వింజమూరు (ఉదయగిరి): నెల్లూరు జిల్లా వింజమూరు మండలం నల్లగొండ్లలోని పురాతన లక్ష్మీనరసింహ క్షేత్రంలో గుప్త నిధులను కాజేసేందుకు నిబంధనలకు విరుద్ధంగా విగ్రహాలు తొలగించడంపై దుమారం రేగుతోంది. ఈ వ్యవహారం గురువారం వెలుగులోకి వచ్చింది. రెండో శతాబ్దానికి చెందిన ఈ పురాతన ఆలయంలో జీర్ణోద్ధరణ పనుల నిమిత్తం పంచలోహ విగ్రహాలను తొలగించారు. ఈ ప్రక్రియను శాస్త్రబద్ధంగా చేపట్టలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈవో మల్లికార్జునరెడ్డి గర్భగుడిలో ఉన్న సంతాన వేణుగోపాలస్వామి, రంగనాయకుల స్వామి విగ్రహాలను ఈ నెల 13న గుట్టుచప్పుడు కాకుండా తొలగించడం వివాదానికి దారితీసింది. ఆ విగ్రహాల కింద విలువైన గుప్త నిధులున్నాయని, వాటిని గుట్టుచప్పుడు కాకుండా దారి తప్పించారనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీనివెనుక టీడీపీ పెద్దల హస్తం ఉన్నట్టు రచ్చ మొదలుకావడంతో దేవదాయ శాఖ డీఈ జనార్దనరావు అదే రోజున ఆలయానికి వెళ్లి విగ్రహాలు తొలగింపును చూసి అవాక్కయ్యారు. దీనిపై దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌కు ఈ నెల 15వ తేదీన నివేదిక పంపారు.

విచారణకు రావడంతో..

డీసీ ఆదేశాలతో దేవదాయ శాఖ జ్యూవెలరీ వెరిఫికేషన్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రమౌళి మంగళవారం ఆలయానికి వెళ్లి విగ్రహాలు తొలగించిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు పరాంకుశం సత్యనారాయణాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ కార్య నిర్వహణ అధికారిని విచారించారు. గ్రామస్తులతో ప్రత్యేకంగా మాట్లాడారు. విచారణ సందర్భంగా ఈవో మల్లికార్జునరెడ్డి కీలక విషయాలను చెప్పకుండా దాటవేశారు. వాస్తవాలు బయటకు పొక్కకుండా విచారణాధికారిని కూడా ప్రభావితం చేసినట్టు ప్రచారం జరుగుతోంది. పురాతన ఆలయాల్లో విగ్రహాలు తొలగించాలంటే ముందుగా దేవదాయ శాఖ అధికారులు, ఆలయ పాలకవర్గానికి సమాచారం ఇవ్వాలి. వారితోపాటు రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులు, ఆలయ ప్రధానార్చకులు, ఇతర వేద పండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాల నడుమ విగ్రహాలు తొలగించాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ ఇక్కడ ఇవేమీ చేయకుండా విగ్రహాలు తొలగించడం వెనుక ఉన్న రహస్యం ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై చంద్రమౌళిని వివరణ కోరగా.. విచారణలో వెల్లడైన అంశాలతో ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని చెప్పారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సొంత జిల్లాలోనే విగ్రహాల తొలగింపు అంశం దుమారం రేపుతోంది.

సత్తెనపల్లిలో వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెల కూల్చివేత
అధికార పార్టీ నేతల ఆగడాలకు వంతపాడుతున్న అధికారులు


పట్టణంలోని 15వ వార్డులో కూల్చి వేసిన వైఎస్సార్ సీపీ జెండా దిమ్మె

సత్తెనపల్లి : పల్నాడు జిల్లా సత్తెనపల్లి పురపాలక సంఘంలో అధికార పార్టీ నేతల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు వై ఏపీ నీడ్స్ జగన్‌లో భాగంగా పట్టణంలోని వివిధ వార్డుల్లో వైఎస్సార్‌సీపీ జెండాలను ఆవిష్కరించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన జెండా దిమ్మెలు రోడ్ల పక్కనే ఏర్పాటు చేసినా.. కేవలం వైఎస్సార్‌సీపీ జెండాలనే అధికారులు ఏకపక్షంగా ధ్వంసం చేస్తున్నారు. పట్టణంలోని 31 వార్డులకు గాను 15 వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెలను ఏర్పాటు చేయగా.. గురువారం వాటిని పగులగొట్టారు. ఆయా వార్డుల్లో పక్కనే కాంగ్రెస్ పార్టీ, టీడీపీ జెండా దిమ్మెలు, మున్సిపల్ కార్యాలయానికి ఆనుకుని రోడ్డు పక్కన సీపీఎం జెండా దిమ్మెలున్నా.. వాటిని జోలికి వెళ్లలేదు. 24వ వార్డులో వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెను కూల్చి వేసిన ప్రాంతాన్ని ఆ పార్టీ నేతలు చల్లంచర్ల సాంబశివరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, యాసారపు బాబు, శెట్టి ఆనంద్, తుమ్మల వెంకటేశ్వరరావు, సెగ్గెం నాగేశ్వరరావు, గంటా ఏసుబాబు, షేక్ మహమ్మద్ గని, వల్లెం నరసింహారావు, ఉల్లంగుల ప్రసాద్‌బాబు, హైదరాబాద్ సుభాని తదితరులు సందర్శించి పరిశీలించారు. దిమ్మెలను ధ్వంసం చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ ఆగడాలు నశించాలని నినాదాలిచ్చారు. దిమ్మెల కూల్చివేతపై మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మిని వివరణ కోరగా పబ్లిక్ ప్రదేశాల్లో ఉన్న వాటిని తొలగిస్తున్నామని చెప్పారు. మిగిలిన రాజకీయ పార్టీల జెండా దిమ్మెలను తొలగించకపోవడంపై ప్రశ్నించగా.. అన్నింటినీ తొలగిస్తామని తెలిపారు.

ఎంపీపీపై దాడికి బాలకృష్ణ పీఏ ప్లాన్


- 27 నాటి సమావేశంలోనూ దాడి చేయాలని ఆదేశాలు
- పోలీసు ఉన్నతాధికారులను కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు

సాక్షి, టాస్క్ ఫోర్స్: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ పీఏ శ్రీనివాసరావు ఆదేశాల మేరకే చిలమత్తూరు ఎంపీపీ, వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులపై బుధవారం టీడీపీ నేతలు దాడికి యత్నించినట్లు తెలుస్తున్నది. కాగా, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, ఎంపీటీసీ సభ్యులపై దాడి విషయం ఎంపీడీఓ రామ్‌కుమార్‌కు ముందే తెలిసినా.. భద్రత కోరలేదని వైఎస్సార్ సీపీ నేతలు చెబుతున్నారు.కాగా, బుధవారం నాటి సర్వసభ్య సమావేశం జరగకుండా ఆపడం ఒక ఎత్తయితే, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, ఎంపీటీసీ సభ్యులపై దాడి చేయడం మరొక ఎత్తు. అదీ ఫెయిల్ కావడంతో ఈ నెల 27న జరగనున్న సర్వసభ్య సమావేశం రోజున దాడులు చేయాలని ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ శ్రీనివాసరావు టీడీపీ శ్రేణులను ఆదేశించారని విశ్వసనీయ సమాచారం. టీడీపీలో రెండు వర్గాలు ఉండగా, నాగరాజు వర్గం మాత్రమే దాడులకు ప్లాన్ చేసింది. మరో వర్గం దాడికి సిద్ధం కాకపోవడంతో ఎమ్మెల్యే పీఏ వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

ఎస్పీని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు

ఈనెల 27న నిర్వహించనున్న సర్వసభ్య సమావేశంపై పోలీసులు దృష్టి సారించారు. మారణాయుధాలతో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులపై దాడి జరిగే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ అధికారుల సమాచారం నేపథ్యంలో ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గురువారం ఎస్పీ రత్నను కలిసేందుకు పుట్టపర్తికి వెళ్లారు. ఆమె అందుబాటులో లేకపోవడంతో అడిషనల్ ఎస్పీ విష్ణును కలిసి తమకు భద్రత కల్పించాలని కోరారు. బుధవారం తమపై దాడి చేయాలనుకున్న జెడ్పీటీసీ గొల్ల అనూష మామ నాగరాజు యాదవ్, ఆయన అనుచరులు, టీడీపీ నేత బాబురెడ్డిపై కేసు నమోదు చేయాలని వినతిపత్రం అందించారు.

సంగమేశ్వర ఆలయ గోపురాలను తాకిన కృష్ణాజలాలు
మూడురోజుల వ్యవధిలోనే జలాధివాసంలోకి సంగమేశ్వరాలయం



కొత్తపల్లి: నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన, సప్తనదీ సంగమ ప్రాంతంలో వెలసిన సంగమేశ్వరాలయ గోపురాలను గురువారం కృష్ణా జలాలు తాకాయి. జూరాల ప్రాజెక్ట్ నుంచి శ్రీశైలం ప్రాజెక్ట్‌కు 1,60,798 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో జలాశయం నీటిమట్టం 852.5 అడుగులకు చేరుకుంది. సంగమేశ్వరం వద్ద కృష్ణాజలాలపై తేలియాడుతున్నట్లు ఆలయ గోపురాలు కనువిందు చేస్తున్నాయి. భారీగా వరద జలాలు శ్రీశైలం జలాశయానికి వస్తుండటంతో 3 రోజుల్లోనే ఆలయం పూర్తిగా జలాధివాసం అవుతోంది. దీంతో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆలయ గోపురాలకు విశేష పూజలు నిర్వహించారు.

బాలికపై లైంగిక దాడి.. 20 ఏళ్ల జైలు

విశాఖ లీగల్ : అతి కిరాతకంగా హింసించి ముక్కుపచ్చలారని చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన ఓ మృగాడికి 20 ఏళ్ల జైలు, రూ.10 వేల జరిమానా, అది చెల్లించకపోతే మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొంటూ విశాఖలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది గురువారం తీర్పు చెప్పారు. బాధిత బాలికకు రూ.4 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసెక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లా ఆనందపురం మండలం పీకే గ్రామంలో నిందితుడు లారీక్లీనర్ ఉప్పాడ గౌరీ శంకరరావు (21) ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన బాధిత బాలిక విజయనగరం జిల్లా ఎల్.కోట మండలంలో గురుకుల పాఠశాల్లో ఏడో తరగతి చదువుతున్నది. కరోనా నేపథ్యంలో 2020 అక్టోబర్‌లో బాలిక తమ ఇంటికి వచ్చింది. 2020 అక్టోబరు 17వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో చిన్నారి కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం తన ఇంటికి సమీపంలోని నమ్మి అప్పల నరసయ్య పశువుల శాల దగ్గరకు వెళ్లింది. అప్పటికే బాలికపై కన్నేసిన నిందితుడు గౌరీ శంకరరావు బాలికను పశువుల పాకలోకి తీసుకెళ్లి అతి కిరాతకంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. నిందితుని అకృత్యాలకు బాలిక సొమ్మసిల్లి పడిపోయింది. బాలిక సమయానికి ఇంటికి రాకపోవడంతో ఆమె సోదరుడు చుట్టుపక్కల వెదకగా పశువుల శాలలో కనిపించింది. వెంటనే బాలిక సోదరుడు బాలికను ఇంటికి తీసుకువెళ్లి ప్రాథమిక ప్రాథమిక చికిత్స అందించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు.



టీచరమ్మగా రాష్ట్రపతి

భూతాపాన్ని ఎలా తగ్గించాలో విద్యార్థులకు వివరించిన ముర్ము

న్యూఢిల్లీ: దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము టీచర్‌గా మారారు. రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు చేపట్టి రెండేళ్లయిన సందర్భంగా గురువారం ఆమె విద్యార్థులతో ముచ్చటించారు. భూతాపం పర్యవసానాలు, తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వారికి వివరించారు. ప్రెసిడెంట్ ఎస్టేట్‌లోని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ కేంద్రీయ విద్యాలయలో 9వ తరగతి చదువుకునే 53 మంది విద్యార్థులతో ఆమె సంభాషించారు. మొక్కల పెంపకం, వాననీటి సంరక్షణ అవసరాన్ని తెలియజెప్పారు. ముఖాముఖి సందర్భంగా వారి ఆకాంక్షలు, లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. చదువుకుని వైద్యులు, శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఉందంటూ వారు చెప్పిన లక్ష్యాలను విని సంతోషం వ్యక్తం చేశారు. 'ప్రపంచవ్యాప్తంగా నేడు శాస్త్రవేత్తలు, పాలనాధికారులు, పాలకులు సభలు, చర్చాగోష్టులు, సమావేశాలు చేపట్టి ఓ పెద్ద సమస్యపై చర్చలు జరుపుతున్నారు. అదేమిటో మీకు తెలుసా?' అని వారినడిగారు. వాతావరణ మార్పులు, భూతాపం, పర్యావరణ కాలుష్యం..అంటూ విద్యార్థులు బదులిచ్చారు. రాష్ట్రపతి ముర్ము బదులిస్తూ..'ఇది వరకు ఏడాదిలో ఆరు రుతువులుండేవి కానీ, నేడు నాలుగే ఉన్నాయి. వీటిలో అత్యధిక కాలం కొనసాగుతూ మనల్ని ఇబ్బంది పెట్టే రుతువు ఎండాకాలం. రోజురోజుకూ ఎండలు మండిపోతుండటంతో మనుషులే కాదు, జంతువులు, మొక్కలు, పక్షులూ ఇబ్బంది పడుతున్నాయి. కరువులు కూడా ఏర్పడుతున్నాయి. భూతాపమే వీటికి కారణం'అని ఆమె వివరించారు. 'భూతాపాన్ని ఎదుర్కోవాలంటే నీటిని పొదుపుగా వాడాలి. వర్షం నీటిని సంరక్షించాలి. చెట్లను విరివిగా పెంచాలి'అని వారికి సూచించారు.

ఆ రికార్డుపై కమలా హారిస్ కన్ను

అమెరికా చరిత్రలో ఉపాధ్యక్షులుగా ఉంటూ అధ్యక్షులు అయింది నలుగురే

హారిస్ గెలిస్తే ఐదో నేత అవుతారు	అగ్రరాజ్యాధినేతగా తొలి మహిళ అవుతారు	ఆసియా మూలాలున్న నేతగా, నల్లజాతి మహిళగా పలు రికార్డులు సొంతం అవుతాయి

వారం పది రోజుల కిందటి దాకా ఏకపక్షంగా సాగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసును కమలా హారిస్ ఒక్కసారిగా ఆసక్తికరంగా మార్చేశారు. డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా అధ్యక్షుడు బైడెన్ ఉన్నంతకాలం ఆయనపై అన్ని విషయాల్లోనూ ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించిన రిపబ్లికన్ ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు ఇప్పుడామె ముచ్చెమటలే పట్టిస్తున్నారు! బైడెన్ తప్పుకున్నాక తాజా సర్వేలన్నింటిలోనూ హారిస్ దూసుకుపోతున్నారు. కొన్నింటిలోనైతే ట్రంప్‌ను దాటేశారు కూడా. ఇటు తల్లి నుంచి ఆసియా, అటు తండ్రి నుంచి నల్లజాతి మూలాలుండటం హారిస్‌కు భారీ అడ్వాంటేజ్‌గా మారుతున్నట్టు కనిపిస్తోంది. అమెరికాలో ప్రబల శక్తులుగా ఉన్న ఈ రెండు వర్గాల ఓట్లూ ఆమెకే పడటం ఖాయమంటున్నారు. ఆగస్టు 19–21 తేదీల మధ్య జరిగే డెమొక్రాట్ల జాతీయ సదస్సులో హారిస్ అభ్యర్థిత్వానికి ఆమోదముద్ర పడటం లాంఛనమే. అదే ఊపులో ట్రంప్‌ను ఓడిస్తే 248 ఏళ్ల అమెరికా చరిత్రలో తొలి అధ్యక్షురాలిగా, ఆ ఘనత సాధించిన మొదటి ఆసియా మూలాలున్న నేతగా, నల్ల జాతి మహిళగా... ఇలా ఆ దేశ చరిత్రలోనే అరుదైన పలు రికార్డులను హారిస్ సొంతం చేసుకుంటారు. అంతేకాదు, ఉపాధ్యక్ష పదవిలో ఉంటూ అధ్యక్ష ఎన్నికల్లో నెగ్గిన ఐదో అమెరికన్‌గా కూడా నిలుస్తారు.

నేరుగా పదోన్నతి నలుగురికే..

అమెరికా చరిత్రలో ఇప్పటిదాకా 49 మంది ఉపాధ్యక్షులుగా పని చేశారు. వారిలో పదిహేను మంది ఆ తర్వాత కాలంలో అధ్యక్షులు కూడా అయ్యారు. అయితే ఉపాధ్యక్ష పదవిలో ఉంటూనే ఎన్నికల బరిలో నెగ్గి అధ్యక్షులు అయింది మాత్రం కేవలం నలుగురే. ఈ జాబితాలో తొలి స్థానంలో ఉన్నది అమెరికా రెండో అధ్యక్షుడు జాన్ ఆడమ్స్. ఆయన 1789 నుంచి1796 దాకా దేశ తొలి ఉపాధ్యక్షునిగా ఉన్నారు. 1796లో ఆ పదవిలో ఉంటూనే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. ఆయన చేతిలో ఓటమి చవిచూసిన థామస్ జెఫర్సన్ అప్పటి నియమాల ప్రకారం ఉపాధ్యక్ష పదవి చేపట్టారు. ఎందుకంటే అప్పట్లో ఉపాధ్యక్ష అభ్యర్థి అంటూ విడిగా ఉండేవారు కాదు. అధ్యక్ష రేసులో రెండో స్థానంలో నిలిచిన నేతే ఉపాధ్యక్షుడు అయ్యేవారు. తర్వాత నాలుగేళ్లకు జెఫర్సన్ ఉపాధ్యక్ష పదవిలో ఉంటూనే అధ్యక్ష ఎన్నికల్లో గెలిచారు. ఆయన ఓడించింది ఎవరినో తెలుసా? నాటి అధ్యక్షుడు ఆడమ్స్‌నే! ఒక్కోపార్టీ నుంచి ఆ రెండు పదవులకూ విడిగా అభ్యర్థులు నిలబడటం పందొమ్మిదో శతాబ్దం తొలినాళ్లలో మొదలైంది.



- సాక్షి, నేషనల్ డెస్క్

150 ఏళ్ల విరామం తర్వాత జార్జ్‌బుష్

1836లో ఉపాధ్యక్షుడు మార్టిన్ వాన్ బురెన్ అధ్యక్ష ఎన్నికల్లో గెలిచారు. ఆ తర్వాత మళ్లీ ఉపాధ్యక్షుడు నేరుగా అధ్యక్షుడు కావడానికి ఏకంగా 150 ఏళ్లు పట్టింది! 1988లో నాటి ఉపాధ్యక్షుడు జార్జ్ హెచ్.డబ్ల్యు. బుష్ అధ్యక్షుడు అయ్యారు. చివరగా ఆ ఘనత సాధించిన నేత ఆయనే. ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ కూడా గతంలో బరాక్ ఒబామా హయాంలో ఉపాధ్యక్షునిగా చేశారు! కానీ 2016లో ఒబామా తర్వాత డెమొక్రాట్ల తరఫున బైడెన్‌కు కాకుండా హిల్లరీ క్లింటన్‌కు అధ్యక్ష అభ్యర్థిత్వం దక్కింది. అయితే ఆమె ట్రంప్ చేతిలో ఓటమి చవిచూశారు. 2020లో ట్రంప్‌ను హోరాహోరీ పోరులో బైడెన్ ఓడించడం, అధ్యక్షుడు కావడం తెలిసిందే. 1988 తర్వాత తొలిసారిగా ఉపాధ్యక్ష పదవిలో ఉంటూ నేరుగా ప్రెసిడెంట్ అయిన తొలి నేతగా రికార్డు సొంతం చేసుకునే దిశగా కమలా హారిస్ వడివడిగా దూసుకెళ్తున్నారు.

- అమెరికా చరిత్రలో ఉపాధ్యక్షులుగా ఉంటూ నేరుగా అధ్యక్ష ఎన్నికల బరిలో దిగి గెలిచిన నేతలు నలుగురు. వారు జాన్ ఆడమ్స్, థామస్ జెఫర్సన్, మార్టిన్ వాన్ బురెన్, జార్జ్ హెచ్.డబ్ల్యు.బుష్.
- ఎనిమిది మంది ఉపాధ్యక్షులు అప్పటి అధ్యక్షుల మృతి కారణంగా ఆ పదవిని చేపట్టారు. వారు జాన్ టైలర్, మిలార్డ్ ఫిల్మోర్, ఆండ్రూ జాన్సన్, చెస్టర్ ఆర్థర్, థియోడర్ రూజ్ వెల్ట్, కాల్విన్ కూలిడ్జ్, హారీ ట్రూమాన్, లిండన్ జాన్సన్.
- గెరాల్డ్ ఫోర్డ్ మాత్రం ఉపాధ్యక్షునిగా ఉంటూ, నాటి అధ్యక్షుడు రాజీనామా చేయడంతో ఆ పదవి చేపట్టారు.
- ఇద్దరు ఉపాధ్యక్షులు మాజీలయ్యాక, అంటే పదవీకాలం ముగిసిన కొన్నాళ్ల తర్వాత అధ్యక్ష ఎన్నికల బరిలో దిగి విజయం సాధించారు. వారిలో ఒకరు రిచర్డ్ నిక్సన్ కాగా రెండో వారు ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్.
- హారీ ట్రూమన్, చెస్టర్ ఆర్థర్ ఉపాధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోపే అధ్యక్షులయ్యారు!
- థామస్ హెండ్రిక్స్, విలియం కింగ్ ఉపాధ్యక్షులు అయిన ఏడాదిలోపే మరణించారు.
- జార్జ్ క్లింటన్, జాన్ కాల్హన్ వరుసగా రెండుసార్లు ఉపాధ్యక్షులుగా వేర్వేరు అధ్యక్షుల హయాంలో పని చేశారు.



మంత్రి రవ్‌నీత్ సింగ్



చరణ్‌జీత్ సింగ్

మాటల యుద్ధం

- లోక్‌సభలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదాలు
- పలుమార్లు వాయిదా పడిన సభ
- బియాంత్‌సింగ్ హత్యను ప్రస్తావించిన కాంగ్రెస్ ఎంపీ చన్నీ
- అభ్యంతరం వ్యక్తం చేసిన బీజేపీ సభ్యుడు బిట్టూ

న్యూఢిల్లీ: అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదాలు, నినాదాలతో లోక్‌సభ గురువారం దద్దరిల్లింది. పలుమార్లు వాయిదా పడింది. కేంద్ర బడ్జెట్‌పై ప్రారంభమైన చర్చ పూర్తిగా పక్కదారి పట్టింది. తొలుత కాంగ్రెస్ ఎంపీ, పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జీత్ సింగ్ చన్నీ మాట్లాడుతూ బీజేపీ ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి రవనీత్‌సింగ్ బిట్టూ తాత, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్‌సింగ్ హత్య ఘటనను ప్రస్తావించారు. దీనిపై బిట్టూ అభ్యంతరం వ్యక్తం చేశారు. చన్నీ, బిట్టూ మధ్య మాటల యుద్ధం జరిగింది. కాంగ్రెస్ నేత సోనియా గాంధీతోపాటు చన్నీపై బిట్టూ వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు. దీంతో విపక్ష ఎంపీలు ఒక్కసారిగా ఆయనపై విరుచుకుపడ్డారు. బిట్టూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సభ్యుడు అమరీందర్‌సింగ్ రాజా వెల్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. రాహుల్ గాంధీ ఆయనను ఆపేశారు. బిట్టూతోపాటు పలువురు బీజేపీ ఎంపీలు వెల్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా స్పీకర్ స్థానంలో ఉన్న సంధ్యా రే సభను వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. సభ సజావుగా జరిగేలా చూడాలని స్పీకర్ ఓం బిర్లాను కోరారు. సభ్యులంతా సభ గౌరవాన్ని కాపాడాలని స్పీకర్ అన్నారు. నిబంధనలు అతిక్రమించకూడదని చెప్పారు. తర్వాత చన్నీ తన ప్రసంగం కొనసాగించారు. రైతులకు ఇచ్చిన హామీలను మోదీ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. రైతులను ఖలిస్తానీలు చిత్రీకరించారని బీజేపీ నేతలపై మండిపడ్డారు. సభను చన్నీ తప్పుదోవ పట్టిస్తున్నారని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆరోపించారు. చన్నీ మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ చన్నీ వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఆయనపై సభా హక్కుల తీర్మానం ప్రవేశపెట్టాలని అన్నారు. ఈ సందర్భంగా అధికార, విపక్ష సభ్యుల మధ్య మళ్లీ వాగ్వాదం కొనసాగింది. తర్వాత సభ రెండుసార్లు వాయిదా పడింది. పార్లమెంట్ బయట బిట్టూ మీడియాతో మాట్లాడారు. చన్నీ జాతి వ్యతిరేక శక్తిగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇండియా నుంచి పంజాబ్‌ను విడదీయాలన్నదే ఆయన ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు.

దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ: చన్నీ

దేశంలో నరేంద్ర మోదీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందని చరణ్‌జీత్ సింగ్ చన్నీ మండిపడ్డారు. 20 లక్షల మంది ప్రజలు ఎన్నుకున్న ఎంపీని(అమృత్‌పాల్ సింగ్) జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ) కింద నిర్బంధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లు వేసిన ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించే అవకాశం ఆయనకు ఇవ్వడం లేదని, ఇది ఎమర్జెన్సీ కాక మరేమిటని ప్రశ్నించారు. చన్నీ లోక్‌సభలో ఈ అంశాన్ని లేవనెత్తారు. అయితే, అమృత్‌పాల్ పేరును నేరుగా ప్రస్తావించలేదు. లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్‌లోని ఖదూర్‌సాహిబ్ నియోజకవర్గం నుంచి వివాదాస్పద సిక్కు మత బోధకుడు, ఖలిస్తాన్ సానుభూతిపరుడు అమృత్‌పాల్ సింగ్ స్వతంత్ర అభ్యర్థిగా 2 లక్షల మెజార్టీతో గెలిచిన సంగతి తెలిసిందే.

ఆంధ్రా-బిహార్ బడ్జెట్: సౌగతా రాయ్

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగతా రాయ్ లోక్‌సభలో విమర్శలు గుప్పించారు. అది ఆంధ్రా–బిహార్ బడ్జెట్ అని ఆక్షేపించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శిక్షణ పొందిన ఆర్థికవేత్త కాదని అన్నారు. ప్రజల ఆకాంక్షలు పట్టించుకోకుండా కేవలం ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన సూచనల ఆధారంగా బడ్జెట్ రూపొందించారని విమర్శించారు. గతంలో ఆర్థిక మంత్రులుగా పని చేసిన మన్మోహన్ సింగ్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో, పి.చిదంబరం హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నారని, నిర్మలా సీతారామన్ మాత్రం జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో చదువుకున్నారని సౌగతా రాయ్ వ్యాఖ్యానించారు.

'రాయల్టీ' రాష్ట్రాలదే

సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు

- రాయల్టీ అంటే పన్ను కాదని స్పష్టీకరణ
- రాయల్టీ విధించకుండా రాష్ట్రాలపై ఎలాంటి నియంత్రణ లేదని వెల్లడి

న్యూఢిల్లీ: ఖనిజాలపై రాయల్టీ విధించే అధికారం రాష్ట్రాలకు మాత్రమే ఉందని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఖనిజాలపై చెల్లించే రాయల్టీ పన్ను కాదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనం 8:1 మెజారిటీతో కీలక తీర్పు వెలువరించింది. కేంద్ర ప్రభుత్వానికి ఇది ఎదురుదెబ్బే. గనుల, ఖనిజాల అభివృద్ధిపై కేంద్రం నియంత్రణకు వీలు కల్పిస్తున్న రాజ్యాంగంలోని జాబితా–1లో పేర్కొన్న ఎంట్రీ 54 ప్రకారం.. ఖనిజ హక్కులపై పన్నులు విధించే అధికారం పార్లమెంటుకు లేదని తేల్చిచెప్పింది. అయితే ఖనిజ హక్కులపై రాయల్టీ విధించే రాష్ట్రాల అధికారాన్ని ఏ స్థాయికైనా పరిమితం చేసే అధికారం పార్లమెంటుకు ఉందని స్పష్టం చేసింది. గనులు, ఖనిజాలు అధికంగా ఉన్న జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలకు ఈ తీర్పుతో లబ్ధి చేకూరనుంది. తమ ప్రాంతంలో ఉన్న గనులు, ఖనిజాలపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటిదాకా వసూలు చేసిన రూ.వేల కోట్ల పన్నులను తిరిగి తమకు ఇప్పించాలని ఆయా రాష్ట్రాలు విజ్ఞప్తి చేశాయి. తీర్పును అమల్లోకి తీసుకురావాలని కోరాయి. రాష్ట్రాల విజ్ఞప్తిని కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ వ్యతిరేకించారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఈ అంశంపై లిఖితపూర్వకంగా స్పందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. పన్నులను రాష్ట్రాలకు తిరిగి ఇచ్చే విషయంలో ఈ నెల 31న తమ నిర్ణయం ప్రకటిస్తామని వెల్లడించింది.

1989 నాటి తీర్పును తోసిపుచ్చిన ధర్మాసనం

గనులు, ఖనిజాలపై రాయల్టీ విధించే హక్కు రాష్ట్రాలకే ఉందంటూ తమ తీర్పును జస్టిస్ డి.వై.చంద్రచూడ్ స్వయంగా చదివి వినిపించారు. ధర్మాసనంలోని 8 మంది సభ్యులు రాష్ట్రాల హక్కును సమర్థిస్తూ తీర్పు ఇచ్చారు. జస్టిస్ నాగరత్న ఒక్కరే వ్యతిరేకిస్తూ భిన్నమైన తీర్పు వెలువరించారు. రాజ్యాంగంలో జాబితా–2లోని ఎంట్రీ 50 కింద గనులు, ఖనిజాలపై పన్నులు విధించే అధికారం పార్లమెంట్‌కు లేదని జస్టిస్ చంద్రచూడ్ తమ తీర్పులో చెప్పారు. రాయల్టీ అంటే పన్ను అని తేల్చేస్తూ 1989లో సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు సరైంది కాదని పేర్కొన్నారు. ఆ తీర్పును తోసిపుచ్చారు.

రాష్ట్రాల అధికారాన్ని పార్లమెంటు పరిమితం చేయవచ్చు

ఖనిజాలపై రాయల్టీ వసూలు చేసుకునే అధికారం రాష్ట్రాలకే ఉన్నప్పటికీ.. దేశంలో ఖనిజాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రాల అధికారాన్ని పరిమితం చేసే హక్కు మాత్రం పార్లమెంటుకు ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. 'ఖనిజాభివృద్ధి ఆటంకం కలగకుండా ఉండటానికి రాష్ట్రాల రాయల్టీ అధికారాన్ని పార్లమెంటు పరిమితం చేయగలదు. ఆ మేరకు పార్లమెంటు ఏదైనా చట్టాన్ని చేస్తే రాష్ట్రాలు దానికి కట్టుబడి ఉండాలి' అని స్పష్టం చేసింది.

'మహా'వృష్టి

జలమయమైన పుణె, ముంబై, థానె, పాల్ఘర్

ముంబై: మహారాష్ట్రలోని పలు జిల్లాలపై వరుణుడు తన ప్రతాపం చూపించాడు. ముంబై మహానగరంసహా థానె, పుణె, పాల్ఘర్, రాయ్‌గఢ్ జిల్లాల్లో కుంభవృష్టి కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయందాకా ఎడతెగని వానలతో పలు ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. భీకరవర్షాలకు ఆయా ప్రాంతాలు నీట మునిగాయి. జనజీవనం స్తంభించింది. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆరెంజ్, రెడ్ అలర్ట్ ప్రకటించారు. వర్ష సంబంధ ఘటనల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. పుణెలోని దక్కన్ ప్రాంతంలో విద్యుదాఘాతంతో ముగ్గురు, తహమినీ ఘాట్‌లో కొండచరియలు పడి ఒకరు చనిపోయారు. జలదిగ్బంధంలో చిక్కుకున్న వారికి కాపాడేందుకు సైన్యం రంగంలోకి దిగింది. ముంబైలోనూ వానలు ముంచెత్తాయి. సిటీ లోని శాంటాక్రూజ్ ప్రాంతంలో జూలైలోనే అత్యధికంగా 1,500 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నగర చరిత్రలో జూలైలో రెండో అత్యంత భారీ వర్షపాతం ఇదే. ముంబైలో కురుస్తున్న భారీ వర్షాలతో ఎయిర్‌పోర్టులో విమానరాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రన్‌వేపై 300 మీటర్ల దూరం తర్వాత ఏమీ కనిపించట్లేదు. దీంతో 11 విమానాలను రద్దుచేశారు. కొన్నింటిని వేరే నగరాలకు దారి మళ్లించారు.



4 రోజులు.. 160 కి.మీ.లు

ముంబై: కార్గిల్ విజయ్ దివస్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్మీ మాజీ అధికారిణి సాహసోపేతమైన ఫీట్ చేశారు. లెఫ్టినెంట్ కల్నల్ వర్షారాయ్ 4 రోజుల్లో 160 కిలోమీటర్ల పరుగును పూర్తిచేశారు. రన్ జూలై 19న ప్రారంభమై జూలై 22న ముగిసింది. శ్రీనగర్ నుండి ద్రాస్ సెక్టార్‌లోని కార్గిల్ వార్ మెమోరియల్ వరకు ఆమె సగటున రోజుకు 40 కి.మీ. పరుగెత్తారు. పరుగు పూర్తయిన సందర్భంగా కార్గిల్ యుద్ధ స్మారకం వద్ద అమరవీరులకు నివాళులు అర్పించారు. ఆమెతో పాటు చినార్ వారియర్స్ మారథాన్ జట్టు కూడా ఉంది. లెఫ్టినెంట్ కల్నల్ వర్షా రాయ్ భర్త కశ్మీర్‌లో ఆర్మీ అధికారిగా ఉన్నారు.

వ్యభిచార గృహానికి రక్షణ కల్పించండి

- ఓ న్యాయవాది పిటిషన్
- అవాక్కైన మద్రాస్ హైకోర్టు

చెన్నై: తమిళనాడులోని కన్యాకుమారి జిల్లాలో తాను నడుపుతున్న వ్యభిచార గృహానికి రక్షణ కల్పించాలని కోరుతూ ఓ న్యాయవాది పిటిషన్ వేయడంతో మద్రాస్ హైకోర్టు అవాక్కైంది. వయోజనుల మధ్య పరస్పర సమ్మతితో సెక్స్ సర్వీసులను, కౌన్సెలింగ్‌ను, ఆయిల్ బాత్‌లను తమ సంస్థ అందిస్తుందని న్యాయవాది రాజా మురుగన్ తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. పోలీసు తనపై పెట్టిన కేసును కొట్టి వేయాలని, తన వ్యాపార కార్యకలాపాల జోలికి రాకుండా పోలీసులను కట్టడి చేస్తూ ఆదేశాలివ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. వయోజనుల మధ్య పరస్పర సమ్మతితో జరిగే సెక్స్ నేరం కాదని తన చట్టవిరుద్ధ కార్యకలాపాలను పిటిషనర్ సమర్థించుకోవడాన్ని జస్టిస్ బి.పుగలేంధి తీవ్రంగా ఆక్షేపించారు. పేరున్న లా కాలేజీల నుంచి పట్టభద్రులైన వారిని మాత్రమే న్యాయవాదులుగా నమోదు చేసుకోవాలని బార్ కౌన్సిల్‌కు సూచించారు. మురుగన్‌కు రూ. 10 వేల జరిమానాను విధించడమే కాకుండా.. లా డిగ్రీ సర్టిఫికెట్‌ను, బార్ అసోసియేషన్‌లో నమోదైన పత్రాన్ని సమర్పించాలని ఆదేశించింది.

కాంగ్రెస్ చిల్లర రాజకీయాలకు చెంపపెట్టు

నీట్‌పై సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్ర మంత్రి ప్రధాన్



న్యూఢిల్లీ: నీట్–యూజీ అంశంపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు కాంగ్రెస్ బాధ్యతారాహిత్యానికి, చిల్లర రాజకీయాలకు చెంపపెట్టని కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. సుప్రీం నిర్ణయం విద్యార్థుల ఓటమి కానేకాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి కేంద్రం ప్రభుత్వంపైనే కాదు, సుప్రీంకోర్టుపైనా విశ్వాసం లేదని విమర్శించారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలోనూ పేపర్ లీకేజీలు జరగడం తెలియదా అని ఆ పార్టీ చీఫ్ ఖర్గేను ఆయన ప్రశ్నించారు. అప్పటి ఘటనలపై ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. పేపర్ లీకేజీలకు, అవినీతికి తండ్రి వంటిది కాంగ్రెస్ పార్టీ అని ఎద్దేవా చేశారు. రాజకీయ మనుగడ కోసం ఆ పార్టీ అబద్ధాలు, అరాచకాలనే నమ్ముకుందని మంత్రి మండిపడ్డారు. స్వార్థ ప్రయోజనాలపైనే తప్ప, విద్యార్థుల భవిష్యత్తు గురించి ఖర్గేకు, రాహుల్ గాంధీకిగానీ, కాంగ్రెస్ పార్టీకిగానీ ఏమాత్రం పట్టింపు లేదని ఆరోపించారు.

లూటెన్స్‌లో ఆప్ నూతన కార్యాలయం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని లూటెన్స్ ప్రాంతంలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి కొత్త కార్యాలయాన్ని కేటాయించినట్లు అధికారవర్గాలు గురువారం తెలిపాయి. పండిట్ రవి శంకర్ శుక్లా లేన్‌లోని ఒకటో నంబర్ బంగ్లాను ఆప్‌కు ఇచ్చినట్లు చెప్పాయి. గతంలో రౌజ్ అవెన్యూ ప్రాంతంలో ఆప్ కార్యాలయం ఉండేది. జాతీయ గుర్తింపు కోల్పోవడంతో ఆ కార్యాలయాన్ని ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతేడాది జాతీయ పార్టీగా తిరిగి గుర్తింపు సాధించిన ఆప్‌కు హోదాకు తగ్గట్టుగా మరో చోట కార్యాలయం కేటాయించాలని ఢిల్లీ హైకోర్టు కేంద్రాన్ని కోరింది. ఈ విషయాన్ని జూలై 25వ తేదీలోగా తేల్చాలంటూ ఆదేశించింది. ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తాజాగా ప్రకటించారు.

శ్రీలంక అధ్యక్ష బరిలో మాజీ ఆర్మీ చీఫ్



కొలంబో: శ్రీలంక అధ్యక్ష పదవికి త్వరలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు మాజీ ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ శరత్ ఫోన్సెకా(73) ప్రకటించారు. అధ్యక్షుడైతే అవినీతిని రూపుమాపి, దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు. సెప్టెంబర్ 17–అక్టోబర్ 16 తేదీల మధ్య దేశంలో ఎన్నికలు జరిగే అవకాశముంది. ఎన్నికల సంఘం ఈ నెల 26వ తేదీన షెడ్యూల్ ప్రకటించనుంది. 2009లో అప్పటి ఆర్మీ చీఫ్ శరత్ ఫోన్సె సారథ్యంలో చేపట్టిన సైనిక ఆపరేషన్‌లో ఎల్టీటీఈ చీఫ్ వేలుపిళ్లై ప్రభాకర్ సహా కేడర్ అంతమైంది. కాగా, ప్రధాన ప్రతిపక్ష నేత సజిత్ ప్రేమదాస, మార్క్సిస్ట్ జేవీపీ నేత అనురా కుమార దిస్సనాయకేలు కూడా అధ్యక్ష పదవికి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు.

నీట్-యూజీ రివైజ్డ్ ఫలితాలను విడుదల చేయలేదు: కేంద్రం



న్యూఢిల్లీ: నీట్–యూజీ 2024 రివైజ్డ్ ఫలితాలను గురువారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) విడుదల చేసిందంటూ వచ్చిన వార్తలపై కేంద్రం స్పందించింది. రివైజ్డ్ ఫలితాలను విడుదల చేయలేదని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో షేర్ అవుతున్న లింక్ పాతదేనని స్పష్టం చేసింది. ఫిజిక్స్ పేపర్‌లోని ఓ ప్రశ్నకు రెండు రకాలైన సమాధానాలకు కూడా మార్కులు వేశారు. దీనిపై కొందరు విద్యార్థుల వినతిమేరకు సుప్రీంకోర్టు విచారణ కమిటీని వేయడం, ఆ ప్రశ్నకు ఒక్కటే సరైన సమాధానమని కమిటీ స్పష్టం చేయడం తెల్సిందే. దీంతో, రెండు రోజుల్లోగా రివైజ్డ్ ఫలితాలను ప్రకటిస్తామంటూ విద్యాశాఖ ప్రకటించింది.

నీట్‌ను రద్దు చేయండి

- నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ వద్దు
- కర్ణాటక అసెంబ్లీ కీలక తీర్మానాలు



బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ గురువారం మూడు కీలక తీర్మానాలను ఆమోదించింది. నేషనల్ ఎంట్రన్స్ కమ్ ఎలిజిబిలిటీ టెస్ట్(నీట్)ను రద్దు చేయాలి, ఒకే దేశం–ఒకే ఎన్నిక విధానం, 2026లో చేపట్టే జనగణన ఆధారంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ చేపట్టే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరింది. పునర్‌వ్యవస్థీకరణను 1971 జనగణన ఆధారంగానే చేపట్టాలని కోరింది. జమిలి ఎన్నికల విధానం అమలుతో దేశ ప్రజాస్వామ్యం, సమాఖ్య విధానం ప్రమాదంలో పడతాయని పేర్కొంది.

కొత్త తరానికి చాన్సివ్వడానికే

అందుకే పోటీ నుంచి తప్పుకున్నా: బైడెన్



వాషింగ్టన్: దేశాన్ని మరింత ఐక్యంగా నిలిపేందుకు, కొత్త తరానికి అవకాశం ఇవ్వాలనే సదుద్దేశంతో దేశాధ్యక్ష రేసు నుంచి తప్పుకున్నానని డెమొక్రటిక్ అభ్యర్థి జో బైడెన్ వ్యాఖ్యానించారు. పోటీ నుంచి నిష్క్రమించినట్లు ప్రకటించాక బైడెన్ జాతినుద్దేశించి ప్రసంగించడం ఇదే తొలిసారి. బుధవారం అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌజ్‌లోని ఓవల్ ఆఫీస్ నుంచి ఆయన 11 నిమిషాలపాటు ప్రసంగించారు. ''గత కొద్దివారాలుగా అమెరికా రాజకీయాలను అందరూ గమనిస్తూనే ఉన్నారు. డెమొక్రటిక్ పార్టీని ఐక్యంగా నిలపాల్సిన బాధ్యత నాపై ఉంది. అందుకే క్లిష్ట సమయాల్లో డెమొక్రటిక్ పార్టీని ఐక్యంగా ఉంచడం కోసం వ్యక్తిగత లక్ష్యాలను త్యాగం చేయడం కూడా ముఖ్యమే' అని తాను రేసు నుంచి తప్పుకోవడాన్ని బైడెన్ సమర్థించుకున్నారు.

రాష్ట్రపతి భవన్‌లో హాళ్లకు కొత్త పేర్లు

- దర్బార్ హాల్ ఇకపై గణతంత్ర మండపం
- అశోకా హాల్ పేరు సైతం అశోక మండపంగా మార్పు



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రపతి భవన్‌లోని రెండు ప్రధానమైన హాళ్లకు కొత్త నామకరణం చేశారు. జాతీయ పురస్కా రాల ప్రదానోత్సవాలకు వేదికగా నిలిచే దర్బార్ హాల్ పేరును గణతంత్ర మండపంగా మారుస్తూ రాష్ట్రప తిభవన్ సచివాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రపతిభవన్‌లోని మరో ప్రాంగణమైన 'అశోకా హాల్' పేరును అశోకా మండపంగా మార్చారు. హాళ్లకు కొత్త నామకరణం చేస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కీలక నిర్ణయం తీసుకున్నారని ఆ ప్రకటన పేర్కొంది. దేశ ప్రజల అమూల్యమైన వారసత్వ సంపద అయిన రాష్ట్రపతి భవన్‌లో భారతీయ సాంస్కృతిక విలువలు, నైతికతను ప్రతిబింబించేలా హాళ్లకు కొత్త పేర్లు పెట్టామని రాష్ట్రపతి భవన్ పేర్కొంది.

శ్రీ వేంకటేశ్వర ఎయిర్‌పోర్ట్‌గా తిరుపతి ఎయిర్‌పోర్ట్ పేరు !

ప్రతిపాదించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ఎయిర్‌పోర్ట్ పేరును శ్రీ వేంకటేశ్వర ఎయిర్‌పోర్ట్‌గా మార్చాలని ఏపీ సర్కార్ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా పౌరవిమానయాన సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ చెప్పారు. ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలోని మరో రెండు ఎయిర్‌పోర్ట్‌ల పేర్ల మార్పునూ ప్రతిపాదించింది. 10 రాష్ట్రాలు 22 ఎయిర్‌పోర్టుల పేర్ల మార్పు కోసం ప్రతిపాదనలు పంపాయని మంత్రి వెల్లడించారు. దర్భంగా ఎయిర్‌పోర్ట్‌ను విద్యాపతి ఎయిర్‌పోర్ట్‌గా మార్చాలని బిహార్ కోరింది. ఉత్తరప్రదేశ్, హరియాణా, కర్ణాటక, మధ్యప్రదేశ్, మణిపూర్, ఉత్తరాఖండ్, పంజాబ్, మహారాష్ట్రలూ ఈ జాబితాలో ఉన్నాయి.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
శుక్రవారం : 26 : జూలై : 2024

2న పుదుచ్చేరి బడ్జెట్

సాక్షి, చెన్నై: కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఆగస్టు 2వ తేదీన సభలో బడ్జెట్ దాఖలువుతుందని స్పీకర్ ఎన్బళం సెల్వం తెలిపారు. పుదుచ్చేరిలో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం కొనసాగుతున్న విషయం తెలిసిందే. సీఎంగా రంగస్వామి వ్యవహరిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పుదుచ్చేరి బడ్జెట్ సమావేశాలు జరగలేదు. ప్రస్తుతం సమావేశాలకు స్పీకర్ ఎన్బళం సెల్వం నిర్ణయించారు. ఈ నెల 31వ తేదిన అసెంబ్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ సీపీ రాధా కృష్ణన్ ప్రసంగించనున్నారు. ఆగస్టు 2న సీఎం రంగస్వామి సభలో బడ్జెట్ దాఖలు చేయనున్నారని గురువారం మీడియాతో మాట్లాడుతూ స్పీకర్ వెల్లడించారు.

న్యూస్‌రీల్

వ్యాన్‌లోని విద్యార్థులను రక్షించి డ్రైవర్ వీరమరణం

- ఎక్స్‌లో సీఎం సంతాపం

సాక్షి, చెన్నై: వ్యాన్ నడుపుతున్న సమయంలో హఠాత్తుగా వచ్చిన గుండెపోటు కారణంగా ఓ డ్రైవర్ కన్నుమూశారు. ఆ సమయంలో వ్యాన్‌లోని విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకుండా రక్షించి మృత్యు ఒడికి చేరారు. వివరాలు.. తిరుపూర్ జిల్లా కాంగేయం సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాల వ్యాన్‌కు డ్రైవర్‌గా మలయప్పన్ పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం పాఠశాల ముగించుకుని విద్యార్థులను వారి వారి ఇళ్ల వద్ద దిగబెట్టేందుకు వెళుతున్న సమయంలో మార్గం మధ్యలో గుండెపోటుకు గురయ్యాడు. తన వ్యానులో ఉన్న పిల్లలకు ఎలాంటి గాయాలు కాకూడదని ఆ బాధను భరిస్తూ వాహనాన్ని చాకచక్యంగా నడిపి రోడ్డు పక్కగా ఆపేసి కన్నుమూశాడు. బస్సులో ఉన్న పిల్లలు ఏం జరుగుతుందో తెలియక ఆందోళనతో పెట్టిన కేకలతో ఆ పరిసర వాసులు పరుగులు తీశారు. అప్పటికే మలయప్పన్ కన్నుమూశాడు. తమ బిడ్డలను రక్షించి మలయప్పన్ కన్నుమూయడం తల్లిదండ్రులను తీవ్రంగా కలచివేసింది. ఈ ఘటనను సీఎం స్టాలిన్ తన ఎక్స్‌పేజీలో వివరిస్తూ మలయప్పన్ ఆత్మకు శాంతి కలగాలని, ఆయన కుటుంబానికి తన సానుభూతి తెలియజేశారు.

కేంద్ర బడ్జెట్‌లో అన్యాయంపై పోరుబాట

- 27న రాష్ట్రవ్యాప్త నిరసనకు డీఎంకే పిలుపు



డీఎంకే కార్యాలయం

సాక్షి, చెన్నై: కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ డీఎంకే పోరుబాటకు పిలుపు నిచ్చింది. ఈనెల 27వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు సిద్ధమయ్యారు. కేంద్ర ఆర్థిక బడ్జెట్‌లో మంత్రి నిర్మలా సీతారామన్ తమిళనాడుపై శీతకన్ను వేసిన విషయం తెలిసిందే. తమిళనాడుపై మరోమారు సవతి తల్లి ప్రేమను చూపిస్తూ కేంద్రం వ్యవహరించడం రాష్ట్రంలోని అధికార, ప్రతి పక్ష పార్టీలలో ఆగ్రహాన్ని రేపాయి. కేంద్రంపై సర్వత్రా దుమ్మెత్తి పోస్తున్నారు. తమిళనాడుకు నిధుల కేటాయింపు జరగక పోగా, ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా మభ్య పెట్టే రీతిలో కేంద్ర పాలకులు, బీజేపీ వర్గాలు ఎదురు దాడి చేస్తుండటాన్ని డీఎంకే తీవ్రంగా పరిగణించింది. ఒక దేశ ఆర్థిక ప్రగతికి రాష్ట్రాలు కీలకంగా ఉన్నప్పటికీ, రాజకీయ స్వలాభం కోసం తమిళనాడును పూర్తిగా విస్మరించిన కేంద్రం చర్యలను ఖండిస్తూ పోరుబాటకు డీఎంకే నిర్ణయించింది. డీఎంకే కార్యాలయంలో ఇందుకు సంబంధించి గురువారం ఓ ప్రకటన విడుదలచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, నగర, పట్టణ కేంద్రాలలో భారీఎత్తున నిరసనలకు పిలుపునిచ్చారు. కేంద్రం చర్యలను ఎండగట్టే విధంగా రైల్‌రోకోలు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేయనున్నట్లు సమాచారం.

33 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

కొరుక్కుపేట: విల్లుపురం పోలీసుల డివిజన్ పరిధిలోని కడలూరు, విల్లుపురం , కళ్ళకురిచ్చి జిల్లాల నుంచి 33 మంది ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. కోటకుప్పం మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ విల్లిని నైవేలికి బదిలీ చేశారు. సెట్టియాతోపులో పనిచేస్తున్న ముత్తులక్ష్మిని కోటకుప్పానికి, విల్లుపురంలో ఉన్న వనజను విరుదాచలానికి కేటాయించారు. కడలూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీప్రియా విల్లుపురం సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌కు, కట్టుమన్నార్‌కోయిల్ ఇన్‌స్పెక్టర్ ఏలుమలై చిన్నసేలానికి, తిటక్కుడి మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ తమిళ సెల్వి తిరుకోవిలూరు ఎక్సైజ్ విభాగానికి బదిలీ అయ్యారు.

మొబైల్ స్కానింగ్‌తో లింగ నిర్ధారణ

- ముఠా అరెస్టు

సాక్షి, చెన్నై : మొబైల్ స్కానింగ్ సెంటర్ పేరిట ఇళ్ల వద్దకే వెళ్లి శిశువు లింగ నిర్ధారణ చేసి, ఆడ శిశువుగా ఉంటే అబార్షన్లపై చేయిస్తూ వచ్చిన ఓ ముఠాను ఆరోగ్య అధికారులు, పోలీసులు గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. ధర్మపురి నుంచి పెరంబలూరుకు ఓ ముఠా కారులో స్కానింగ్ సంబంధిత పరికరాలతో వెళ్తున్నట్లుగా అధికారులకు సమాచారం అందింది. దీంతో ధర్మపురి ఆరోగ్యశాఖ అధికారులు, పోలీసులు ఆ కారును వెంబడించారు. పెరంబలూరు సమీపంలోని ఓ ఇంటి వద్దకు ఆ కారు వెళ్లడం కాసేపటి తర్వాత మహిళలు అక్కడికి వెళ్లడం చూసి అనూహ్యంగా దాడి చేశారు. మొబైల్ స్కానింగ్ సెంటర్ పేరిట ఈ ముఠాకు చెందిన మురుగన్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ ముఠా ఇళ్ల వద్దకే వెళ్లిగర్భంలో ఉన్నది ఆడ, మగ శిశువు అనేది గుర్తించి సంబంధిత కుటుంబాలకు తెలియజేయడమే కాకుండా, అబార్షన్లపై దృష్టి పెడుతూ వచ్చినట్లు విచారణలో తేలింది. మురుగన్‌తోపాటు కొందరు మహిళలను కూడా అదుపులోకి తీసుకున్నారు.

కలవర పెడుతున్న డెంగీ

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఎం.సుబ్రమణియన్



డెంగీ బారినపడిన వారికి ప్రత్యేక వార్డులో చికిత్స



కేరళలో కలకలం సృష్టిస్తున్న నిఫా వైరస్ తమిళనాడులోని సరిహద్దు జిల్లాల ప్రజల్ని కూడా కలవర పెడుతోంది. దీంతో ప్రభుత్వం సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ఆరోగ్యశాఖ అధికారులు నిఘా పెంచారు. రాష్ట్రంలోకి వచ్చే ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే సరిహద్దు జిల్లాల్లో తీవ్ర జ్వరాలతో బాధ పడుతున్న వారిని గుర్తించి చికిత్స అందిస్తున్నారు.



అయితే ఇదే సమయంలో రాష్ట్రంలో డెంగీ విజృంభిస్తుండడంతో అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. ప్రధానంగా పది జిల్లాల్లో కేసుల సంఖ్య పెరుగుతుండడంతో కట్టడి చర్యలను విస్తృతం చేస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ తెలిపారు.

- 10 జిల్లాల్లో విజృంభిస్తున్న మహమ్మారి
- విస్తృతంగా కట్టడి చర్యలు
- వైద్య శిబిరాల ఏర్పాటుకు నిర్ణయం
- ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులు
- కేరళ సరిహద్దుల్లో నిఫా టెన్షన్

సాక్షి, చెన్నై: వాతావరణ మార్పుల కారణంగా రాష్ట్రంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. తొలుత వర్షాలు కేరళ సరిహద్దుల్లోని తమిళనాడు జిల్లాలైన తేని, దిండుగల్, తిరునల్వేలి, తెన్‌కాశి, కన్యాకుమారి, నీలగిరి, కోయంబత్తూరులో అధిక ప్రభావాన్ని చూపించాయి. ఇక నీలగిరి, కోయంబత్తూరులో నేటికీ వర్షాలు కురుస్తూ వస్తున్నాయి. ఫలితంగా విష జ్వరాల బారిన పడి ఆస్పత్రులకు వస్తున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గ్రామాల్లో అధిక శాతం మంది తీవ్ర జలుబు, దగ్గు, జ్వరంతో క్లీనిక్‌లు, ఆరోగ కేంద్రాల బాట పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కేరళలో నిఫా వైరస్ వెలుగు చూడడం, ఓ బాలుడు మృతి చెందడంతో రాష్ట్ర ఆరోగ్య శాఖ అలర్ట్ అయింది. సరిహద్దు జిల్లాలైన కన్యాకుమారి, తెన్ కాశి, తేని, కోయంబత్తూరు, నీలగిరి, దిండుగల్ జిల్లా కొడైకెనాల్ పరిసర మార్గలలోని చెక్‌పోస్టులలో అధికారులు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. కేరళ నుంచి తమిళనాడు వైపుగావచ్చే వాహనాలు, బస్సులలో ప్రయాణించే ప్రతి ఒక్కరికీ ఫీవర్ టెస్ట్ చేసిన తరువాతే అనుమతిస్తున్నారు. వాహనాలకు క్రిమిసంహారక మందులను చల్లుతున్నారు. కన్యాకుమారి, నీలగిరి, కోయంబత్తూరు, తేని, తెన్‌కాశి జిల్లాలు కేరళకు మరీ దగ్గరి ప్రాంతాలు కావడంతో ఇక్కడి గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఎవరైనా జ్వరాలతో బాధ పడుతున్నారా? గుర్తించి, వారికి వైద్య చికిత్స అందించే విధంగా ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామాల బాట పట్టారు. అదే సమయంలో రాష్ట్రంలో డెంగీ కేసులు చాప కింద నీరులా పెరుగుతుండడం తాజాగా వెలుగులోకి వచ్చింది.

భారీగా నమోదవుతున్న కేసులు

రాజధాని నగరం చెన్నై, క్లాసికల్ సిటీ కోయంబత్తూరు, ఆధ్యాత్మిక నగరం మదురై, కృష్ణగిరి, తిరుపత్తూరు, తంజావూరు, నామక్కల్, తిరునల్వేలి తదితర 10 జిల్లాల్లో ప్రస్తుతం డెంగీ కేసులు అధికంగా నమోదవడం వెలుగు చూసింది. ఈ కేసులు పొరుగు జిల్లాలకు విస్తరించకుండా కట్టడి చర్యలపై అధికారులు దృష్టి పెట్టారు. ఓ వైపు నిఫా కలవరం , మరోవైపు జ్వరం బారిన ఆసుపత్రుల్లో చేరే వారి సంఖ్య పెరగడం వెరసి రాష్ట్రం వ్యాప్తంగా డెంగీ ఫీవర్ జనంలో రెట్టింపు అవుతోంది. కట్టడి చర్యలలో భాగంగా జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. అడపాదడపా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లు, ఖాళీ స్థలాలలో నీళ్ల నిల్వకుండా జాగ్రత్తలు పాటించాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ అయ్యాయి. ప్రతి జిల్లాలోనూ జిల్లాస్థాయి ర్యాపిడ్ యాక్షన్ టీమ్‌లను సిద్ధం చేయాలని, ఏ ప్రాంతంలోనైనా మూడు లేదా అంతుకు మించి జ్వరాల కేసులు నమోదైన పక్షంలో తక్షణం ఆ ప్రాంతాల్లో ఫీవర్ క్యాంప్‌ల ద్వారా ప్రజలకు వైద్య సేవలు విస్తృతం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. దోమల వ్యాప్తిని కట్టడి చేయడంతో పాటు ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందుతోందా..? అని పరిశీలించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఫాగింగ్‌తో పాటుగా మురికి గుంటల్లో క్రిమిసంహారక మందులను స్ప్రే చేస్తున్నారు. ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులను సిద్ధం చేస్తున్నారు. నైరుతి సీజన్ తర్వాత ఈశాన్య రుతు పవనాల సీజన్ కాలం సైతం సమీపిస్తున్న నేపథ్యంలో మరింత అప్రమతంగా ముందు జాగ్రత్తలను సిద్ధం చేసి పెట్టుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

అందుబాటులో రేబిస్ వ్యాక్సిన్లు

రాష్ట్రంలో ర్యాబిస్ బారినపడి ఇప్పటి వరకు 22 మంది మరణించినట్లు వెలుగు చూసింది. దీంతో ఆస్పత్రుల్లో కుక్కలు, పాములు తదితర కీటకాల కాటుకు గురయ్యే వారికి వైద్య చికిత్స అందించేందుకు అన్ని రకాల మందులు పూర్తి స్థాయిలో నిల్వ ఉంచాలని అధికారులకు ఆరోగ్య శాఖ డైరెక్టర్ సెల్వ వినాయగం ఉత్తర్వులు జారీ చేశారు.



ఫాగింగ్ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

కట్టడి చర్యలు విస్తృతం

డెంగీ విజృంభణ నేపథ్యంలో కట్టడి చర్యలు విస్తృతం చేశామని ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ తెలిపారు. చెన్నైలో డెంగీ కేసుల నమోదు పెరగడంతో ప్రత్యేక ఫీవర్ క్యాంపల ఏర్పాటుపై ఆరోగ్యశాఖ మంత్రి దృష్టి పెట్టారు. టీ నగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే ఆరోగ్య జాగ్రత్తలను పాటించే విధంగా ప్రజలకు వివరించే ఇంటింటా స్టిక్కర్లను అంటించే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో డెంగీ కేసులు పెరుగుతున్నాని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కట్టడి చర్యలను ప్రభుత్వం విస్తృతం చేసిందని, అదే సమయంలో ప్రజలు సైతం ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి జూలై 24వ తేదీ వరకు రాష్ట్రంలో 6,565 డెంగీ కేసులు నమోదు అయ్యాయని, ఇందులో ముగ్గురు మరణించినట్లు వివరించారు. ప్రస్తుతం చెన్నై, కోయంబత్తూరు, తిరుపత్తూరు, కృష్ణగిరి, తేని, మదురై, తంజావూరు, నామక్కల్,



ఇంటింటా స్టిక్కర్లను అంటిస్తున్న మంత్రి

తిరునల్వేలి తదితర జిల్లాల్లో కేసులు అధికంగా ఉన్నాయని, ఆయా జిల్లాల అధికార యంత్రాంగాలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండే విధంగా సూచించామని, అన్ని రకాల మందులు సిద్ధంగా ఉన్నాయన్నారు. జ్వరమే కదా? అని నిర్లక్ష్యంగా వ్యవహరించ వద్దని, సమస్య ఉన్న వెంటనే ప్రజలు తమ తమ ప్రాంతాల్లోని ప్రభుత్వాస్పత్రులను సంప్రదించాలని, వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. వైద్యుల సలహాలు తీసుకోకుండా ఎలాంటి మందులు వాడ వద్దని విజ్ఞప్తి చేశారు. రెండు మూడు రోజులకు పైగా ఎవరైనా తీవ్ర జలుబు, దగ్గు, జ్వరంతో బాధ పడుతుంటే, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరాలన్నారు. డెంగీ ప్రభావిత ప్రాంతాలలో 476 మొబైల్ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, అందరికీ వైద్య పరీక్షలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే మరో 805 మొబైల్ బృందాలు పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. 22,384 తాత్కాలిక సిబ్బందిని అదనంగా నియమించి సాయంత్రం వేళలో ఫాగింగ్ చేయిస్తున్నామని పేర్కొన్నారు. తమ వంతుగా కట్టడి చర్యలు విస్తృతం చేస్తున్నామని, అదేస్థాయిలో ప్రజలు సైతం ప్రభుత్వానికి సహకరించాలని, నిర్లక్ష్యం వహించకుండా ఆస్పత్రులను ఆశ్రయించాలని కోరారు. డెంగీతో ఇటీవల మరణించిన వారు నిర్లక్ష్యం వహించడం వల్లే ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించామన్నారు. ఇక నిఫా వైరస్ గురించి పేర్కొంటూ, ఈ వైరస్ ప్రభావం రాష్ట్రంలో లేదని, అయినా ముందు జాగ్రత్తలను విస్తృతం చేశామన్నారు. సరిహద్దులలో శిబిరాల ద్వారా నిఘా ఉంచామన్నారు. ఎవరైనా జ్వరాలతో బాధ పడుతున్నారా? అని గుర్తించి, వారికి వైద్య చికిత్స అందిస్తున్నట్లు వివరించారు.

శివకాశిలో పరువు హత్య

అన్నానగర్: శివకాశి సమీపంలో ప్రేమ వివాహం చేసుకున్న ఓ యువకుడిని భార్య కళ్ల ముందే నరికి చంపిన ఘటన సంచలనం రేపింది. ఈ నేపథ్యంలో మహిళ సోదరులతో పాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు..విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరులోని ఇందిరా నగర్‌లో నివాసం ఉంటున్న కార్తీక్ పాండియాన్ (26) శివకాశి వంబిల్దాన్ ముక్కు ప్రాంతానికి చెందిన పొన్నయ్య కుమార్తె నందిని కుమారి (22)ని ప్రేమ వివాహం చేసుకున్నాడు. కులం వేరు కావడంతో ఈ వివాహాన్ని నందిని కుమారి సోదరులు తీవ్రంగా వ్యతిరేకించారు. అలాగే ఫోన్‌లో బెదిరించారు. పెళ్లయిన 8 నెలల తర్వాత వీరిద్దరూ శివకాశి సమీపంలోని అయ్యంబట్టి గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఈ స్థితిలో శివకాశి-శ్రీవిల్లిపుత్తూరు రోడ్డులోని గంగకుళం జంక్షన్‌లో కార్తీక్ పాండియాన్ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్నాడు. నందిని కుమారి అదే ప్రాంతంలోని ఓ సూపర్ మార్కెట్‌లో పనిచేస్తోంది. దీంతో రోజూ ఉదయం బైకులో ఆమెని వెళ్లి దించి భర్త రాత్రికి ఇంటికి తీసుకురావడం ఆనవాయితీ. ఈ క్రమంలో బుధవారం రాత్రి కార్తీక్ పాండియన్ బైకు సూపర్ మార్కెట్ వద్దకు వెళ్లి భార్య నందిని కుమారిని తీసుకుని బయలుదేరాడు. ఆ సమయంలో హఠత్తుగా నందినికుమారి సోదరులు బాలమురుగన్ (27), ధనపాలమురుగన్ (26). వీరి స్నేహితుడు శివ (23) రెండు బైకుల్లో వచ్చారు. ఇది చూసిన కార్తీక్‌పాండియన్ మళ్లీ భార్యను తీసుకుని సూపర్ మార్కెట్ లోకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. వారిని అడ్డుకున్న ముగ్గురు వ్యక్తులు కార్తీక్ పాండియన్‌ను అతని భార్య ముందే హత్య చేసి పరారయ్యారు. శివకాశి-శ్రీవిల్లిపుత్తూరు ప్రధాన రహదారిపై జరిగిన పరువు హత్య ఆ ప్రాంతంలో కలకలం సృష్టించింది. నిందితులు ధన బాలమురుగన్, బాలమురుగన్, శివను తిరుత్తంగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన శివకాశిలో తీవ్ర కలకలం రేపింది.

'తమిళ్ పుదల్వన్' కు వేళాయే!

- విద్యార్థులకు నెలకు రూ. 1000
- ఎయిడెడ్ స్కూళ్లకూ విస్తరణ
- రూ. 401 కోట్లు కేటాయింపు

సాక్షి, చెన్నై: విద్యార్థినులకు అమలు అవుతున్న పుదుమై పెన్ తరహాలో విద్యార్థుల కోసం తమిళ్ పుదల్వన్ పథకం సిద్ధమైంది. ఈ విద్యాసంవత్సరం నుంచి ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు నెలకు రూ. 1000 పంపిణీకి చర్యలు చేపట్టారు. ఇందుకోసం గురువారం రూ. 401.47 కోట్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలు.. ప్రభుత్వ పాఠశాలలో 6 నుంచి 12 వరకు తమిళ మాధ్యమంలో చదువుకుని ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థినులకు నెలకు రూ.1000 నగదు ప్రోత్సాహక పథకంగా పుదుమై పెన్‌ను గత విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. సుమారు 6 లక్షల మంది విద్యార్థినులకు ఈ పథకం ద్వారా ప్రతినెలా వారి బ్యాంక్ ఖాతాలలో రూ. 1000 జమ చేస్తూ వస్తున్నారు. అదే సమయంలో ప్లస్‌టూ (12వతరగతి) ముగించినానంతరం విద్యార్థులు అనేక మంది ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత చదువులను పక్కన పెట్టి కుటుంబ భారాన్ని నెత్తిన వేసుకునేలా దొరికిన ఉద్యోగాన్ని చేసుకుంటూ జీవనం సాగిస్తుండడం ఇటీవల రాష్ట్రంలో వెలుగులోకి వచ్చింది. ఇలాంటి విద్యార్థులను ఉన్నత విద్యాపరంగా ప్రోత్సహించే విధంగా పుదుమై పెన్ తరహాలో తమిళ్ పుదల్వన్ పథకం అమలు చేయబోతున్నట్లు అసెంబ్లీ వేదికగా ఫిబ్రవరిలో బడ్జెట్ దాఖలు సమయంలో ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు ప్రకటించారు.



విద్యార్థులు

రూ. 401 కోట్ల కేటాయింపు

ప్రభుత్వ, ప్రభుత్వ సహకారంతో నడిచే పాఠశాలలో 6 నుంచి 12 వరకు చదువుకున్న విద్యార్థులకు ఈ పథకం మేరకు నెలకు రూ. 1000 నగదు బ్యాంక్ ఖాతాలలో జమ చేయాలని తాజాగా పాలకులు నిర్ణయించారు. ఈ విద్యా సంవత్సరమే విద్యార్థుల కోసం తమిళ్ పుదల్వన్ పథకం అమలు చేయడానికి చర్యలు చేపట్టారు. ఈ పథకం అమలుకు ఎలాంటి నిబంధనలు లేవు. ప్రభుత్వ, ప్రభుత్వ సహకారంతో నడిచే పాఠశాలలో తమిళ మాధ్యమంలో 6 నుంచి 12 తరగతి చదివిఉంటే చాలు వారికి ఈ పథకం వర్తింపచేయనున్నారు. పథకం అమలు కోసం రూ. 401.47 కోట్లను కేటాయిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. తొలి విడతగా ఈ పథకానికి 3.28 లక్షల మంది విద్యార్థులను ఎంపిక చేసి లబ్ధి చేకూర్చనున్నారు. తదుపరి దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ఈ పథకం అమలు దిశగా కార్యాచరణ సిద్ధం చేశారు. విద్యార్థినులకు ఏవిధంగా రూ.1000 పంపిణీ చేస్తున్నారో, అదే తరహాలోనే విద్యార్థులకు కూడా అందజేయనున్నారు.

కార్మికుడి భార్య పేరిట రూ.4.50 కోట్ల జీఎస్టీ బిల్లు

- సంక్షేమ పథకాలను నిలిపివేసిన వైనం
- లబోదిబోమంటున్న బాధితురాలు

సాక్షి, చెన్నై : ఓ ప్రైవేటు పరిశ్రమలో రోజు వారీ కూలీగా పనిచేస్తున్న కార్మికుడి భార్యకు రూ.4.50 కోట్లు జీఎస్టీ బకాయి ఉన్నట్లు, త్వరితగతిన చెల్లించాలని సంబంధిత అధికారుల నుంచి నోటీసులు వచ్చాయి. అంతేకాకుండా ఈ మొత్తం చెల్లించని దృష్ట్యా, ఆమె బ్యాంక్ ఖాతాను సీజ్ చేశారు. అలాగే తమిళనాడు ప్రభుత్వ మగళిర్ ఉరిమై తిట్టం పథకాన్ని నిలుపుదల చేశారు. దీంతో బాధితులు అధికారుల వద్దకు గురువారం పరుగులు తీశారు. వివరాలు.. తిరుపత్తూరు జిల్లా అంబూరుకు చెందిన రియాజ్ అహ్మద్ గుడియాత్తంలోని ఓ ప్రైవేటు సంస్థలో రోజు వారి కూలీగా పనిచేస్తున్నాడు. నెలకు జీతం రూ. 15 వేలు వస్తోంది. ఇతడి భార్య మొబీనాకు తమిళనాడు ప్రభుత్వం అమలు చేస్తున్న మగళిర్ ఉరిమై తిట్టం(మహిళా హక్కు పథకం) మేరకు నెలకు రూ.1000 బ్యాంక్ ఖాతాలో గత కొన్ని నెలలుగా జమ చేస్తూ వస్తున్నారు. ఈ నెల ఆమెకు ఆ మొత్తం అందలేదు. ఈ విషయంగా ఓ జాతీయ బ్యాంక్ అధికారులను ప్రశ్నించగా, జీఎస్టీ అధికారులకు ఖాతాను సీజ్ చేసినట్టుగా పేర్కొనడం గమనార్హం. అదే సమయంలో ఆమె ఫోన్‌కు వచ్చిన ఎస్ఎంఎస్ మరింత ఆందోళనకు గురి చేసింది. రూ.4.50 కోట్లు జీఎస్టీ బకాయి ఉన్నట్టు, త్వరితగతిన చెల్లించాలన్న ఆదేశాలు జారీ అయ్యాయి. అంతవరకు బ్యాంక్ ఖాతాను సీజ్ చేస్తున్నామని, అలాగే, ప్రభుత్వ పథకాలను నిలుపుదల చేస్తున్నట్టు పేర్కొనడం మొబీనా ఆందోళనకు గురైంది. తన భర్త రోజు వారి కూలీగా, తానేమో గృహిణిగా జీవనం సాగిస్తుంటే, ఈ జీఎస్టీ గొడవ ఏమిటో అన్న ఆందోళన తప్పలేదు. దీంతో తిరుపత్తూరు జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని గురువారం ఆశ్రయించారు. వారి ద్వారా వేలూరులోని జీఎస్టీ కార్యాలయానికి సమాచారం పంపించారు. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబానికి చెందిన తమకు అందే రూ. 1000 కూడా దక్కనివ్వకుండా చేస్తున్నారని మొబీనా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని జీఎస్టీ అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.




భేటీ

ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో గురువారం సచివాలయంలో యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌహ్ అల్ మరి నేతృత్వంలో అక్కడి అధికారుల బృందం భేటీ అయ్యారు. అర్ధగంటకు పైగా జరిగిన ఈ భేటీలో తమిళనాడులో వ్యవసాయం, సాంకేతిక సంబంధిత రంగాలలో పెట్టుబడుల గురించి చర్చించారు.

– సాక్షి, చెన్నై

కేంద్రం ముందుకు కావేరి పంచాయితీ



కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమైన మంత్రి దురైమురుగన్, అధికారులు

- ముల్లై పెరియార్ వ్యవహారంపై కూడా..

సాక్షి, చెన్నై: కావేరి జలాల విడుదలలో కర్ణాటక నిర్లక్ష్యం, మేఘదాతులో డ్యాం నిర్మాణానికి సంబంధించిన పంచాయితీ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ వద్దకు చేరింది. గురువారం ఆయన్ని రాష్ట్ర నీటి పారుదల శాఖమంత్రి దురై మురుగన్ కలిశారు. ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో రాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులు సైతం రాష్ట్ర మంత్రితో కలిసి జలశక్తి మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు వినతిపత్రం సమర్పించారు. కర్ణాటకతో కావేరి వ్యవహారం వివాదం, మేఘదాతులో డ్యాం నిర్మాణ అంశం, కేరళతో ముల్లైపెరియార్ డ్యాం వివాదం వంటి అంశాల గురించి అందులో వివరించారు. తమిళనాడుకు న్యాయం చేకూర్చాలని విన్నవించారు. అనంతరం దురై మురుగన్ మీడియాతో మాట్లాడుతూ, కావేరి జలాల విడుదలలో కర్ణాటక నిర్లక్ష్యం, కోర్టు తీర్పుల ఉల్లంఘన తదితర అంశాలను మంత్రికి వివరించామన్నారు. అలాగే కావేరి జలాలను అడ్డుకునే విధంగా ఆ నదీ తీరంలోని మేఘా దాతు వద్ద డ్యాం నిర్మాణానికి కర్ణాటక చేస్తున్న ప్రయత్నాలను తాము అడ్డుకుంటామని, ఇందుకు కేంద్రం సహకారం అందించాలని విన్నవించామన్నారు. ముల్లై పెరియార్‌కు ప్రత్యామ్నాయంగా మరో డ్యాం నిర్మాణానికి కేరళ చేస్తున్న ప్రయత్నాలకు బ్రేక్ వేయాలని కోరినట్టు తెలిపారు. చివరగా త్వరలో తమిళనాడు డిప్యూటీ సీఎం కాబోతున్నట్లుందే? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా వామ్మో.. నాకొద్దు ఈ వివాదం అంటూ జారుకున్నారు. ఇదిలా ఉండగా కర్ణాటక నుంచి కావేరిలో ప్రస్తుతం నీటి ఉధృతి క్రమంగా పెరుగుతోంది. దీంతో మేట్టూరు జలాశయం నీటిమట్టం గురువారం సాయంత్రానికి 90 అడుగులకు చేరింది.

క్లుప్తంగా

ఈదురుగాలులకు ఎగిరిపోయిన ప్రభుత్వ బస్సు పైకప్పు



ఎగిరిపోయిన బస్సు పైకప్పు

అన్నానగర్: ఈదురుగాలులకు ప్రభుత్వ బస్సు పైకప్పు ఎగిరిపోయింది. ఆడి మాసం ప్రారంభం నుంచి పళని పరిసరాల్లో ఈదురు గాలులు వీస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు పళనిలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఫలితంగా పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. కీరనూరు నుంచి పళని వెళ్లే ప్రభుత్వ టౌన్ బస్సు నారికల్‌పట్టి వద్ద వస్తుండగా, పైకప్పు ఎగిరిపడింది. వెంటనే డ్రైవర్ బస్సును ఆపివేసి ప్రయాణికులను కిందికి దించారు. అలాగే పలుచోట్ల 15 వరకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

ఆమ్నీ బస్సు డ్రైవర్ చేతులు కట్టేసి దాడి

- వీడియో వైరల్



బస్సు డ్రైవర్‌ను కిటికీకి కట్టివేసిన దృశ్యం

అన్నానగర్: ఆమ్నీ బస్సు డ్రైవర్ చేతులు కట్టేసి దాడి చేశారు. మదురైలోని మాట్టుదావణిలో ఆమ్నీ బస్‌స్టేషన్ నుంచి చెన్నైతోపాటు బెంగళూరు వంటి నగరాలకు ఆమ్నీ బస్సులు నడుపుతున్నారు. అయితే ఓ డ్రైవర్ తన ఫోన్ ద్వారా ఛార్జీల నగదును స్వీకరించినట్లు తేలడంతో అతనిపై ఇతర కార్మికులు, అధికారులు డ్రైవర్ చేతులను కిటికీకి కట్టేసి దాడి చేశారు. ఈ దాడి ఘటనకు సంబంధించి మాట్టుదావణి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏనుగు దాడిలో వృద్ధురాలి మృతి

తిరువొత్తియూరు: ఏనుగు దాడిలో వృద్ధురాలు మృతి చెందారు. గోపి సమీపంలోని పున్జయ్‌తురై పాలయం అన్నానగర్‌కు చెందిన మసీయమ్మాల్ (63) బుధవారం కొందరు మహిళలతో కలిసి అటవీ ప్రాంతంలోకి వంట చెరుకు కోసం వెళ్లారు. వంట చెరుకు ఏరుకొన్న తర్వాత ఇంటికి మహిళలు తిరిగి వచ్చారు. అయితే మసీయమ్మాల్ మాత్రం తిరిగి రాలేదు. సమాచారం తెలుసుకున్న టీఎన్ పాలయం అటవీశాఖ సిబ్బంది అటవీ ప్రాంతంలో వెళ్లి వెతికారు. ఏనుగు దాడిలో మసీయమ్మాల్ మృతి చెంది ఉన్నట్లు గుర్తించి మంగళపుదురు పోలీసులకు తెలియజేశారు. తర్వాత మసీయమ్మాల్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గోపి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎన్నికల్లో ప్రాధాన్యత పెంచండి

- డీఎంకే సమన్వయ కమిటీకి మహిళా నేతల విజ్ఞప్తి
- ఒంటరి పయనంపై అభిప్రాయాల సేకరణ?



మంత్రులకు సమస్యలు విన్నవిస్తున్న మహిళా నేతలు

సాక్షి, చెన్నై: అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమయ్యే విధంగా పార్టీ వర్గాల అభిప్రాయాలను సేకరించే దిశగా డీఎంకే సమన్వయ కమిటీ తన కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. గురువారం పార్టీ మహిళా, విద్యార్థి విభాగాలతో వేర్వేరుగా ఈ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా మహిళా విభాగం లోని నేతలకు ఎన్నికల్లో పోటీ చేసే విధంగా ప్రాధాన్యతను పెంచాలని విజ్ఞప్తి సమన్వయ కమిటీకి చేరింది. 2026 అసెంబ్లీ ఎన్నికల ద్వారా మళ్లీ అధికార పగ్గాలే లక్ష్యంగా డీఎంకే వ్యూహాలకు పదును పెట్టిన విషయం తెలిసిందే. ఈసారి 200 సీట్లను కైవసం చేసుకోవాలన్న నినాదంతో సీఎం స్టాలిన్ ఉండడం మిత్ర పక్షాలను టెన్షన్‌లో పడేసింది. కూటమిలోని అనేక మిత్ర పక్ష పార్టీలను స్టాలిన్ పక్కన పెడుతారేమో అన్న చర్చ ఊపందుకుంది. ఇందుకు అనుగుణంగానే పార్టీ పరంగా నియమించిన సమన్వయ కమిటీ ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నట్లుంది. మంత్రులు నెహ్రూ, ఏవీ వేలు, ఉదయనిధి స్టాలిన్, తంగం తెన్నరసు సీనియర్ నేత ఆర్‌ఎస్‌భారతీ నేతృత్వంలో సమన్వయ కమిటీని స్టాలిన్ రంగంలోకి దించారు. ఈ కమిటీతో బుధవారం సీఎం , పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ సమావేశమయ్యారు.ఇందులో తీసుకున్న నిర్ణయాల మేరకు ఈ సమన్వయ కమిటీ తన కార్యాచరణలో భాగంగా డీఎంకేలోని అన్ని విభాగాలతో తొలుత సంప్రదింపులకు సిద్ధమైంది.

అభిప్రాయాల సేకరణ

డీఎంకేలోని 23 అనుబంధ విభాగాలతో సమావేశాలకు సమన్వయ కమిటీ రెడీ అయ్యింది. ఇందులో భాగంగా గురువారం మహిళా విభాగం, విద్యార్థి విభాగాలతో కమిటీ సమావేశమైంది. వారి అభిప్రాయాలను స్వీకరించారు. మహిళా విభాగం అధ్యక్షురాలు విజయ, కార్యదర్శి హెలన్ డెవిడ్సన్, విద్యార్థి విభాగం కార్యదర్శి ఎలిలరసేల నేతృత్వంలోని విభాగాలతో వేర్వేగారు కొన్ని గంటల పాటు ఈ కమిటీ చర్చలు జరిపింది. ప్రతి ఒక్కరి అభిప్రాయాలను సేకరించింది. ఇందులో రానున్న ఎన్నికలలో డీఎంకే ఒంటరి పయనానికి సిద్ధమవుతోన్నదా? అన్న చర్చకు తెరలేపే విధంగా కొన్ని ప్రశ్నలను కమిటీ సంధించడం గమనార్హం. అదే సమయంలో మహిళా విభాగం నేతలు తమక ప్రాధాన్యతను పెంచాలని విన్నవించారు. మహిళలు అధిక సంఖ్యలో పోటీ చేయడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని, పార్టీ కోసం శ్రమిస్తున్న మహిళా నేతలకు పోటీచేసే అవకాశం కల్పించాలని విన్నవించారు.

నమ్మకం ఉంటే సాధించవచ్చు



విద్యార్థులతో నటుడు శివకుమార్, సూర్య, కార్తీ

తమిళసినిమా: సీనియర్ నటుడు శివకుమార్ అగరం పౌండేషన్ ద్వారా ప్లస్- 2లో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులైన పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాదికి సంబంధించిన ఈ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్‌ల్యాబ్‌లో నిర్వహించారు. ఇందులో నటుడు శివకుమార్, సూర్య, కార్తీ తదితరులు పాల్గొని అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు విద్యా అవార్డులతో పాటు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా నటుడు సూర్య మాట్లాడుతూ సమాజంలో నెలకు రూ.3 వేలు కూడా సంపాదించలేని కటుంబాలు ఉన్నాయన్నారు. అలాంటి కుటుంబాలకు చెందిన విద్యార్థులు విద్యలో రాణించడంపై హర్షం వ్యక్తం చేశారు. తనకిప్పుడు 49 ఏళ్లు వచ్చాయనీ, చాలా ఉన్నత స్థాయిలో ఉండటంతో ఈ సేవా కార్యక్రమాలు చేయడం పెద్ద విషయం కాదన్నారు. రానున్న 20 ఏళ్లలో విద్యార్థులు ఎదిగే స్థాయి ఉన్నతంగా ఉంటుందన్నారు. అగరం అనే విత్తనం ద్వారా 6 వేల మంది విద్యార్థులను మార్చగలిగామని చెప్పారు. ప్రారంభ దశలో తాను ఎందుకు పనికిరానివాడిగా ఉన్నాననీ, ఒక గార్మెంట్ కంపెనీలో పని చేశానని చెప్పారు. అలాంటిది సడన్‌గా ఎందుకు యూటర్న్ తీసుకున్నానో తనకే తెలియదన్నారు. అలా కెమెరా ముందుకు వచ్చానని, అయితే తాను నటుడవుతానని ఊహించలేదన్నారు. నేరుక్కు నేర్ చిత్రం చిత్రం విడుదలైన తరువాత లభించిన అభిమానానికి తాను అర్హుడినా అని కూడా ప్రశ్నించుకున్నానని చెప్పారు. అందుకు ఇంకా శ్రమించాలని భావించి ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. ఆలోచనలు సరిగా ఉంటే మనం చేరాల్సిన లక్ష్యం దరిచేరుతుందన్నారు. జీవితం చాలా అందమైనదనీ, నమక్కం ఉంటే నిశ్చయంగా సాధించవచ్చుననీ అన్నారు.

ఊరగాయ దెబ్బకు రూ. 35 వేలు జరిమానా

- హోటల్ యజమానికి వినియోగదారుల ఫోరం వడ్డన

సాక్షి, చెన్నై : ఆహారం పార్శిల్‌లో ఊరగాయ కనిపించక పోవడంతో ఓ వ్యక్తి తీవ్ర మనస్తాపంతో ఇచ్చిన ఫిర్యాదుతో ఓ హోటల్ యజామానికి రూ. 35 వేలు జరిమానా విధిస్తూ విల్లుపురం వినియోగ దారుల ఫోరం ఆదేశాలు ఇచ్చింది. వివరాలు.. విల్లుపురం వరుద రెడ్డి ప్రాంతానికి చెందిన ఆరోగ్య స్వామి గత ఏడాది నవంబరు 27వ తేదీన బస్టాండ్ ఆవరణలో బాల మురుగన్ హోటల్‌లో భోజనం ఆర్డర్ చేశారు. వారి మెనూ కార్డులో ఒక భోజనంరూ. 80గా పేర్కొనడమే కాకుండా అన్నం, సాంబార్, కారం పులుసు, రసం, మజ్జిగా, తాలింపు, అరటి ఆకు, అప్పలం, రూ. విలువ చేసే ఊరగాయ ప్యాకెట్ ఇస్తామని పేర్కొనడంతో 25 పార్శిళ్ల ఆర్డర్ చేశారు. మరుసటి రోజైన 28వ తేదీన ఈ పార్శిల్స్‌ను తనకు అప్పగించాలని సూచించారు. ఈ మేరకు మరుసటి రోజు ఇంటికి భోజనం పార్శిల్స్ తీసుకెళ్లాడు. అయితే, ఏ ఒక్క ప్యాకెట్‌లోనూ ఊరగాయ కనిపించ లేదు. ఈ విషయంపై ఆ హోటల్ యజమానిని నిలదీశారు. ఒక్కో ఊరగాయ ప్యాకెట్‌కు వసూలు చేసే రూ. 1 తనకు ఇవ్వాలని పట్టుబట్టాడు. అయితే, వారు ఇవ్వలేదు. దీంతో ఆ హోటల్‌లో తాను ఆర్డర్ చేసినందుకు ఉన్న బిల్లు, ఊరగాయ లేక పోవడానికి సంబంధించిన ఆధారాలతో విల్లుపురం వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించాడు. తన ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమం నిమిత్తం ఆ హోటల్‌లో భోజనం ఆర్డర్ చేసి తీసుకెళ్లానని, అయితే, ఊరగాయ లేక పోవడం తీవ్ర మనస్తాపాన్ని కలిగించినట్టు ఫోరంకు వివరించారు. ఫోరం అధ్యక్షుడు సతీష్‌కుమార్, సభ్యులు మీరా మోహిద్దీన్, అమల విచారణ చేసి హోటల్ యజామానికి జరిమానా విధిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జరిమానాగా రూ. 30 వేలు, విచారణ ఖర్చుగా రూ. 5 వేలు, ఊరగాయకు రూ. 25 కలిపి మొత్తం రూ. 35,025ను ఆరోగ్య స్వామికి అందజేయాలని ఆదేశించారు. ఈ మొత్తాన్ని చెల్లించడంలో జాప్యం చేస్తే నెలకు 9 శాతం వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

తిరుత్తణి ఆలయ హుండీ కానుక రూ. 1.51 కోట్లు



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

తిరుత్తణి: తిరుత్తణి ఆలయంలో భక్తులు హుండీల్లో చెల్లించిన కానుకలు లెక్కింపు కొండ ఆలయంలోని దేవరమండపంలో బుధవారం నిర్వహించారు. ఆలయ జాయింట్ కమిషనర్ అరుణాచలం(ఇన్‌చార్జ్) అధ్యక్షతన సీసీ కెమెరాలు పొందుపరిచి హుండీలు తెరిచి లెక్కింపు చేపట్టారు. ఆలయ సిబ్బంది పాల్గొని ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు కానుకలను లెక్కించారు. గత 23 రోజుల్లో భక్తుల చెల్లించిన కానుకల్లో రూ. కోటి 51 లక్షల 90 వేల 233 నగదు, 790 గ్రాముల బంగారం, 14 వేల 650 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

సేవ్ ఎనర్జీ లక్ష్యంగా ఐఐటీతో ఒప్పందం



మాట్లాడుతున్న శేఖర్

సాక్షి చెన్నై: సేవ్ ఎనర్జీ మిషన్ పేరుతో ఐఐటీ మద్రాసుతో కోటాక్ మహీంద్ర బ్యాంకు భాగస్వామ్యం కీలక ఒప్పందం చేసుకుందని, తద్వారా ఇంధన సంరక్షణ, తయారీ రంగంలో డీ కార్బనైజేషన్‌పై దృష్టి పెట్టినట్టు ఆ బ్యాంకు ఎస్ఎంఈ ప్రెసిడెంట్ శేఖర్ భండారి తెలిపారు. స్థానికంగా గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమిళనాట ఎస్ఎంఈ రంగాన్ని విస్తరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వివరించారు. కోటాక్‌లో ఎస్ఎంఈ బ్యాంకింగ్ అనేది కేవలం నిధుల కోసం కాకుండా మొత్తం పర్యావరణ వ్యవస్థను నిర్మించడం, వాటి వృద్ధి ప్రయాణంలో భాగస్వామ్యం చేయటం తమ భాధ్యతని పేర్కొన్నారు. ఎస్ఎంఈ సెగ్మెంట్‌లో వివిధ రకాల ఇందన మధింపు సేవలను అందించటం ద్వారా ఇంధన సామర్యాన్ని ఎనేబుల్ చేసే ప్రాథమిక లక్ష్యంతో ఐఐటీ మద్రాసుతో సేవ్ ఎనర్జీ మిషన్ అనే పేరుతో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నామన్నారు. అలాగే ఇప్పటి వరకు 23 వేర్వేరు ఉత్పాదక రంగాల్లోని 161 ఎస్ఎంఈల కోసం వివరణాత్మక శక్తికి సంబంధించిన పరిశోధన, తనిఖీలు నిర్వహించామన్నారు.

రూ. 63 లక్షల విలువైన బంగారం స్వాధీనం

అన్నానగర్: కోయంబత్తూరు విమానాశ్రయంలో గురువారం ఉదయం రూ.63 లక్షల విలువైన బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. వివరాలు..కోయంబత్తూరుకు గురువారం సింగపూర్ నుంచి ఓ విమానం వచ్చింది. అందులో వచ్చిన ఓ ప్రయాణికుడిని రెవెన్యూ - ఇన్వెస్టిగేషన్ విభాగం అధికారులు తనిఖీ చేశారు. ఆ సమయంలో అతని బ్యాగులో 854 గ్రాముల 4 బంగారు కడ్డీలు, బంగారు ఆభరణాలు ఉన్నాయి. వీటి విలువ రూ.63.24 లక్షలుగా గుర్తించారు. ట్యాక్స్ చెల్లించకుండానే నగలు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వాటిని సీజ్ చేసి నిందితుడిని విచారణ చేస్తున్నారు.

బాలికపై బలాత్కారం

- యువకుడు అరెస్టు

తిరువొత్తియూరు: నెల్‌లై సమీపంలో 16 ఏళ్ల బాలికపై బలాత్కారం చేసిన యువకుడిని, అతనికి సహకరించిన వృద్ధురాలిని పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. తూత్తుకుడి జిల్లా శ్రీవైకుంతం ప్రాంతానికి చెందిన పేచిముత్తు. ఇతని బంధువు అయిన పచ్చమ్మాల్ (60). ఆమెను చూడడానికి నెల్‌లై జిల్లాకు వెళ్లాడు. అక్కడ 16 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి బలాత్కారం చేసినట్టు తెలిసింది. విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో తల్లిదండ్రులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి పేచిముత్తు, అతనికి సహకరించిన పచ్చమ్మాల్‌లపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ఇద్దరినీ అరెస్టు చేశారు.

ఆగస్టు 7న తెరపైకి మిన్‌మిని



మిన్‌మినీ చిత్ర ఆడియోను ఆవిష్కరించిన దర్శకుడు నితిలన్ స్వామినాథన్‌తో యూనిట్ వర్గాలు

తమిళసినిమా: స్టేజ్ అన్రియల్, బేబీ షూ ప్రొడక్షన్స్, యాంకర్ పే స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన చిత్రం మిన్‌మిని. ఇంతకు ముందు సిల్లుక్కరుపట్టి, పూవరసన్ పీపీ వంటి వైవిధ్యభరిత కథా చిత్రాలను తెరకెక్కించిన హలితా షమీమ్ తాజాగా దర్శకత్వం వహించిన చిత్రం ఇది. ఏఆర్.రెహ్మాన్ వారసురాలు ఖతిజా రెహ్మాన్ సంగీత దర్శకురాలిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో గౌరవ్ కాళై, ప్రవీణ్ కిశోర్, ఎస్తర్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఆగస్టు 7వ తేదీన తెరపైకి రానుంది. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం చిత్రం ఆడియో, ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చెన్నైలోని ప్రసాద్‌ల్యాబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహారాజా చిత్రం ఫేమ్ నితిలన్ స్వామినాథన్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిన్‌మిని చిత్రంలోని పాటలు, ట్రైలర్ సూపర్‌గా ఉన్నాయన్నారు. ఈ చిత్రానికి చాలా అంకితభావం అవసరం అన్నారు. దర్శకురాలు హలితా షమీమ్ చిత్రాల టైటిల్స్‌కు తాను పెద్ద అభిమానినని పేర్కొన్నారు. సిల్లుక్కరుపట్టి, మిన్‌మిని మొదలగు అన్నీ ఐక్యూ మాదిరి ఉంటాయన్నారు. ఇందులో నటించిన కళాకారులకు, ఏఆర్ రెహాన్ కుంటుంబం నుంచి వచ్చిన సంగీత యువరాణి ఖతిజాకు శుభాకాంక్షలు అని అన్నారు. చిత్ర నిర్మాత, ఛాయాగ్రహకుడు మనో పరమహంసా మాట్లాడుతూ ఆటోశంకర్ చిత్రాన్ని నిర్మించినప్పుడు తనను చాలా మంది విమర్శించారన్నారు. ఆ తరువాత కచ్చితంగా మంచి చిత్రం చేస్తాననే నమ్మకం కలిగిందన్నారు. అలాంటి చిత్రంగా ఈ మిన్‌మిని చిత్రం అమిరిందని చెప్పారు. లాభం కోసం ఈ చిత్రాన్ని నిర్మించలేదని, మంచి చిత్రం చేయాలనే భావనతోనే చేశానని చెప్పారు. దీన్ని ముందు ఓటీటీకి విక్రయించాలని భావించానని, అయితే ఇటీవల విడుదలై మంచి విజయాన్ని సాధించిన మంజుమల్ బాయ్స్ చిత్రం తనకు మంచి నమ్మకాన్నిచ్చిందన్నారు. దర్శకుడు బాలచందర్ ఎలాగైతే రజనీకాంత్, కమలహాసన్ వంటి వారిని పరిచయం చేశారో, అలా తాము ఈ చిత్రం ద్వారా మంచి నటీనటులను పరిచయం చేసినట్లు పేర్కొన్నారు. ఇళయరాజా సంగీతం అనుభూతిని ఈ చిత్రంలో ఖతిజా కలిగించారని అన్నారు. ఇక హలీతా ఏ విషయంలోనూ రాజీ పడని దర్శకురాలు అని, ఈ చిత్రం బాగా రావడానికి కారణం ఆమేనని అన్నారు. సంగీత దర్శకురాలు ఖతిజా రహ్మాన్ మాట్లాడుతూ ఇది జరుగుతుందని తాను నమ్మలేకపోయానన్నారు. దర్శకురాలు హలీతా 2022లో తనను కలిశారన్నారు. ఆమెకు తన సంగీతం నచ్చిందన్నారు. హలీతా తనకు ఎలాంటి సంగీతం కావాలన్న విషయంలో చాలా క్లారిటీగా ఉండడం తనకు సులభం అయ్యిందని చెప్పారు. దర్శకురాలు హలీతా హమీమ్ మాట్లాడుతూ మిన్‌మినీ చిత్రం దర్శకుడు శంకర్ వరకూ రీచ్ అయ్యిందని చెప్పారు. ఈ చిత్రం విశేషం ఏమిటంటే ఇందులో బాలలతో నటింపజేసిన తరువాత 8 ఏళ్ల గ్యాప్ ఇచ్చి వారు పెరిగి పెద్ద అయిన తరువాత షూటింగ్ నిర్వహించి పూర్తి చేసినట్లు చెప్పారు.

కోలీవుడ్ టాక్స్

రీమేక్ కాదు రీమేడ్



అందగన్ చిత్రం ఆడియో ఆవిష్కరణ వేడుకలో యూనిట్ సభ్యులు

తమిళసినిమా: టాప్ స్టార్ ప్రశాంత్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం అందగన్. ఇది సూపర్‌హిట్ హిందీ చిత్రం అందాదూన్ చిత్రానికి రీమేక్ కావడం గమనార్హం. నటి ప్రియాఆనంద్, సిమ్రాన్, కార్తీక్, దర్శకుడు కేఎస్ రవికుమార్, సముద్రఖని, యోగిబాబు, వనితా విజయకుమార్, ఊర్వశీ తదితరులు ముఖ్య పాత్రలను పోషించిన ఈ చిత్రాన్ని స్టార్ మూవీస్ పతాకంపై సీనియర్ నటుడు త్యాగరాజన్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. సంతోష్‌నారాయణన్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రాన్ని ఆగస్ట్ 15న విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. కాగా అందగన్ చిత్ర ప్రోమో సాంగ్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం చెన్నైలోని ప్రసాద్‌ల్యాబ్‌లో విడుదల చేశారు. ఈ పాటను నటుడు విజయ్, ప్రభుదేవా కలిసి విడుదల చేయడం విశేషం. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు ప్రశాంత్ మాట్లాడుతూ అందగన్ చిత్రంలోని ఆంతం పాటను నటుడు విజయ్ విడుదల చేసినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు. ఈ పాటను రూపొందించిన ప్రభుదేవాకు, నృత్యదర్శకత్వం వహించిన శాండి మాస్టర్‌కు, పాటలో భాగస్వామి అయిన అనిరుధ్‌కు, నటుడు విజయ్ సేతుపతికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. చిత్ర దర్శక,నిర్మాత త్యాగరాజన్ మాట్లాడుతూ హిందీ చిత్రం అందాదూన్ చిత్ర రీమేక్ హక్కులను 2019లో గట్టి పోటీ మధ్య కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఆ తరువాత కరోనా కారణంగా రెండేళ్లు జాప్యం జరిగిందన్నారు. తర్వాత కొన్ని అనివార్యకారణాల వల్ల ఈ చిత్ర దర్శకత్వం బాధ్యతలను తానే నిర్వహించాల్సి వచ్చిందన్నారు. ఆ తరువాత చిత్రంలోని పాత్రలకు తగిన నటీనటులను ఎంపిక చేసినట్లు చెప్పారు. అదే విధంగా కథను మన నేటివిటీకి తగ్గట్లుగా పలు చేర్పులు, మార్పులు చేసినట్లు చెప్పారు. అలా ఇది రీమేక్ చిత్రం కాదనీ, రీమేడ్ చిత్రం అని త్యాగరాజన్ పేర్కొన్నారు.



రాశీఖన్నా

విమర్శలు ఏమీ చేయలేవు

తమిళసినిమా: ఈ నెల రెండో వారంలో సంగీతజ్ఞాని ఇళయరాజా సంగీత విభావిరి కార్యక్రమం చెన్నై, నందనంలోని వైఎంసీఏ మైదానంలో జరిగిన విషయం తెలిసిందే. కాగా తాజాగా అదే మైదానంలో ఆయన వారసుడు, ప్రముఖ సంగీత దర్శకుడు యువన్ శంకర్‌రాజా సంగీత విభావరి కార్యక్రమం శుక్రవారం జరగనుండడం విశేషం. నాయిస్ అండ్ గ్రెయిన్స్, బూమర్ ఫ్యాషన్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సంగీత విభావరి వివరాలను తెలపడానికి నిర్వాహకులు బుధవారం చెన్నైలోని ప్రసాద్‌ల్యాబ్‌లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అందులో నాయిస్ అండ్ గ్రెయిన్స్ సంస్థ అధినేత మహావీర్ మాట్లాడుతూ యువన్ శంకర్‌రాజాతో సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఇది ఆయనతో కలిసి నిర్వహిస్తున్న రెండో సంగీత విభావరి అని పేర్కొన్నారు. ఇదే విధంగా కోయంబత్తూర్‌లోనూ నిర్వహించనున్నట్లు తెలిపారు. యువన్ శంకర్‌రాజా మాట్లాడుతూ ఈ సంగీత విభావరిని ప్రేక్షకులకు దగ్గరా నిర్వహించాలని భావించామని, దీంతో 360 డిగ్రీ కోణంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇలా 360 డిగ్రీ కోణంలో నిర్వహించడం ఇండియాలోనే తొలిసారి అని పేర్కొన్నారు. ఈ వేదికపై ప్రేక్షకులకు నచ్చే విధంగా 36 పాటల వరకూ ప్రముఖ గాయనీగాయకులు పాడతారని చెప్పారు. ఇందులో తన తండ్రి ఇళయరాజా కూడా పాల్గొనేలా ప్రయత్నం చేస్తామని చెప్పారు. కాగా ఇంతకు ముందు మీ తండ్రి ఇళయరాజాను ఎంతగానో ప్రశంసలు అందుకున్నారని, అలాంటిది రాజకీయాల్లోకి వచ్చిన తరువాత విమర్శలను ఎదుర్కొనడంపై మీ సమాధానం అన్న ప్రశ్నకు విమర్శలు తనను ఏమీ చేయలేవనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.



సంగీత దర్శకుడు యువన్ శంకర్‌రాజాతో నిర్వాహకులు

నేను నటిస్తున్నవన్నీ పాన్ ఇండియా చిత్రాలే



నటి మీనాక్షీ చౌదరి

తమిళసినిమా: లక్కీ హీరోయిన్ల లిస్టులో చేరిపోయారు నటి మీనాక్షీ చౌదరి. చిన్న చిన్న చిత్రాల్లో కథానాయకిగా నటిస్తూ వచ్చిన ఈ భామ తెలుగులో మహేశ్‌బాబు హీరోగా నటించిన గుంటూరు కారం చిత్రంలో నటించి బాగా పాపులర్ అయ్యారు. ఇకపోతే ఈమెకు తమిళంలోనూ వరుసగా అవకాశాలు రావడం విశేషం. కోలీవుడ్‌లోకి విజయ్ ఆంటోని హీరోగా నటించిన కొలై చిత్రంతో ఎంట్రీ ఇచ్చారు. ప్రస్తుతం విజయ్ హీరోగా నటించిన గోట్ చిత్రంలో నటించే స్థాయికి చేరుకున్నారు. వెంకట్ ప్రభు దర్శకత్వంలో ఏజీఎస్ ఎంటర్‌టెయిన్‌మెంట్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం భారీ అంచనాల మధ్య సెప్టెంబర్ నెలలో తెరపైకి రానుంది. ఈ సందర్భంగా ఇటీవల ఒక భేటీలో నటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ అవకాశాలు రావడం అన్నది దేవుడి వరంగా పేర్కొన్నారు. తనకు చాలా అవకాశాలు వస్తున్నాయని, చాలా సంతోషంగా ఉందన్నారు. నటుడు విజయ్‌కు జంటగా నటించిన గోట్ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబర్‌లో విడుదలకు సిద్ధం అవుతున్నట్లు చెప్పారు. అలాగే దుల్కర్‌సల్మాన్ సరసన నటించిన లక్కీభాస్కర్ కూడా పాన్ ఇండియా చిత్రమేనని చెప్పారు. ఈ చిత్రం సెప్టెంబర్ నెలలోనే తెరపైకి రానుందని పేర్కొన్నారు. ఇకపోతే తెలుగులో వెంకటేశ్‌కు జంటగా కొత్త చిత్రంలోనూ, వరుణ్ తేజ్ సరసన మట్కా చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నట్లు నటి మీనాక్షీ చౌదరి చెప్పారు. తాను నటిస్తున్న చిత్రాలన్నీ పాన్ ఇండియా చిత్రాలేని పేర్కొన్నారు. అయితే వీటిని చూస్తుంటే ఒక పక్క సంతోషంగా ఉన్నా, మరో పక్క భయంగానూ ఉందన్నారు. యువ హీరోలతోనూ, సీనియర్ హీరోలతోనూ నటించే అవకాశాలు తనకు మాత్రమే వస్తున్నాయని మీనాక్షీ చౌదరి అన్నారు.

సుందర్ సీ, రాశీఖన్నా కాంబో రిపీట్

తమిళసినిమా: దర్శకుడు సుందర్ సీ చిత్రాల్లో కావల్సినంత ఫన్, గ్లామర్ ఉంటుంది. ఆయన ఇటీవల చేసిన హారర్, థ్రిల్లర్ కథా చిత్రాల్లోనూ పైన చెప్పిన అంశాలు ప్రేక్షకులను విపరీతంగా అలరించాయి.కాగా సుందర్ సి ఇంతకు ముందు తెరకెక్కించిన అరణ్మణై 4 చిత్రంలో నటి తమన్నా, రాశీఖన్నా హీరోయిన్లుగా నటించారు. వారి నటన, స్కిన్ షో ఆ చిత్ర విజయానికి బలమైన కారణంగా నిలిచాయన్నది ఎవరూ కాదనలేని నిజం. అరణ్మణై 4 చిత్రం వసూళ్ల వర్షం కురిపించింది. దీంతో ఆయన వెంటనే మరో చిత్రానికి రెడీ అయ్యిపోయారు. ఈ చిత్రం కూడా ఆయన చిత్రాల జానర్ లోనే ఎంటర్ టైనర్‌గా ఉంటుందని భావించవచ్చు. మరో విషయం ఏమిటంటే ఇందులో నటి తమన్నా నాయకిగా నటించనున్నట్లు ప్రచారం జరిగింది. అయితే తాజాగా తమన్నా కాదు నటి రాశీఖన్నా నాయకిగా నటిస్తున్నట్లు తెలిసింది. అరణ్మణై 4 చిత్రంలో రాశీఖన్నాపై చిత్రీకరించిన ఒక పాటను చిత్రం నుంచి తొలగించిన విషయాన్ని సుందర్ సీ నే మీడియా సమావేశంలో పేర్కొనడంతో పాటు ఆమెకు సారీ కూడా చెప్పారు. ఏదేమైనా ఆయన తాజా చిత్రంలో మరోసారి రాశీఖన్నాకు ఛాన్స్ ఇచ్చారన్న మాట. మరో విశేషం ఏమిటంటే ఈ చిత్రంలో నటుడు వడివేలు ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఈ చిత్రంలోనూ జనరంజకమైన అంశాలు ఉంటాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. కాగా ఈ చిత్రం ఇప్పటికే షూటింగ్ జరుపుకుంటున్నట్లు తెలిసింది. ఐయితే దీనికి సంబంధించి పూర్తి వివరాలతో కూడిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.

క్లుప్తంగా

గల్లంతైన డ్రైవర్లు మృతి

సాక్షి, చెన్నై: కర్ణాటక రాష్ట్రంలో గల్లంతైన డ్రైవర్లు మృతి చెందారు. వడగండై సమీపంలోని అంగోలా సిరువురు ప్రాంతంలో ఈనెల 16వ తేదీన వర్షాల దాటికి కొండ చరియలు, మట్టి చరియలు విరిగి పడ్డాయి. ఈ ప్రమాదంలో తమిళనాడులోని నామక్కల్‌కు చెందిన ఎల్‌పీజీ ట్యాంకర్ డ్రైవర్లు చిన్నన్నన్, కృష్ణగిరికి చెందిన మురుగన్‌లు గల్లంతయ్యారు. వీరి కోసం గాలింపు చేపట్టారు. మట్టి చరియలను తొలగించారు. గురువారం రాత్రి వారి మృతదేహాలు బయటపడ్డాయి. ఈ సమాచారంతో ఆ కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

కుళ్లిన స్థితిలో మృతదేహం

తిరువళ్లూరు: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య మరో వ్యక్తితో పరార్ కావడంతో తీవ్ర మనస్తాపం చెందిన వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరువళ్లూరు జిల్లా పెనాలూరుపేటకు చెందిన ధనపాల్ కుమారుడు పురుషోత్తమన్(30) ఓ యువతిని ప్రేమించి, ఏడాది కిందట వివాహం చేసుకున్నాడు. అయితే మద్యం సేవించే అలవాటు ఉన్న పురుషోత్తమన్ వేధింపులు భరించలేక యువతి నెల రోజుల క్రితం మరో వ్యక్తితో పరారైంది. దీంతో మనస్తాపం చెందిన పురుషోత్తమన్ మూడు రోజుల క్రితం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని స్థానికులు గుర్తించక పోవడంతో బుధవారం రాత్రి దుర్వాసన వచ్చింది. దీంతో స్థానికులు పెనాలూరుపేట పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు తలుపులు పగలగొట్టి చూడగా ఉరికి వేలాడుతూ పురుషోత్తమ్ కుళ్లిన స్థితిలో కనిపించాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెనాలూరుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును చేపట్టారు.

భార్య అరెస్టు

అన్నానగర్: భర్తను హత్య చేసిన కేసులో భార్యను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..విల్లివాక్కం సిట్కోనగర్‌లో కౌష్ బాషా (48) నివాసముంటున్నాడు. ఇతనికి భార్య షాజితాబాను, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కౌష్‌బాషా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో గత ఏడాది ఫిబ్రవరి 28వ తేదీన అనారోగ్యంతో కౌష్ బాషా ఇంట్లోనే మృతి చెందినట్లు ఆయన భార్య తెలిపారు. ఈ మేరకు విల్లివాక్కం పోలీసులు కౌష్ బాషా మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అనంతరం అతని అంత్యక్రియలు ముగిశాయి. కాగా పోస్టుమార్టం నివేదికలో కౌష్‌బాషాను గొంతు నులిమి హత్య చేసినట్లు తెలిసింది. తర్వాత విల్లివాక్కం అసిస్టెంట్ కమిషనర్ చిదంబరం మురుగేషన్ నేతృత్వంలో పోలీసులు షాజితాబాను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. తన భర్త కౌష్‌బాషా మెడకు దుపట్టా బిగించి హత్య చేసినట్లు ఒప్పుకుంది. దీంతో పోలీసులు హత్య కేసుగా మార్చి షాజితాబానును గురువారం అరెస్టు చేశారు.

వీఏఓకు హత్య బెదిరింపు

తిరువళ్లూరు: మద్యం సేవించడానికి డబ్బులు ఇవ్వలేదన్న అక్కసుతో ఆమ్‌స్ట్రాంగ్ తరహాలో హత్య చేస్తానని వీఏఓను బెదిరించిన వ్యక్తిని పుల్ల రంబాక్కం పోలీసులు అరెస్టు చేశారు. తిరువళ్లూరు జిల్లా కల్యాణకుప్పం వీఏఓగా శ్రీని అలియాస్ శ్రీనివాసన్ పని చేస్తున్నాడు. అదే గ్రామంలో కర్ణన్ అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం కర్ణన్ వీఏఓ వద్దకు వచ్చిన తనకు మద్యం సేవించడానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అందుకు శ్రీనివాసన్ నిరాకరించడంతో ఆగ్రహించిన కర్ణన్ దాడికి యత్నించాడు. తనకు మద్యం సేవించడానికి అడిగినప్పుడల్లా డబ్బులు ఇవ్వాలని లేని పక్షంలో ఆమ్‌స్ట్రాంగ్ తరహా హత్య చేస్తానని బెదిరించాడు. దీంతో వీఏఓ వీడియో రికార్డింగ్ చేసి పుల్లరంబాక్కం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కర్ణన్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

బైపాస్ రోడ్డు ప్రారంభం



బైపాస్ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి గాంధీ

తిరుత్తణి: పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రూ. 52 కోట్ల వ్యయంతో నిర్మించిన బైపాస్‌రోడ్డును మంత్రి గాంధీ గురువారం ప్రారంభించారు. తిరుత్తణిలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి నిత్యం వేలాదిగా భక్తులు వస్తున్న నేపథ్యంలో వాహనాల రద్దీతో పట్టణంలో ట్రాఫిక్ నెలకొంటోంది. ఈ క్రమంలో రూ. 52 కోట్ల వ్యయంతో చెన్నై–తిరుపతి జాతీయ రహదారి పట్టాభిరామపురం క్రాస్ నుంచి అరక్కోణం హైవే రోడ్డు కార్తికేయపురం వరకు 3.2 కిలో మీటర్ల దూరం బైపాస్‌రోడ్డు నిర్మించారు. ఈ పనులు పూర్తి కావడంతో గురువారం బైపాస్‌రోడ్డు ప్రారంభించారు. తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ పాల్గొన్నారు.

వాహనాలు వేలం వేయాలని నిర్ణయం

కొరుక్కుపేట: తుప్పు పట్టి రోడ్డు పక్కన పడి ఉన్న వాహనాలను వేలం వేయాలని కార్పొరేషన్ యోచిస్తోంది. చెన్నైలోని పలు ప్రాంతాల్లో చాలా కాలంగా వాహనాలు ఎక్కడికక్కడే పడి ఉన్నాయి. రోడ్లు, ప్రధాన వీధుల్లో కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఎవరికీ చెందనివి ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షం, ఎండలకు ఆ వాహనాలు పాడైపోయి ప్రజలకు పనికిరాకుండా పోతున్నాయి. ఈ వాహనాలను వేలం వేయాలని కార్పొరేషన్ కమిషనర్ కుమారగురుపరన్ తెలిపారు.

చట్ట సభల నిర్వహణపై అవగాహన తప్పనిసరి

• మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



సమావేశంలో వెంకయ్యనాయుడు, అన్బుమణి రాందాసు తదితరులు

సాక్షి, చెన్నై: చట్టసభల నియమాలు, నిర్వహణ గురించి యువత తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపు నిచ్చారు. చెన్నై ఎగ్మోర్‌లోని మ్యూజియం థియేటర్‌లో సీఐఐ. చొరవతో యువత భాగస్వామ్యంలో నిర్వహించిన యంగ్ ఇండియన్స్ పార్లమెంట్ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు గురువారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ చట్టసభలపై యువతకు గౌరవం పెరిగేలా ప్రజాప్రతినిధులు నడుచుకోవాలని, సమర్థవంతమైన పాలన కోసం చట్టసభల్లో ఆలోచనలను పంచుకోవడం, చర్చించడం అత్యంత ఆవశ్యకం అని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధి అంటే పదవి మాత్రమే కాదని, అంతకు మించిన బాధ్యతగా పేర్కొంటూ, రాజ్యాంగం ఇచ్చిన హక్కులే కాదు, బాధ్యతల గురించి కూడా తెలుసుకుని ఆచరించాలని సూచించారు. చట్టసభలపై అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరం అన్నారు. తద్వారా యువతరం మన పార్లమెంట్ పని తీరును గమనిస్తూ ఉంటారని, కొత్త ఆలోచనలతో ముందుకు రావటానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. చట్ట సభల్లో బూతులు మాట్లాడే వారికి పోలింగ్ బూత్‌ల్లో బుద్ధి చెప్పాలని తాను తరచూ చెబుతూ ఉంటానని గుర్తు చేశారు. ఇందులోని ఆంతర్యం చట్టసభల గొప్పతనాన్ని తెలుసుకుని, గౌరవించే వారే అందులో ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజాప్రతినిధిగా పదవిని పొందడం అంటే అధికారం మాత్రమే కాదన్నారు. బాధ్యతను గుర్తించినప్పుడే ఆ పదవికి ఉండే గౌరవం ఇనుమడింపజేయడంతపాటు భవిష్యత్ తరాలకు మనల్ని గుర్తు పెట్టుకుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాసు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

వేలూరు: ప్రజలు అందజేసే వినతులపై అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సుబ్బలక్ష్మి అధికారులను హెచ్చరించారు. వేలూరు జిల్లా పల్లిగొండ సమీపంలోని ఇరవన్‌గాడులో ప్రజలతో ముఖ్యమంత్రి పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన వినతి పత్రాల స్వీకరణ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారుల వద్ద ఎంత మంది వినతి పత్రాలు అందజేశారు.. వాటిలో ఇళ్ల పట్టాలు, పెన్షన్‌లు, రేషన్ కార్డులు తదితర వాటి కోసం ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన వినతులపై 15 రోజుల్లో విచారణ జరిపి, లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, పెన్షన్ అనుమతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మాలతి, వికలాంగులు సంక్షేమ శాఖ అధికారి శరవణన్ పాల్గొన్నారు.

పొంగల్ తేలేదని ఆత్మహత్య

అన్నానగర్: మధురై దత్తనేరి అరుల్‌దాస్ పురం పెరియ సామినగర్‌కు చెందిన షణ్ముగసుందరం (60). ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఇటీవల ఆయన అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఉద్యోగానికి వెళ్లకుండా ఇంటి వద్దే చికిత్స పొందుతున్నాడు. అతని భార్య పాండిసెల్వి పూల వ్యాపారం చేస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం పొంగల్ కొనివ్వమని షణ్ముగసుందరం తన భార్య పాండిసెల్విని కోరాడు. కానీ స్థానిక దుకాణంలో పొంగల్ లేకపోవడంతో ఎప్పటిలాగే ఇడ్లీ కొని ఇంటికి తెచ్చింది. దీంతో షణ్ముగసుందరం ఎప్పుడు చూసిన ఇడ్లీ కొనిస్తున్నావు.. నేను అడిగినది కొనివ్వలేదని కోపగించుకున్నాడు. తర్వాత తాను చికిత్స కోసం మింగితున్న మాత్రలను అతిగా వేసుకుని స్పృహతప్పి పడిపోయాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం మధురై ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ షణ్ముగసుందరం గురువారం మృతి చెందాడు. స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సేంద్రియ వ్యవసాయాభివృద్ధే ఈశా ధ్యేయం



మాట్లాడుతున్న ముత్తుకుమార్

వేలూరు: సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడమే ఈశా కేంద్రం ధ్యేయమని, ఇందుకు రైతులు సహకరించాలని ఈశా కేంద్రం వేలూరు ఆర్గనైజర్ ముత్తుకుమార్ అన్నారు. గురువారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన వేలూరు శ్రీపురంలోని శ్రీనారాయణి మహల్‌లో రైతులను ప్రోత్సహించేలా వ్యవసాయ పంటలపై అవగాహన కల్పించడం, మన మట్టి, మన ఆహారం అనే కళా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలను పార్లమెంట్ సభ్యులు కదీర్‌ఆనంద్ ప్రారంభించనున్నారని, ఇందులో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల రైతులు పాల్గొనాలని కోరారు. ఈశా కేంద్రం 15 ఏళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులను ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందని, అందులో భాగంగా ఇప్పటి వరకు 25 వేల మంది రైతులకు సేంద్రియ ఆహార ధాన్యాలు పండించడంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కళాజాతాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ఎటువంటి పంటలను ఏ సీజన్‌లో సాగు చేయాలి, వాటిని ఏ విధంగా పండించాలనే అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ ఉత్సవాల్లో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి రైతులు అధిక సంఖ్యలో పాల్గొననున్నట్లు తెలిపారు.

విద్యార్థినులకు లైంగిక వేధింపులు

– ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

తిరువొత్తియూరు: విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన తమిళ ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. తిరుపూర్ జిల్లా ముత్తూరు కొడిముడి రోడ్డులో ప్రభుత్వ మహోన్నత పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో ముత్తూరుకు చెందిన రవిచంద్రన్ (59) తమిళ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇతను పాఠాలు బోధిస్తున్న సమయంలో విద్యార్థులను లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది. దీనిపై జిల్లా చిన్నారుల భద్రత కార్యాలయానికి బాధిత విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసుల విచారణలో ఉపాధ్యాయుడు విద్యార్థినులను వేధిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో బుధవారం రవిచంద్రన్‌ను పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు.

పుళల్‌లో కొనసాగిన ఆక్రమణల తొలగింపు

తిరువొత్తియూరు: పుళల్ నీటి వనరుల ప్రాంతంలో ఆక్రమణల తొలగింపు పనులు రెండో రోజైన గురువారం కూడా కొనసాగాయి. చెన్నైలోని పుళల్ ఎంజీఆర్ నగర్‌లోని నీటి వనరులను ఆక్రమించి నిర్మించిన 75కు పైగా ఇళ్లను పబ్లిక్ వర్క్స్, రెవెన్యూ శాఖ అధికారులు బుధవారం తొలగించారు. అక్కడ ఆక్రమంగా నిర్మించిన ఇళ్లన్నింటినీ కూల్చివేస్తున్నారు. అక్కడ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది భద్రతా విధుల్లో పాల్గొన్నారు. దీనికి నిరసనగా ఆ ప్రాంతానికి చెందిన కొందరు మహిళలు నిప్పంటించుకునేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బంది వారిపై నీరు పోసి రక్షించారు. ఈ క్రమంలో నీరు వనరులు ఉన్న ప్రాంతాలను ఆక్రమించి నిర్మించిన ఇళ్లను తొలగించే పనులు రెండో రోజైన గురువారం కూడా కొనసాగాయి.

పౌరబాధ్యతల్లో పన్ను చెల్లింపు ప్రధానం



నగదు బహుమతి ప్రదానం చేస్తున్న అమ్ము

కొరుక్కుపేట: పన్ను చెల్లించడం భారతీయ పౌర బాధ్యతల్లో ఒక ముఖ్యమైన అంశం అని ఆదాయపన్ను శాఖ సహాయ కమిషనర్ అమ్ము అన్నారు. స్థానిక పట్టాభిరామ్‌లో ఉన్న ధర్మమూర్తిరావు బహదూర్ కలవల కన్నన్ చెట్టి హిందూ కళాశాలలో బుధవారం ఆదాయపు పన్ను దినోత్సవం సందర్భంగా కళాశాలలోని వివిధ వాణిజ్య విభాగాలు కలిసి సంయుక్తంగా విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అమ్ము మాట్లాడుతూ ఆదాయపు పన్నును 1860లో సర్ జేమ్స్ విల్సన్ స్థాపించిన జ్ఞాపకార్థంగా ఈ ఆదాయపు పన్ను దినోత్సవాన్ని జులై 24వ తేదీన ఏటా జరుపుకుంటామన్నారు. ఇది భారతదేశ ఆర్థిక చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపు అని అభివర్ణించారు.

మామను హతమార్చిన అల్లుళ్లు

కొరుక్కుపేట: మామను అల్లుళ్లు కొడవలితో నరికి చంపిన సంఘటన శివగంగైలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. శివగంగై పాత ప్రభుత్వాస్పత్రి సమీపంలో నివసించే అష్రఫ్ అలీ (49) వేరుశనగ కాల్చే పని చేస్తున్నాడు. అతని ఇంటి పక్కనే నివాసం ఉంటున్న అతని సోదరి కుమారులు అబ్దుల్ రహమాన్, ఆసిక్‌లు మామ అష్రఫ్ అలీతో బుధవారం రాత్రి గొడవ పడ్డారు. దీంతో ఆసిక్ కొడవలితో అష్రఫ్ అలీని నరికి చంపాడు. ఈ దాడిలో అష్రఫ్ అలీ తల్లి సూరత్ జైలానీ కూడా తీవ్రంగా గాయపడి శివగంగ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అష్రఫ్ అలీని హత్య చేసిన అబ్దుల్ రెహమాన్, ఆసిక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శివగంగా నగర్ పోలీసు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన అన్నమయ్య కీర్తనలు

కొరుక్కుపేట: తెలుగు సంగీత గాయని అరుణా శ్రీనాథ్ ఆలపించిన పదకవితా పితామహుడు అన్నమాచార్యుల కీర్తనలు ప్రేక్షకులను అలరించాయి. అంబత్తూరులో కొత్తగా నిర్మించిన కన్యకాపరమేశ్వరీ ఆలయంలో మండలి పూజలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో తెలుగు సంగీత గాయని యడవల్లి అరుణా శ్రీనాథ్ పాల్గొని అన్నమాచార్య కీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో భాగంగా అంబత్తూరు ఆర్యవైశ్య సంఘం నిర్వాహకులు, సభ్యులు గాయనీ అరుణాశ్రీనాథ్‌ను ఘనంగా సత్కరించారు.

సెల్‌ఫోన్లు చోరీ

• ఇద్దరి అరెస్టు

తిరువొత్తియూరు: సెల్‌ఫోన్ల చోరీ కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై రాయపురం ఆర్‌ఎస్‌ఆర్‌ఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో కొత్త భవనం నిర్మిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కొందరు అక్కడే నివాసం ఉంటూ నిర్మాణ పనులు చేస్తున్నారు. వీరితో తిరువణ్ణామలై జిల్లా సెంగం ప్రాంతానికి చెందిన మేస్త్రీ వినూత్ (26) కలిసి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో 10 రోజుల క్రితం వినూత్ పనికి ఆగిపోయి గిండీలో మరో ఉద్యోగంలో చేరాడు. గిండీకి చెందిన బంధువు ఝూన్సీ(32)కి చికిత్స చేసేందుకు ఆమెను బుధవారం రాయపురం మెటర్నిటీ ఆస్పత్రికి తీసుకుని వచ్చాడు. ఆ సమయంలో ఝూన్సీని ఆస్పత్రిలో వదిలిపెట్టి ఉత్తరాది రాష్ట్ర కూలీలు ఉంటున్న ప్రదేశానికి వెళ్లి అక్కడి నుంచి 4 సెల్‌ఫోన్లు దొంగిలించాడు. దీంతో దిగ్భ్రాంతికి గురైన ఉత్తరాది రాష్ట్ర కార్మికులు అతడిని చుట్టుముట్టి పట్టుకున్నారు. అతనితో పాటు ఉన్న ఝూన్సీని రాయపురం క్రైం బ్రాంచ్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి వారిద్దరినీ అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.



• సభ్యత్వం

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళని స్వామి నేతృత్వంలో గురువారం తెన్‌కాశి, ఈరోడ్ తదితర లోక్‌సభ నియోజకవర్గాల నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెన్‌కాశి ఉత్తరం జిల్లాకు సిద్ధం చేసిన పార్టీ సభ్యత్వ కార్డులను ఆ జిల్లా కార్యదర్శి కడయనల్లూరు ఎమ్మెల్యే సి.కృష్ణ మురళి కి అందజేస్తున్న పళని స్వామి

–సాక్షి, చెన్నై

డీఎండీకే ఆధ్వర్యంలో ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న ప్రేమలత

తిరువళ్లూరు: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ డీఎండీకే ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఆవడిలో ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఆ పార్టీ ఉపకార్యదర్శి ఎల్‌కే సుదీస్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రేమలత మాట్లాడుతూ డీఎంకే అధికారంలోకి వచ్చినప్పుడల్లా విద్యుత్ చార్జీలను పెంచి నిరుపేదలను నట్టేట ముంచడం అలవాటుగా మారిందన్నారు. ప్రజలకు ఏకష్టం వచ్చినా డీఎండీకే అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఆనందన్, సూర్య, ప్రభాకరన్, మారన్, కుమార్, పళని పాల్గొన్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న ఆటో

• మహిళ మృతి
• ఐదుగురికి తీవ్రగాయాలు

అన్నానగర్: కాశిమేడులో గురువారం వేకువజామున రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్ లారీని ఆటో ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి చెందింది. మరో ఐదుగురు తీవ్ర గాయపడ్డారు. చెన్నైలోని చింతాద్రిపేటకు చెందిన సెల్వకుమార్ (39) షేర్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇతను గురువారం తెల్లవారుజామున ఎన్నూర్ నుంచి ఆరుగురు ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకుని కాశిమేడుకు వెళ్లాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు కాశిమేడులో దిగాల్సి వచ్చింది. అనంతరం కాశిమేడు సూర్యనారాయణ రోడ్డు పక్కన నిలబడిన కంటైనర్ లారీని షేర్ ఆటో ఢీకొని రోడ్డుపై బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ సెల్వకుమార్, తిరువళ్లిక్కేణి ప్రాంతానికి చెందిన వసంతి (36), ఆమె 10 ఏళ్ల కుమార్తె, అమ్మమ్మ శివగామి (50), రాధిక (34), ఎన్నూర్ ప్రాంతానికి చెందిన సుకాంతి (38) గాయపడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పుదువన్నార్‌పేట ట్రాఫిక్ పోలీసులు గాయపడిన ఆరుగురిని స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాధిక మృతి చెందింది. మరో ఐదుగురు చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తట్టచ్చూర్ సిక్స్ వే పనుల వేగవంతం

• పరిశీలించిన మంత్రి వేలు

సాక్షి, చెన్నై : చెన్నై శివారులోని తట్టచ్చూర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు వరకు చేపడుతున్న సిక్స్ వే పనుల వేగాన్ని పెంచే విధంగా అధికారులను రహదారుల శాఖ మంత్రి ఏవీ వేలు ఆదేశించారు. చెన్నై శివారులోని తిరువళ్లూరు జిల్లాలోని కాట్టుపల్లి వద్ద అదానీ పోర్టు ఏర్పాటైన విషయం తెలిసిందే. పలు రాష్ట్రాలు, నగరాలను ఈ పోర్టుకు అనుసంధానించే విధంగా కేంద్ర రహదారుల విస్తరణపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా చెన్నై శివారులోని రెడ్ హిల్స్ సమీపంలోని తట్టచ్చూర్ నుంచి ఆంధ్ర ప్రదేశ్ చిత్తూరు వరకు సిక్స్ వేగా రహదారి పనులకు సుమారు రూ. 3 వేల కోట్లతో చేపట్టారు. తమిళనాడులో ఈ సిక్స్ వే మార్గం, జరుగుతున్న పనులను రాష్ట్ర రహదారుల శాఖ మంత్రి ఏవీ వేలు పరిశీలించారు. అలాగే చెన్నై ఔటర్‌రింగ్ రోడ్డును పరిశీలించారు.

జాతీయ రహదారి పనులు త్వరగా పూర్తి చేయాలి

తిరువళ్లూరు: ఎన్నూరు నుంచి మహాబలిపురం వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేలు అధికారులకు సూచించారు. ఎన్నూరు– మహాబలిపురం జాతీయ రహదారి పనులను మంత్రి వేలు అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

27 నుంచి శతకోటి గాయత్రీ మహాపూర్ణాహుతి ఉత్సవం

కొరుక్కుపేట: అయోధ్యలో ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన శతకోటి గాయత్రీ మహామంత్ర జప మహాపూర్ణాహుతి మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సంధ్యావందన అభ్యసన శిక్షణ సమితి చెన్నై విభాగం కోఆర్డినేటర్ పోరూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం విల్లివాక్కంలో జరిగిన సమావేశంలో పోరూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్వశాంతి, లోక కళ్యాణార్థం కల్వకొలను చిత్తరంజన్ దాస్ స్మారక సేవా సంస్థ నిర్వాహకులు, బ్రహ్మశ్రీ కల్వకొలను శ్రీ రామచంద్రమూర్తి సారథ్యంలో ఈ మహోత్సవం అయోధ్యలో జరుగనున్నదన్నారు. ఐదు రోజులు పాటు సాగనున్న ఈ మహోత్సవంలో భాగంగా శ్రీరామపట్టాభిషేకం, సీతారాములు కల్యాణం, నగర సంకీర్తన, పవిత్ర సరయు నదిలో స్నానం, రామాయణ పారాయణం, కుంకుమార్చన, సత్యనారాయణ వ్రతం కార్యక్రమా లు నిర్వహించనున్నట్లు తెలిపారు. చెన్నైతోపాటు తమిళనాడు వ్యాప్తంగా పెద్ద ఎత్తున జాపకులు తరలివెళుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో శతకోటి గాయత్రీ మహామంత్ర జప మహాపూర్ణాహుతికి సంబంధించి శ్రీగాయత్రీదేవి చిత్రపటాన్ని పోరూర్ శ్రీనివాసరావు ఆవిష్కరించారు.

వేలూరులో రైతుల రాస్తారోకో



రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు

వేలూరు: రైతులు ఎంతో కష్టపడి పండించిన పంట ఉత్పత్తులను విక్రయించేందుకు వ్యవసాయ గిడ్డంగికి తీసుకొస్తే గిడ్డంగిలోని అధికారులు రైతులపై నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ రైతులు గురువారం ఉదయం రాస్తారోకో చేశారు. రైతులు తమ పంట ఉత్పత్తులను విక్రయించేందుకు తీసుకొచ్చి వేలూరు టోల్‌గేట్ వ్దా వ్యవసాయ గిడ్డంగి వద్దకు మూడురోజులుగా ధాన్యం తీసుకువచ్చి వేచిచూస్తున్నారు. అయితే అధికారులు ధాన్యం నిల్వ ఉంచేందుకు స్థలం లేదని బయట పెట్టాలని నిర్లక్ష్యంగా తెలిపినట్లు తెలుస్తుంది. గత వారం రోజులుగా సాయంత్రం వర్షం కురుస్తున్నందున తాము పండించిన పంటలు పూర్తిగా వర్షంలో తడిస్తే ఎలా అని రైతులు అధికారులను నిలదీశారు. ఇందుకు అధికారులు ఎటువంటి సమాధానం చెప్పకపోవడంతోపాటు ఉదయం 10 గంటల వరకు గిడ్డంగి వద్దకు రాలేదు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి రైతులు పంట ఉత్పత్తులను తీసుకొచ్చి ఉదయం 10 గంటల వరకు వేచి ఉన్నారు. గిడ్డంగిని తెరవక పోవడంతో రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ తిరునావకరసు రైతుల వద్దకు చేరుకుని చర్చలు జరిపారు. అధికారులతో చర్చించి వెంటనే వీటిపై చర్యలు తీసుకుంటామని హామి ఇవ్వడంతో రైతులు రాస్తారోకోను విరమించారు. రాస్తారోకోతో వేలూరు–బాగాయం రోడ్డులో ట్రాఫిక్ స్థంభించి పోయింది.

సభ్యత్వ నమోదుకు సమష్టి కృషి

వేలూరు: రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వ నమోదుకు కార్యకర్తలందరూ సమష్టిగా కృషి చేసి, నమోదు విజయవంతం చేయాలని తమిళగ వాయువు ఉరిమిగల్ పార్టీ రాష్ట్ర క్రమ శిక్షణా కమిటీ చైర్మన్ తిరుమావలవన్ అన్నారు. ఆ పార్టీ కార్యకర్తల సమావేశం వేలూరులోని ప్రైవేటు కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించామన్నారు. యువత పట్టణ ప్రాంతాలకే కాకుండా గ్రామీణ ప్రాంతాలను ఎంచుకుని సభ్యత్వ నమోదును ప్రారంభించాలన్నారు. కార్యకర్తలు ఇతర పార్టీలను వీడి మన పార్టీల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యకర్తలు గ్రామీణ ప్రజల సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించగలిగితే యథావిధిగా మన పార్టీలో చే రేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వినోద్‌కుమార్, రీజినల్ కార్యదర్శి కన్నన్, రాష్ట్ర పార్టీ సభ్యులు జంబులింగం, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుధాకర్ పాల్గొన్నారు.

కార్మికుడి హత్య

– యువకుడు అరెస్టు

అన్నానగర్: చెన్నై సమీపంలో బుధవారం రాత్రి మద్యం మత్తులో ఓ కార్మికుడిని బండరాయితో కొట్టి చంపారు. పోలీసులు ఈ కేసులో ఓ యువకుడిని అరెస్టు చేశారు. చెన్నై మెరీనా సీసైడ్ కామరాజర్ రోడ్ రాజధాని కళాశాల వెనుక రైల్వే బోర్డర్ రోడ్ ఉంది. గురువారం ఉదయం ఆ రోడ్డుపై 45 ఏళ్ల వ్యక్తిని రాళ్లతో కొట్టడంతో మృతి చెంది పడి ఉన్నాడు. దీంతో షాక్‌కు గురైన స్థానికులు అన్నా స్క్వేర్ పోలీసులకు సమాచారం అందించారు. అన్నాస్క్వేర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హత్యకు గురైన వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఓమందూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు అన్నాస్క్వేర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

త్వరలో వేతన ఒప్పందంపై చర్చలు

కొరుక్కుపేట: బస్సు కార్మికుల వేతన ఒప్పందంపై చర్చలు త్వరలో ప్రారంభం కానున్నట్లు రవాణా శాఖామంత్రి శివశంకర్ తెలిపారు. తంజావూరు జిల్లా కుంభకోణం మండలం ప్రభుత్వ రవాణా సంస్థలో 15 కొత్త బస్సులు, 8 పునరుద్ధరించిన బస్సుల ప్రారంభోత్సవం గురువారం కొత్త బస్‌స్టేషన్‌లో జరిగింది. కొత్త బస్సులను రవాణా శాఖ మంత్రి శివశంకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ రవాణా సంస్థలకు 7,200 కొత్త బస్సులను కొనుగోలు చేయాలని ఆదేశించారన్నారు. ప్రభుత్వ త్వరితగతిన రవాణా సంస్థకు 200 కొత్త బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించిందని, వచ్చే వారంలో మొదటి 30 బస్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

బందోబస్తు నడుమ ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

తిరువళ్లూరు: మనవాలనగర్–శ్రీపెరంబుదూరు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలను భారీ పోలీసు బందోబస్తు నడుమ తొలగించారు. తిరువళ్లూరు సమీపంలోని మనవాలనగర్ నుంచి శ్రీపెరంబుదూరు వరకు రోడ్డు విస్తరణ పనులు వేగంగా నిర్వహిస్తున్నారు. కాగా కొన్ని ప్రాంతాల్లో అక్రమంగా నిర్మించిన కొన్ని తాత్కాలిక షెడ్లను భారీ పోలీసు బందోబస్తు నడుమ ఆక్రమణలను తొలగించారు. రోడ్డుకు పక్కనే ఉన్న తాత్కాలిక షెడ్‌లతో పాటు దుకాణాలకు ముందు కొందరు వ్యాపారులు ఏర్పాటు చేసిన రేకులను తొలగించారు. కాగా ఆక్రమణల తొలగింపు సమయంలో కొందరు వ్యాపారులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది.

రూ.1.2 కోట్ల బంగారం, సిగరెట్ల స్వాధీనం

–ఐదుగురు ప్రయాణికులపై కేసు

కొరుక్కుపేట: దుబాయ్, షార్జా , శ్రీలంక నుంచి విమానాల్లో చెన్నైకి స్మగ్లింగ్ చేసిన రూ. 1.2 కోట్ల విలువైన బంగారం, ఈ–సిగరెట్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో చెన్నై, రామనాథపురం, మదురైకి చెందిన ఐదుగురు ప్రయాణికులపై కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నారు. చెన్నైకి వివిధ విమానాల్లో పెద్ద ఎత్తున నిషిద్ధ వస్తువులు వస్తున్నట్లు చెన్నై విమానాశ్రయ కస్టమ్స్ అధికారులకు రహస్య సమాచారం అందింది. దీంతో కస్టమ్స్ అధికారులు ప్రత్యేక దళంగా ఏర్పడి కొన్ని రోజులుగా చెన్నై విమానాశ్రయంలో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దుబాయ్ నుంచి చెన్నైకి వచ్చిన ఓ ప్రైవేట్ ప్యాసింజర్ విమానంలోని ప్రయాణికులపై కస్టమ్స్ అధికారులు నిఘా పెట్టి, ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వారి వద్ద ఉన్న వస్తువులను తనిఖీ చేయగా పెద్ద మొత్తంలో వెండి నాణేలు కనిపించాయి. కస్టమ్స్ అధికారులకు అనుమానం వచ్చి నాణేలను పరిశీలించగా అవన్నీ బంగారు నాణేలుగా తేలింది. బంగారానికి వెండి పూత పూసినట్లు వారు గుర్తించారు. ప్రయాణికుల వద్ద ఉన్న బంగారు నాణేల మొత్తం బరువు 781 గ్రాములు కాగా వీటి విలువ రూ.39 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. దీంతో కస్టమ్స్ అధికారులు బంగారు నాణేలను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఇంతలో శ్రీలంక నుంచి ప్రత్యేక ప్యాసింజర్ విమానం చెన్నై చేరుకుంది. ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు సోదాలు చేశారు. అప్పుడు రామనాథపురం ప్రాంతానికి చెందిన ఓ ప్రయాణికుడిపై అనుమానం వచ్చింది. అతడిని ఆపి తనిఖీ చేశారు. ఆయన చేతికి కట్టుకున్న బంగారు కంకణం, వేలికి పెట్టుకున్న ఉంగరం, మెడలో వేసుకున్న బంగారు గొలుసు అన్నీ 24 గ్రాముల స్వచ్ఛమైన బంగారంతో తయారు చేయబడ్డాయి. అనంతరం అతడి నుంచి 497 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని అంతర్జాతీయ విలువ రూ.30 లక్షలుగా అంచనా వేశారు. అలాగే షార్జా నుంచి ఒక ప్రైవేట్ ప్యాసింజర్ విమానం చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. అక్కడ ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు సోదా చేశారు. ఆ సమయంలో మధురైకి చెందిన ఓ ప్రయాణికుడి బ్యాగులో దాచిన 366 గ్రాముల బంగారు ఆభరణాలను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి అంతర్జాతీయ విలువ రూ.21 లక్షలు అని అంచనా వేశారు. కాగా దుబాయ్ నుంచి మరో ప్రైవేట్ విమానం చెన్నై ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు చేరుకుని ప్రయాణికులను చెన్నై విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఆ సమయంలో చెన్నై నుంచి వచ్చిన బృందంలోని వస్తువులను సోదా చేయగా అందులో 1,200 ఈ–సిగరెట్లు ఉండడం గుర్తించారు. కస్టమ్స్ అధికారులు సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి అంతర్జాతీయ విలువ రూ. 30 లక్షలుగా అంచనా వేశారు. ఆ తర్వాత చెన్నై విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు జరిపిన తనిఖీల్లో రూ. 90 లక్షలు విలువైన 1.6 కిలోల బంగారం, రూ.30 లక్షల విలువైన 1200 ఈ–సిగరెట్లు, మొత్తం విలువ రూ.1.2 కోట్లు అని అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి ఐదుగురు ప్రయాణికులపై కేసులు నమోదు చేశారు.

క్లుప్తంగా...

సూపర్ సిక్స్ అమలు షెడ్యూల్ ప్రకటించండి

సీఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర బృందం విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: 2024 ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానాల అమలు చేసేందుకు కాలపరిమితితో కూడిన షెడ్యూల్ ప్రకటించాలని, రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర ముఖ్యనేతల బృందం విజ్ఞప్తి చేసింది. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో సీఎంను గురువారం కలిసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, బాబూరావు, ప్రభాకర్‌రెడ్డి బృందం సీపీఐ(ఎం) రాష్ట్ర బృందం 22 ప్రధాన అంశాలపై వినతిపత్రం సమర్పించింది. వారు మాట్లాడుతూ ప్రధానంగా పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి, ప్రత్యేక హోదా సాధనకు, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కృషి చేయాలని కోరినట్టు తెలిపారు.

'తక్షణమే పంట నష్ట పరిహారం ఇవ్వాలి'

సాక్షి, అమరావతి: భారీ వర్షాల కారణంగా 18 జిల్లాల్లోని పంటలకు అపార నష్టం వాటిల్లిందని, నష్టపోయిన ప్రతీ రైతుకు తక్షణమే పంట నష్టపరిహారం ఇవ్వాలని భారతీయ కిసాన్ మోర్చా ఏపీ శాఖ అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావుకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల ఉభయగోదావరి జిల్లాల్లో లక్ష ఎకరాలకుపైగా పంటలకు తీవ్ర నష్టం వాటి ల్లిందని, ఆక్వా రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారన్నారు.

బీసీ జనగణన చేపట్టండి

అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా బీసీ జనగణన చేపట్టాలని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం కేంద్రాన్ని డిమాండ్ చేసింది. బీసీ జనగణన లేని కారణంగా దేశంలోని బీసీలకు విద్య, ఉద్యోగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని అధ్యక్షుడు లగుడు గోవిందరావు తెలిపారు. కేంద్రం ఈ విషయంలో కాలయాపన మాని తక్షణం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈమేరకు వైఎస్సార్‌సీపీ నుంచి మద్దతు కావాలంటూ ఎంపీ మిథున్ రెడ్డికి గోవిందరావు గురువారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. గోవిందరావు మాట్లాడుతూ.. బీసీల సమస్యల పరిష్కారంపై ఆగస్టు 3న చలో పార్లమెంట్ చేపట్టనున్నట్లు చెప్పారు.

ఉచిత పంటల బీమాకు మంగళం

సాక్షి, అమరావతి: రైతులపై పైసా భారం పడకుండా ఐదేళ్లగా విజయవంతంగా అమలు చేస్తున్న వైఎస్సార్ ఉచిత పంటల బీమాకు చంద్రబాబు ప్రభుత్వం మంగళం పాడింది. ఇకపై పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాల్సి ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు వచ్చే ఏడాది నుంచి నూతన విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. గురువారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు. వైఎస్సార్‌సీపీ పాలనలో బీమా వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని, సకాలంలో ప్రీమియం చెల్లించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గత ప్రభుత్వం రూ.1,287 కోట్ల మేర బీమా కంపెనీలకు చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఈ మొత్తాన్ని ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించాలని ఆర్థిక మంత్రిని కోరినట్లు చెప్పారు. రైతులకు ఏ పథకమైనా వెబ్‌ల్యాండ్ వివరాల ఆధారంగానే అమలు చేస్తామని చెప్పారు. పాడి రైతుల జీవనోపాధి మెరుగుపర్చడం, పాల దిగుబడి పెంచడమే లక్ష్యంగా 'ఊరూరా పశుగ్రాస క్షేత్రాలు' ప్రారంభించాలని ఆదేశించారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

సీఎం చంద్రబాబుకు షర్మిల లేఖ

సాక్షి, అమరావతి: భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె గురువారం సీఎం చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. 'ఈ పరిస్థితిని స్టేట్ ఎమర్జెన్సీగా పరిగణించాలి. నష్టాన్ని అంచనా వేయడానికి బృందాలను నియమించాలి. బాధిత రైతులకు తగిన నష్టపరిహారాన్ని ప్రకటించి పంపిణీ చేయాలి. డ్రెయిన్లు కాలువలను డీసిల్టింగ్ చేయాలి. రైతులకు ధాన్యం బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి' అని షర్మిల కోరారు.

ఆక్వా రంగానికి మరింత ఊతం

- ఎంపెడా చైర్మన్ డీవీ స్వామి

సాక్షి, అమరావతి : కేంద్ర బడ్జెట్‌లో ఇచ్చిన ప్రోత్సాహకాలు, ప్రకటించిన రాయితీలు ఆక్వా రంగం మరింత బలోపేతానికి దోహదపడతాయని సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఎంపెడా) చైర్మన్ డీవీ స్వామి తెలిపారు. దేశంలో ఆక్వాకల్చర్, సముద్ర మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల రంగాలను గణనీయంగా పెంచేందుకు ఉపకరిస్తుందన్నా రు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. రొయ్యల సంతానోత్పత్తి కోసం న్యూక్లియస్ పెంపక కేంద్రాల(ఎన్‌బీసీ) స్థాపనకు చేయూతనిచ్చేందుకు కేంద్రం ముందుకు రావడం శుభపరిణామమన్నారు.


హంద్రీ-నీవాకు నీళ్లిచ్చేదెప్పుడు?



శ్రీశైలంలో కనీస మట్టం 854 అడుగులు దాటిన నీటి నిల్వ

ప్రాజెక్టులోకి 2 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

- జూలై ఆఖరుకు చేరుకున్నా నీటి ఎత్తిపోతను ప్రారంభించని రాష్ట్ర ప్రభుత్వం
- రాయలసీమలో వర్షాభావంతో నోళ్లు తెరుచుకున్న జలాశయాలు, చెరువులు
- తాగు, సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలు, అన్నదాతలు
- మరోవైపు శ్రీశైలంలో 806.3 అడుగుల నుంచే నీటిని తోడేస్తున్న తెలంగాణ
- 2019–24 మధ్య సామర్థ్యం కంటే అధికంగా నీటిని తరలించిన గత ప్రభుత్వం
- నిర్ణీత 40 టీఎంసీలు తరలించాలంటే 120 రోజులు ఎత్తిపోయాలి
- ఆలస్యం చేస్తే తెలంగాణ దెబ్బకు నీరు అందుబాటులో ఉండదంటున్న అధికారులు
- గత ప్రభుత్వ తరహాలోనే 800 అడుగుల నుంచే నీటిని తరలించాలంటున్న రైతులు



సాక్షి, అమరావతి : శ్రీశైలం ప్రాజెక్టు నుంచి తెలంగాణ ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని ప్రాజెక్టులకు నీటిని విడుదల చేస్తున్నా, మన రాష్ట్రంలోని హంద్రీ–నీవా ప్రాజెక్టు గురించి మాత్రం ఏపీ సర్కారు పట్టించుకోవడం లేదు. శ్రీశైలం ప్రాజెక్టులో గురువారం నాటికి నీటి మట్టం కనీస స్థాయికి అంటే 854 అడుగులకు పైగా చేరింది.. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి రెండు లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చి చేరుతోంది.. కృష్ణా బోర్డు అనుమతి తీసుకోకుండానే ఎడమ గట్టు కేంద్రంలో తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి చేస్తూ 31,784 క్యూసెక్కులను ప్రాజెక్టు నుంచి దిగువకు తరలిస్తోంది.. జూన్ 3 నాటికి శ్రీశైలం ప్రాజెక్టులో 806.3 అడుగుల్లో 32.19 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా నీటి తరలింపు ప్రారంభించింది.. కానీ ఇప్పటికీ హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రధాన కాలువలోకి నీటిని ఎత్తిపోయడంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం. నైరుతి రుతు పవనాల ప్రభావం వల్ల రాయలసీమలోని అధిక ప్రాంతాల్లో చెదురుముదురు వర్షాలే కురిశాయి. హంద్రీ–నీవాలో అంతర్భాగమైన జలాశయాలు.. కాలువకు ఇరువైపులా ఉన్న చెరువులు నీళ్లు లేక నోళ్లు తెరుచుకోవడం.. భూగర్భ జల మట్టం తగ్గిపోవడంతో తాగు, సాగునీటికి సీమ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా జూన్ 3 నుంచే తెలంగాణ సర్కార్ నీటిని తరలిస్తున్నప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం హంద్రీ–నీవాకు నీటిని విడుదల చేయక పోవడంపై రైతులు మండిపడుతున్నారు. రాయలసీమపై సీఎం చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో మరోసారి నిరూపితమైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాటి లానే నేడూ

రాష్ట్రంలో 2014–19 మధ్య అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం హంద్రీ–నీవాకు నీటి విడుదలపై మీనమేషాలు లెక్కించింది. నీటి తరలింపును ఆలస్యంగా ప్రారంభించడం వల్ల ఎన్నడూ సామర్థ్యం మేరకు అంటే ఏటా 40 టీఎంసీలు తరలించిన దాఖలాలు లేవు. నీటి తరలింపును ఆలస్యంగా ప్రారంభించడం.. ఆలోగా శ్రీశైలం నీటి మట్టం తగ్గిపోవడం వల్ల ఏటా సగటున 27.46 టీఎంసీలను మాత్రమే అప్పట్లో చంద్రబాబు సర్కార్ ఇవ్వగలిగింది. కానీ.. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక 2019–20, 20–21లో సామర్థ్యం కంటే అధికంగా నీటిని తరలించింది. 2021–22, 22–23లలో రాయలసీమలో భారీ వర్షాలు కురవడం.. చెరువులు నిండిపోవడం.. వరదలతో హంద్రీ–నీవా నీటి అవసరం పెద్దగా లేకపోయింది. 2023–24లో కృష్ణా బేసిన్‌లో తీవ్రమైన వర్షాభావంతో నీటి కొరత ఉన్నప్పటికీ.. హంద్రీ–నీవా ద్వారా 32.49 టీఎంసీలను తరలించి వైఎస్ జగన్ ప్రభుత్వం రాయలసీమ సాగునీటి సమస్య పరిష్కారంపై చిత్తశుద్ధిని చాటుకుంది. కానీ.. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం మాత్రం హంద్రీ–నీవాకు నీటి విడుదలపై మళ్లీ మీనమేషాలు లెక్కిస్తోంది.

ఐదేళ్లూ రాయలసీమ సస్యశ్యామలం

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 120 రోజుల్లో 40 టీఎంసీలను తరలించి ఉమ్మడి కర్నూలు, అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు జిల్లాల్లో 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మంది దాహార్తి తీర్చి.. రాయలసీమను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా రూ.6,850 కోట్లతో 2004లో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకాన్ని ప్రారంభించారు. 2009 నాటికే చాలా వరకు పనులు పూర్తవడంతో 2012–13 నుంచి హంద్రీ–నీవా ద్వారా రాయలసీమకు ప్రభుత్వం నీటిని తరలిస్తోంది. ప్రస్తుత డిజైన్ మేరకు హంద్రీ–నీవా ద్వారా 40 టీఎంసీలు ఎత్తిపోయాలంటే 120 రోజులపాటు రోజుకు 3,850 క్యూసెక్కుల చొప్పున నీటిని ఎత్తిపోయాలి. తెలంగాణ సర్కార్ ఎడమ గట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు నీటిని తరలిస్తూ శ్రీశైలాన్ని ఖాళీ చేస్తుండటంతో 120 రోజులు నీరు నిల్వ ఉండని పరిస్థితి. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక 60 రోజుల్లోనే 40 టీఎంసీలను తరలించేలా హంద్రీ–నీవా సామర్థ్యం పెంచే పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జూన్ రెండో వారం నుంచే 800 అడుగుల నుంచే నీటిని ఎత్తిపోయడం ద్వారా ఏటా సామర్థ్యం కంటే ఎక్కువ నీటిని తరలించి.. రాయలసీమలో చెరువులు, జలాశయాలను నింపారు. ప్రధాన కాలువ కింద, చెరువులు, జలాశయాల ఆయకట్టుతోపాటు భూగర్భ జల మట్టం పెరగడంతో రైతులు బోర్లు, బావుల కింద భారీ ఎత్తున పంటలు సాగు చేసి ప్రయోజనం పొందారు. దాంతో గత ఐదేళ్లు సీమ సస్యశ్యామలమైంది.

'పోలవరం' వ్యయంపై బాబు శ్వేతపత్రం బోగస్

- పార్లమెంట్‌లో కేంద్ర జలశక్తి మంత్రి ప్రకటనతో వాస్తవాలు వెలుగులోకి
- మూడేళ్లలో పోలవరం ప్రాజెక్టుపై రూ.8,044.31 కోట్ల విలువైన పనులు
- ఇందులో రూ.4,227.52 కోట్లు ఇప్పటికే కేంద్రం రీయింబర్స్
- ఇంకా చెల్లించాల్సింది రూ.3,816 కోట్లు

గత మూడేళ్లలో 'పోలవరం' పనులకు ప్రభుత్వ వ్యయం.. (రూ.కోట్లలో)

సంవత్సరం	వ్యయం
2021-22	4,512.53
2022-23	2,577.26
2023-24	954.52
మొత్తం	8,044.31

సాక్షి, అమరావతి : పోలవరం ప్రాజెక్టుపై వైఎస్ జగన్ సర్కారు చేసిన ఖర్చు విషయంలో సీఎం చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రం బోగస్ అని తేలిపోయింది. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ గురువారం పార్లమెంట్ సాక్షిగా ఈ విషయాన్ని పరోక్షంగా చెప్పేశారు. గత మూడేళ్లుగా పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన వ్యయం తెలియజేయాల్సిందిగా టీడీపీ ఎంపీలు కృష్ణదేవరాయలు, హరీష్ బాలయోగి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బదులిచ్చారు. గత మూడేళ్లలో (2020–21, 2022–23, 2023–24) సంవత్సరాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టుపై రూ.8,044.31 కోట్లు వ్యయం చేసినట్లు మంత్రి చెప్పారు. ఇందులో రూ.4,227.52 కోట్లను కేంద్రం రీయింబర్స్ చేసిందని.. రూ.3,816.79 కోట్లు ఇంకా రీయింబర్స్ చేయాల్సి ఉందన్నారు. అయితే, చంద్రబాబునాయుడు గత నెల 28న విడుదల చేసిన శ్వేతపత్రంలో గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.4,167 కోట్లే వ్యయం చేసిందని అవాస్తవాలను వల్లెవేశారు. బాబు అబద్ధాలను పటాపంచలు చేస్తూ టీడీపీ ఎంపీలకు కేంద్రమంత్రి వాస్తవ అంకెలను వివరించారు. కేంద్ర నిధులు మళ్లించినట్లు కూడా చంద్రబాబు తన శ్వేతపత్రం ద్వారా చెప్పగా కేంద్రమంత్రి ఎక్కడా నిధుల మళ్లింపు ఊసెత్తలేదు. ఇక గత మూడేళ్లలో హెడ్‌వర్క్‌తో పాటు కాంక్రీట్ పనులు, కుడికాలువకు లైనింగ్ పనులు, ఎడమ కాలువ ఎర్త్‌వర్క్ లైనింగ్‌తో పాటు స్ట్రక్చర్ పనులు, భూసేకరణ, సహాయ పునరావాసానికి వ్యయం చేసినట్లు కేంద్రమంత్రి స్పష్టంచేశారు.

టీడీఆర్ బాండ్ల స్కామ్‌లో కారుమూరిని 'ఫిక్స్' చేద్దాం

శాసన సభలో మంత్రి, కూటమి సభ్యుల చర్చ



సాక్షి, అమరావతి: ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్ల జారీ వ్యవహారంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఇరికించాలన్న లక్ష్యంతో గురువారం శాసన సభలో పెద్ద చర్చే జరిగింది. టీడీఆర్ బాండ్ల జారీలో భారీ అవకతవకలు జరిగాయని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పడం, ఇందులో కారుమూరిని 'ఫిక్స్' చేయాలని కొందరు సభ్యులు కోరడం, నివేదిక రాగానే అలాగే చేద్దామని మంత్రి చెప్పడం చూస్తే అంతా ఓ ప్రణాళిక ప్రకారం చర్చ జరిగిందని విశ్లేషకులు అంటున్నారు. గురువారం శాసన సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిస్తూ గడిచిన ఐదేళ్లలో 3,301 టీడీఆర్ బాండ్లు జారీ చేశారని చెప్పారు. తణుకు, విశాఖ, గుంటూరు, తిరుపతిలో బాండ్ల జారీలో ఆరోపణలు రావడంతో శాఖాపరంగా, ఏసీబీతో కూడా విచారణ చేయిస్తున్నామన్నారు. తణుకులో 27.96 ఎకరాలకు రూ.63.24 కోట్లకు బాండ్లు జారీ చేయాల్సి ఉండగా, ఏకంగా రూ.754.67 కోట్లకు జారీ చేశారన్నారు. అంటే రూ.691.43 కోట్ల స్కామ్ జరిగిందని, ఇందుకు బాధ్యులైన ముగ్గురు అధికారులను ఇప్పటికే సస్పెండ్ చేసామని మంత్రి వివరించారు. రాబోయే 15 రోజులు బాండ్ల జారీని పూర్తిగా నిలిపివేసినట్లు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యేలు అరిమిల్లి రాధాకృష్ణ, గోరంట్ల బుచ్చెయ్యచౌదరి మాట్లాడుతూ.. సూత్రధారులపై చర్యలు తీసుకోవాలే తప్ప చిన్న చిన్న ఉద్యోగులపై కాదని అన్నారు. తణుకు స్కామ్‌లో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు హస్తముందని, ఆయన్ని ఖచ్చితంగా ఈ కేసులో ఇరికించాల్సిందే (ఫిక్స్)నని డిమాండ్ చేశారు. దీనికి మంత్రి బదులిస్తూ విచారణ నివేదిక రాగానే తప్పకుండా కారుమూరిని ఫిక్స్ చేద్దామని చెప్పారు. తిరుపతి, విశాఖ, గుంటూరులో కూడా అప్పటి ఎమ్మెల్యేలపై కేసులు నమోదు చేద్దామని మంత్రి అన్నారు. రాష్ట్రంలో 3.13 లక్షల టిడ్కో ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనను డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేస్తామని మంత్రి నారాయణ మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

శ్వేతపత్రం కాదు.. మా కేసుల సంగతి చూడండి

- సభలో కూటమి ఎమ్మెల్యేల విజ్ఞప్తి
- శ్వేతపత్రంపై అభిప్రాయాలు చెప్పమంటే కోరికల చిట్టా
- పాత కేసులు కూడా ఎత్తివేయాలని వినతి

సాక్షి, అమరావతి: శాసన సభ సమావేశాల్లో గురువారం విచిత్ర పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో శాంతి భద్రతలపై సీఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. దీనిపై సభ్యులు చర్చించేందుకు స్పీకర్ అవకాశం కల్పించగా.. దొరికిందే ఛాన్సన్నట్లుగా సభ్యులు వారిపై నమోదైన కేసులు ఎత్తేయాలంటూ కోరికల చిట్టా విప్పారు. పాత కేసులు కూడా ఎత్తేయాలని కోరారు. తమ ఒక్కరిపై ఉన్న కేసులంటేనే బాగోదని భావించి, పార్టీ కార్యకర్తల పైన ఉన్న కేసులూ ఎత్తేయాలని చెప్పారు. ఒక సందర్భంలో సభలో కేసులున్న సభ్యులు లేచి నిల్చోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరగా.. దాదాపు 90 శాతం సభ్యులు లేచి నిలబడ్డారు.

దేశానికే ఆదర్శంగా నిలవాలి

శ్వేతపత్రంపై చర్చ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో భవిష్యత్తు ప్రణాళికపై విస్తృతమైన చర్చ జరగాలని చెప్పారు. ఐదు కోట్ల మంది ప్రజలకు భద్రత కల్పించేలా ఉండాలన్నారు. దేశంలోనే ఏపీ శాంతి భద్రతల్లో తలమానికంగా నిలవాలని చెప్పారు. గత ప్రభుత్వంలో చాలా మంది ఎమ్మెల్యేలు వారికి వ్యతిరేకంగా మాట్లాడిన వారు, మెసేజ్‌లు పెట్టిన వారిని రౌడీలతో కొట్టించి, తిరిగి ఎదురు కేసులు పెట్టారని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు అన్నారు. అటువంటి వారిపై రౌడీ షీట్లు పెట్టాలని, జిల్లా బహిష్కరణ చేయాలని అన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలని చెప్పారు. ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో తనపై జరిగిన కస్టోడియల్ టార్చర్‌పై విచారణ కోరినా స్పందించలేదన్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారిన తర్వాత కేసు రిజిస్టర్ చేసినా విచారణ మాత్రం చేపట్టలేదని అన్నారు. బాధ్యులైన ప్రధాన అధికారులపై హత్యాయత్నం కేసు ఉన్నప్పటికీ, వారిని సస్పెండ్ చేయలేదన్నారు. టీడీపీ కార్యకర్తలు, ఉద్యోగులు, టీచర్లపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరారు. తన నియోజకవర్గంలో పోలీసుల దాష్టీకానికి 7 మంది అమాయకులు బలైపోయారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చెప్పారు.

ప్రభుత్వ స్కూళ్లలో 22,776 పోస్టులు ఖాళీ

- శాసన సభలో మంత్రి లోకేశ్ వెల్లడి

సాక్షి, అమరావతి : ప్రభుత్వ పాఠశాలల్లో 22,776, ఎయిడెడ్ పాఠశాలల్లో 4,557 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు భర్తీ చేస్తున్నామని, ప్రమోషన్ల ద్వారా 6,429 ఖాళీలు భర్తీ చేస్తామని మంత్రి లోకేశ్ శాసన సభలో చెప్పారు. గురువారం సభలో పలువురు సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానం చెబుతూ..ప్రత్యేక అవసరాల బాలలు చదివే పాఠశాలల్లో 1:10 నిష్పత్తిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉండేలా కృషి చేస్తామన్నారు. 2018 నోటిఫికేషన్‌లో స్పెషల్ టీచర్ పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆరోపించారు. రాష్ట్రంలో బ్లేడ్ బ్యాచ్, అసాంఘిక శక్తులను నియంత్రించడానికి ప్రణాళిక రూపొందించామని, ప్రత్యేకమైన టాస్క్‌ఫోర్స్ వేశామని మంత్రి అనిత చెప్పారు. గత ప్రభుత్వం రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలన్నీ పునరుద్ధరిస్తామని మంత్రి డీబీవీ స్వామి ప్రకటించారు.

ఈ-వ్యర్థాల ఉత్పత్తిలో 12వ స్థానంలో ఏపీ

- ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



సాక్షి, అమరావతి: ఈ–వ్యర్థాల ఉత్పత్తిలో దేశంలోనే ఏపీ 12వ స్థానంలో ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ప్రతీ జిల్లా కేంద్రంలో ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ–వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు అవకాశాలను పరిశీలిస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 6 ఈ–వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్స్ ఉన్నాయన్నారు. కాగా, వైఎస్సార్‌సీపీ హయాంలో బీచ్ శాండ్, మంగంపేట బైరటీస్‌తో పాటు వివిధ గనుల్లో జరిగిన అక్రమ తవ్వకాలు, అమ్మకాలపై విచారణ చేయనున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటించారు.

త్వరలో బకాయిల చెల్లింపులు

రైతుల నుంచి సేకరించిన ధాన్యంకు చెల్లించాల్సిన రూ.674 కోట్ల బకాయిలను త్వరలోనే చెల్లించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రంలో నిత్యావసరాల నాణ్యత, తూకంలో తేడాలు చేస్తోన్న 19 కంపెనీలపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

జగన్ హయాంలో 17 మెడికల్ కాలేజీలు

రాష్ట్రంలో 3 దశల్లో 17 మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని గత ప్రభుత్వం చేపట్టినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఇందులో ఇప్పటికే 5 కళాశాలలు అందుబాటులోకి రాగా, మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మెడికల్ కాలేజీల్లో ఉద్యోగుల నియామకాలపై విచారణ జరపనున్నట్లు తెలిపారు. పులివెందుల గృహనిర్మాణ ప్రాజెక్ట్‌లో 8,500 మంది అనర్హులు ఉన్నట్లు గుర్తించామని, దీనిపై కడప జిల్లా కలెక్టర్ విచారణ చేస్తున్నట్లు మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు.

నిమ్స్ తరహా ఏమైనా ఏర్పాటు చేస్తారా?

ఉమ్మడి ఏపీలో నిమ్స్ ఒక స్టేటస్‌గా ఉందని, విభజిత ఏపీలో నిమ్స్ తరహా ఏర్పాటు ఏమైనా ఉందా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించినట్లు పీడీఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు చెప్పారు. దీనికి సంబంధిత మంత్రి సమాధానం చెప్పలేదని పేర్కొన్నారు. లా అండ్ ఆర్డర్, గంజాయిపై మండలిలో శ్వేతపత్రాన్ని ప్రభుత్వం ప్రకటించిందని, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి ఆందోళన చేస్తోన్న వారిపై నిర్బంధం అనే అంశాన్ని శ్వేతపత్రంలో ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించినట్లు వెల్లడించారు. దీనిపైనా హోం మంత్రి బదులివ్వలేదని ఆయన చెప్పారు.

కొత్త డయా ఫ్రమ్ వాల్

సమాంతరంగా నిర్మించాలన్న నిపుణుల ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం



సాక్షి, అమరావతి : పోలవరం ప్రాజెక్టు ప్రధాన (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ గ్యాప్–2లో దెబ్బతిన్న డయా ఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా కొత్తగా డయా ఫ్రమ్ వాల్ నిర్మించాలని అంతర్జాతీయ నిపుణుల కమిటీ చేసిన ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. కొత్త డయా ఫ్రమ్ వాల్‌ను నిర్మించాలని కేంద్ర జల్ శక్తి శాఖను కోరుతూ తీర్మానం చేసింది. విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయడానికి సంపూర్ణ సహకారం ఇస్తామని బడ్జెట్ ప్రసంగంలో హామీ ఇచ్చినందుకు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపింది. ప్రాజెక్టును పూర్తి చేయడానికి అవసరమైన నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదించింది. వీటిని కేంద్ర జల్ శక్తి శాఖకు పంపాలని నిర్ణయించింది. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడిలోని సచివాలయంలో మంత్రివర్గం సమావేశమైంది. పోలవరం ప్రాజెక్టు పనులను జూన్ 30 నుంచి జూలై 3 వరకు అంతర్జాతీయ నిపుణుల కమిటీ క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్ వోరా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గోదావరి వరదల ఉధృతికి గ్యాప్–2లో డయా ఫ్రమ్ వాల్ దెబ్బతిందని, దానికి మరమ్మతులు చేసినా పూర్తి సామర్థ్యం మేరకు పని చేస్తుందని చెప్పలేమని తేల్చి చెప్పారు. ప్రాజెక్టు భద్రత దృష్ట్యా దెబ్బ తిన్న డయా ఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా కొత్తగా డయా ఫ్రమ్ వాల్ నిర్మించాలని సూచించారు. ఈ నేపథ్యంలో సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం అంతర్జాతీయ నిపుణుల కమిటీ చేసిన సూచనకు ఆమోదం తెలిపింది.

2023 జూన్ 5నే నిధులు మంజూరు

- కేంద్రమే కట్టాల్సిన పోలవరం నిర్మాణ బాధ్యతలను కమీషన్ల కక్కుర్తితో దక్కించుకున్న సీఎం చంద్రబాబు.. ప్రాజెక్టు కన్‌స్ట్రక్షన్ ప్రోటోకాల్‌ను తుంగలో తొక్కి.. గోదావరి వరదను మళ్లించేలా స్పిల్ వేను పూర్తి చేయకుండానే ప్రధాన డ్యామ్ గ్యాప్–2లో పునాది డయా ఫ్రమ్ వాల్‌ను పూర్తి చేసి చారిత్రక తప్పిదం చేశారు.
- 2019, 2020లలో గోదావరికి వచ్చిన భారీ వరదలు.. ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉధృతితో ప్రవహించడంతో డయా ఫ్రమ్ వాల్ కోతకు గురై దెబ్బతింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై గరిష్ఠంగా 36 మీటర్లు.. కనిష్ఠంగా 26 మీటర్ల లోతుతో భారీ అగాధాలు ఏర్పడ్డాయి.
- వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక.. ప్రాజెక్టు కన్‌స్ట్రక్షన్ ప్రోటోకాల్ ప్రకారం స్పిల్ వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి 2021 జూన్ 11నే గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా 6.1 కి.మీల పొడవున మళ్లించారు. ఆ తర్వాత దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేశారు. కోతకు గురై దెబ్బ తిన్న డయా ఫ్రమ్ వాల్ భవితవ్యాన్ని తేల్చితే ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేస్తామని వైఎస్ జగన్ చేసిన ప్రతిపాదన మేరకు.. 2022 మార్చి 4న అప్పటి కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు.
- చంద్రబాబు చారిత్రక తప్పిదం వల్ల దెబ్బ తిన్న డయా ఫ్రమ్ వాల్ పునరుద్ధరణ, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతాన్ని యథాస్థితికి తెచ్చే పనులకు అయ్యే వ్యయాన్ని కేంద్రమే భరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో దెబ్బ తిన్న డయా ఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా కొత్తగా డయా ఫ్రమ్ వాల్ నిర్మించాలని అప్పట్లోనే ప్రతిపాదించారు.
- వాటిని పరిగణనలోకి తీసుకుని.. రెండు దశల్లో పోలవరాన్ని పూర్తి చేయాలని నిర్ణయించిన కేంద్రం.. వైఎస్ జగన్ జగన్ విజ్ఞప్తి మేరకు తొలి దశ పూర్తి చేయడానికి రూ.10,911.15 కోట్లు, డయా ఫ్రమ్ వాల్ పునరుద్ధరణ, మరమ్మతులకు రూ.2 వేల కోట్లు వెరసి రూ.12,911.15 కోట్లు ఇచ్చేందుకు అంగీకరిస్తూ 2023 జూన్ 5న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నోట్ జారీ చేశారు.

నాడు వద్దంటూ.. నేడు నిధుల విడుదలకు ప్రతిపాదన

- ✓ గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి మేరకు పోలవరం ప్రాజెక్టు తొలి దశ పూర్తికి అవసరమైనన్ని నిధులు విడుదల చేయాలని కేంద్ర జల్ శక్తి శాఖను ప్రధాని నరేంద్ర మోదీ అప్పట్లో ఆదేశించారు. కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ అధికారులు పలుమార్లు రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులతో సమావేశమై.. కొత్త డయా ఫ్రమ్ వాల్ నిర్మాణంతోపాటు తొలి దశ పూర్తికి రూ.12,157.52 కోట్లు విడుదల చేయాలని కేంద్ర జల్ శక్తి శాఖకు ప్రతిపాదించారు.
- ✓ ఆ నిధులు విడుదల చేయాలంటే కేంద్ర కేబినెట్ ఆమోదం తప్పనిసరి. ఎందుకంటే.. 2016 సెప్టెంబర్ 6న పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకునే క్రమంలో 2013-14 ధరలతోనే ప్రాజెక్టును పూర్తి చేస్తానని చంద్రబాబు కేంద్రంతో ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం 2014 ఏప్రిల్ 1 నాటికి నీటి పారుదల విభాగంలో మిగిలిన పనులకు అయ్యే వ్యయం అంటే రూ.15,667.90 కోట్లు ఇవ్వాలని 2017 మార్చి 15న కేంద్ర కేబినెట్ నిర్ణయించింది.
- ✓ ఇప్పటికే పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.15,146.28 కోట్లు విడుదల చేసింది. దీనికితోడు రూ.12,157.52 కోట్లు విడుదల చేయాలంటే 2017 మార్చి 15న తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర కేబినెట్ మారుస్తూ తీర్మానం చేయాలి. ఆ మేరకు తీర్మానం చేసి.. నిధులు మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర జల్ శక్తి శాఖ ఈ ఏడాది మార్చి 6న కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదన పంపింది.
- ✓ అయితే అప్పటికే ఎన్డీఏలో చేరిన టీడీపీ అధినేత చంద్రబాబు.. ఆ నిధులు ఇస్తే రాజకీయంగా తమకు ఇబ్బందులు వస్తాయని కేంద్ర ప్రభుత్వ పెద్దల చెవిలో ఊదారు. దాంతో అప్పట్లో ఆ ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ పక్కన పెట్టింది. ఇప్పుడు మళ్లీ ఆ ప్రతిపాదనపై ఆమోద ముద్ర వేసి.. నిధులు విడుదల చేయాలని రాష్ట్ర మంత్రివర్గంతో సీఎం చంద్రబాబు తీర్మానం చేయించడం గమనార్హం.

పాలక్... పన్నీరు

మనసున్న పాట

పాలక్ ముచ్చల్ అనే పేరు వినిపించగానే తీయటి పాట ఒకటి గుర్తొస్తుంది సింగర్‌గా మంచి పేరు తెచ్చుకున్న పాలక్ సామాజిక సేవలోనూ తన వంతుగా కృషి చేస్తోంది. ఫండింగ్ ద్వారా ఇప్పటి వరకు మూడు వేల మంది పేద పిల్లలకు గుండె ఆపరేషన్‌లు చేయించింది.



బాలీవుడ్ సినిమా 'ఎంఎస్ దోని–ది అన్ టోల్డ్ స్టోరీ'లోని 'కౌన్ తుఝే' పాటతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది పాలక్. ఇండోర్‌కు చెందిన పాలక్‌కు కాలేజీ రోజుల నుంచి పాటతో పాటు సేవా బాటలో పయనించడం అంటే కూడా ఇష్టం.

పాలక్ తొలి ఫండ్ రైజింగ్ ప్రాజెక్ట్ కార్గిల్ వీర సైనికుల కోసం చేసింది. ప్రతి షాప్ ముందుకు వెళ్లి దేశభక్తి గీతాలు పాడి 'కార్గిల్ వీర సైనికులకు మీ వంతుగా సహాయం చేయండి' అని అడిగేది.

కళ, సామాజిక సేవను పాలక్ వేరు చేసి చూడదు. మూడు వేల మంది పేద పిల్లలకు గుండె ఆపరేషన్‌లు చేయించడానికి తనలోని కళ బలమైన మాధ్యమంగా ఉపయోగపడుతుందని చెబుతుంది పాలక్.

సినిమాల్లో అవకాశాలు దొరకని రోజుల్లో కూడా ఎన్నో ప్రోగ్రామ్స్ చేసి పేద పిల్లల కోసం విరాళాలు సేకరించేది.

పాలక్ ఒక మ్యూజిక్ ప్రోగ్రామ్ చేసిందంటే పది మంది పేద పిల్లల వైద్యానికి అవసరమైన డబ్బును సేకరించినట్లే. బాలీవుడ్‌లో సింగర్‌గా పాలక్‌కు మంచి పేరు రావడమే కాదు ఆ పేరు విరాళాల సేకరణకు బాగా ఉపయోగపడింది.

'మీ పాట అద్భుతం' అనే ప్రశంస కంటే, పేదింటి తల్లిదండ్రుల గొంతు నుంచి వినిపించే...

'మీ వల్ల మా బిడ్డ బతికింది' అనే మాట పాలక్‌కు ఎక్కువ సంతృప్తి ఇస్తుంది. ఇప్పుడు పాలక్ వెయిటింగ్ లిస్ట్‌లో 413 మంది పిల్లలు ఉన్నారు. వారికి హార్ట్ సర్జరీలు చేయించాల్సిన బాధ్యతను భుజాలకెత్తుకుంది.

'మనస్ఫూర్తిగా కోరుకుంటే అంతా మంచే జరుగుతుంది. పేదపిల్లలకు అండగా నిలవడానికి ఇది దేవుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తాను' అంటుంది పాలక్ ముచ్చల్.

ఫ్యాషన్





గ్రామీణ మహిళా కళాకారులను ప్రోత్సహించడానికి, వారి వారసత్వ కళను, ఫ్యాబ్రిక్ క్రాఫ్ట్‌ను భారతదేశం అంతటా పరిచయం చేయడానికి ది వోవెన్ ల్యాబ్ పేరుతో కృషి చేస్తున్నారు భూపాల్ వాసి నిఖితా కౌశిక్. ముంబైలోని నిఫ్ట్ పూర్వవిద్యార్థి అయిన నిఖిత జీరోవేస్ట్ పాలసీతో పాతికమంది గ్రామీణ మహిళల చేత పట్టణ మహిళల కోసం ఆధునికంగా డ్రెస్‌లను డిజైన్ చేయించి, వారికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'స్టైల్ తత్త్వ' ఎగ్జిబిషన్‌లో క్రాఫ్ట్స్, హ్యాండ్లూమ్ క్లస్టర్స్‌కి వారధిగా ఉంటూ చేస్తున్న కృషిని వివరించారు.

సిటీకి పల్లె కళ

''ఈ రోజు మనం భారతీయులమని చెప్పుకోవడానికి గర్విస్తున్నామంటే మన దేశంలోని విభిన్న సంస్కృతులూ, సంప్రదాయాలూ కారణం. వేటికవి సొంత మార్గాలలో ప్రత్యేకమైనవి. ఫలితంగా మన జీవితంలో దుస్తులు ముఖ్యమైన అంశంగా మారాయి. మన గ్రామీణ మహిళా కళాకారుల హస్తకళ శిల్ప నైపుణ్యాన్ని చేతితో నేసిన వస్త్రాలను మరింత మెరుగుపరచడంలో మా పని కీలకంగా ఉంటుంది. చిట్ట చివరగా ఉపయోగించే చిన్న ఫ్యాబ్రిక్ పీస్‌తో కూడా 'కళ'ద్వారా అందంగా డిజైన్ చేస్తాం. ఇందుకోసం నిరంతరం పరిశోధన జరుగుతూనే ఉంటుంది. అందుకే, మా బ్రాండ్‌కు 'ది వోవెన్ ల్యాబ్' అని పేరు పెట్టాం.



నిఖితా కౌశిక్

జీరో వేస్ట్ పాలసీ

రాజస్థాన్, గుజరాత్ భోపాల్.. ప్రాంతాల్లోని గ్రామీణ, గిరిజన మహిళల చేతుల్లో రూపుదిద్దుకున్న మా దుస్తుల డిజైన్స్ బయట షాపుల్లో లభించవు. ఎగ్జిబిషన్లు, ఆన్‌లైన్ ద్వారా అమ్మకం చేస్తుంటాం. మన దేశీ కాలా పత్తితో పాటు టెన్సెల్, రీసైకిల్ ఫ్యాబ్రిక్స్, పర్యావరణ అనుకూలమైన క్లాత్‌తోనే డిజైన్ చేస్తున్నాం. అరుదైన కాటన్ ఫ్యాబ్రిక్, ప్రాచీన కళా వైభవం గల మోడర్న్ డిజైనరీ డ్రెస్సులు కాబట్టే వీటి ఖర్చు ఎక్కువే. కానీ, ఎక్కడ ఉన్నా ప్రత్యేకతను చాటుతుంటాయి.

మహిళా సాధికారత

మా సంస్థకు ఉన్న బలమైన స్తంభాలలో ఒకటి మహిళా సాధికారత. ఇప్పటికి పాతిక మంది గ్రామీణ మహిళలు ఈ డిజైన్స్ కోసం కృషి చేస్తున్నారు. కళ పట్ల ఆసక్తి ఉన్న గ్రామీణ బాలికలను ఎంపిక చేసుకొని, శిక్షణ ఇవ్వడమే కాకుండా, వారి ప్రాథమిక విద్య కూడా సవ్యంగా జరిగేలా చూస్తున్నాం. ఒక డ్రెస్ కొనుగోలు చేస్తే ఆ మొత్తంతో ఆ కళాకారుల ఇల్లు నెలంతా ఏ ఇబ్బంది లేకుండా గడిచిపోతుంది. భవిష్యత్తు తరాలు ఆ కళావైభవాన్ని సొంతం చేసుకోవాలన్నదే నా కల. చాలావరకు సేకరించే కాటన్ ఫ్యాబ్రిక్ ఐవరీ, గ్రే కలర్ వే ఎంచుకుంటాం. కొన్నింటికి మాత్రం నేచురల్ రంగులతో డైయింగ్ ప్రక్రియ ఉంటుంది. వ్యర్థాలను నివారిస్తూ, పర్యావరణ అనుకూలమైన ఉత్పత్తులను వెలుగులోకి తీసుకురావాలన్నదే మా ప్రయత్నం తప్ప ఫాస్ట్ ఫ్యాషన్ పోటీ పరుగులో చేరం.

రాబోయే తరాలకు మన కళ

ప్రాచీన హ్యాండ్ వర్క్స్‌ని వదిలేస్తే అవి అంతే సులువుగా మరుగున పడిపోతాయి. క్రాఫ్ట్స్ క్లస్టర్స్ ఆఫ్ ఇండియాతో అనుబంధంగా వర్క్ చేస్తున్నాను కాబట్టి దేశంలోని హ్యాండ్లూమ్ క్లస్టర్స్‌తోనూ, ఈ మార్గంలో వచ్చే అంతరాలను పూడ్చేందుకు నిఫ్ట్‌లోని వివిధ కేంద్రాలతో అనుబంధంగా వర్క్ చేస్తున్నాను.

ఫ్యాబ్రిక్ సేకరణ, డిజైన్స్ సృష్టి, వ్యర్థాలు మిగలకుండా జాగ్రత్తపడటం అనేది ఓ సవాల్‌గా ఉంటుంది. కానీ, పర్యావరణ హితంగా, మనసుకు నచ్చిన పని చేస్తుండటం ఎప్పుడూ ఉత్సాహాన్ని ఇస్తుంది. అంతేకాదు, ఈ డిజైన్స్‌ని ఇష్టపడి కొనుగోలు చేసేవారి ద్వారా ప్రాణం పెట్టే కళాకారులకు ఉపాధి పొందేలా చేయడం మరింత సంతృప్తిని ఇస్తుంది'' అని వివరించారు ఈ డిజైనర్.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వంటిల్లు

ఇది పకోడీ కాలం

ఇది వర్షాకాలం. వాన చినుకులు పడుతుంటే... వేడి వేడి పకోడీలు తింటూ గరం గరం చాయ్ తాగుతూ ఉంటే ఎలా ఉంటుంది? ఏడాదంతా వర్షాకాలమే ఉంటే బావుణ్ననిపిస్తుంది. ఇది వర్షాకాలం కాదు పకోడీల కాలం అనాలనిపిస్తుంది.



పోహా పకోడీ

కావలసినవి: అటుకులు– ఒకటిన్నర కప్పులు; బంగాళాదుంప– అర కప్పు (ఉడికించి చిదిమినది); కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; పచ్చిమిర్చి తరుగు– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; చక్కెర – అర టీ స్పూన్; నిమ్మరసం – అర టీ స్పూన్; జీలకర్ర– అర టీ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె– వేయించడానికి తగినంత.

తయారీ: ● అటుకులను ఒక పాత్రలో వేసి (అటుకులు తేలేటట్లు) నిండుగా నీటిని పోసి కడిగి వడపోత గిన్నెలో వేయాలి ● నీరంతా కారిపోయిన తర్వాత తీసి వెడల్పు పాత్రలో వేసుకోవాలి. అందులో ఉడికించి చిదిమిన బంగాళాదుంప, కొత్తిమీర, పచ్చిమిర్చి, మిరప్పొడి, చక్కెర, జీలకర్ర, నిమ్మరసం, ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం అంతటినీ చిన్న నిమ్మకాయంత గోళీలుగా చేసుకోవాలి ● బాణలిలో నూనె వేడి చేసి, మరుగుతున్న నూనెలోఒక్కో గోళీని మెల్లగా వేయాలి. మంటను మీడియంలో పెట్టి దోరగా వేగనివ్వాలి. అన్నివైపులా ఎర్రగా వేగిన తర్వాత చిల్లుల గరిటతో తీసి టిష్యూ పేపర్ మీద వేస్తే పోహ పకోడీ రెడీ. వీటికి పుదీన చట్నీ లేదా టొమాటో కెచప్ మంచి కాంబినేషన్.

కార్న్ పకోడీ



కావలసినవి: స్వీట్ కార్న్ గింజలు– 2 కప్పులు; అల్లం వెల్లుల్లి పేస్ట్ – 2 టీ స్పూన్‌లు; జీలకర్ర– అర టీ స్పూన్; శనగపిండి– 3 టేబుల్ స్పూన్‌లు; బియ్యప్పిండి– 3 టేబుల్ స్పూన్‌లు; గరం మసాలా – అర టీ స్పూన్; ఉల్లిపాయ – ఒకటి (తరగాలి); పచ్చిమిర్చి – 2 (తరగాలి); కరివేపాకు – 2 రెమ్మలు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పసుపు – పావు టీ స్పూన్; మిరప్పొడి– అర టీ స్పూన్; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● మొక్కజొన్న గింజలను కడిగి చిల్లుల పాత్రలో వేసి నీరు పోయే వరకు ఉంచాలి ● ఈ లోపు ఒక పాత్రలో నూనె మినహా పైన తీసుకున్న వన్నీ వేసి కలపాలి ● మొక్కజొన్న గింజల్లో గుప్పెడు గింజలను తీసి పక్కన పెట్టి మిగిలిన గింజలను మిక్సీలో కచ్చపచ్చాగా గ్రైండ్ చేయాలి. ఇప్పుడు పక్కన పెట్టిన గింజలను కూడా శనగపిండి మిశ్రమంలో వేసి కలపాలి ● బాణలిలో నూనె మరిగించి పకోడీ మిశ్రమాన్ని చేతిలోకి తీసుకుని వేళ్లతో కొద్దికొద్దిగా నూనెలో వేయాలి. దోరగా వేగిన తర్వాత తీసి టిష్యూ పేపర్ మీద వేస్తే వేడి వేడి కార్న్ పకోడీలు తినడానికి రెడీ. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి.

సినిమా

మహేశ్‌బాబు గోల్డ్?



హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లోని సినిమా అంతర్జాతీయ స్థాయిలో రూపొందనున్న సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమా ప్రతి అప్‌డేట్ ప్రపంచవ్యాప్త సినీ ప్రేమికులకు ఆసక్తికరంగా అనిపిస్తోంది. తాజాగా ఈ సినిమాకు 'గోల్డ్' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో బలంగా వినిపిస్తోంది. గతంలో 'మహారాజా', 'మహారాజ్' వంటి పేర్లు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. లేటెస్ట్‌గా 'గోల్డ్' టైటిల్ వినిపిస్తోంది. ఆఫ్రికన్ ఫారెస్ట్ అడ్వెంచరస్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమా ప్రధాన కథాంశం ఓ నిధి వేట అనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇప్పుడు ఈ సినిమాకు 'గోల్డ్' అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నారనే వార్త రావడంతో నిధి నేపథ్యం కాబట్టి ఈ టైటిల్‌నే ఖరారు చేస్తారనే చర్చ జరుగుతోంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌ను రచయిత విజయేంద్ర ప్రసాద్ పూర్తి చేశారని, హైదరాబాద్‌లో సెట్ వర్క్ జరుగుతోందని, జర్మనీలో కొంత చిత్రీకరణను ప్లాన్ చేశారని తెలుస్తోంది. షూటింగ్‌ను ఈ ఏడాదిలోనే ప్రారంభించాలనుకుంటున్నారు మేకర్స్.

పాఠాలు నేర్పినవారందరికీ ధన్యవాదాలు



● శ్రుతీహాసన్

హీరోయిన్‌గా పదిహేనేళ్ల విజయవంతమైన కెరీర్‌ని పూర్తి చేసుకుంటూ, ఇంకా అగ్ర శ్రేణి హీరోయిన్ల జాబితాలో ఒకరిగా రాణిస్తుండటం అంటే అంత సులభమైన విషయం కాదు. ఈ లిస్ట్‌లో చాలా తక్కువమంది హీరోయిన్లు ఉంటారు. తాజాగా శ్రుతీహాసన్ పేరు ఈ లిస్ట్‌లో చేరింది. తండ్రి కమల్‌హాసన్ నటించిన ద్విభాషా (తమిళం, హిందీ) చిత్రం 'హే రామ్' (2000)లో చైల్డ్ ఆర్టిస్టుగా తొలిసారి స్క్రీన్‌పై కనిపించారు శ్రుతీహాసన్. చైల్డ్ ఆర్టిస్టుగా మరో సినిమా చేయలేదు కానీ.. 'హే రామ్' రిలీజైన తొమ్మిదేళ్లకు హిందీ చిత్రం 'లక్' (2009)తో కథానాయికగా కెరీర్‌ను ఆరంభించారు శ్రుతి. ఆ తర్వాత సూర్య 'సెవెన్త్ సెన్స్', ధనుష్ 'త్రీ', రామ్ చరణ్ 'ఎవడు', అల్లు అర్జున్ 'రేసుగుర్రం' రవితేజ 'క్రాక్' .. ఇటీవల చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', ప్రభాస్ 'సలార్: సీజ్‌ఫైర్' వంటి చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించారు శ్రుతి. నటిగా–గాయనిగా–సంగీత దర్శకురాలిగా... ఇలా మల్టీ టాలెంట్‌తో దూసుకెళుతున్నారు శ్రుతీహాసన్. కథానాయికగా పదిహేనేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రుతీహాసన్ స్పందిస్తూ – ''అప్పుడే పదిహేనేళ్లు పూర్తయ్యాయంటే నమ్మశక్యంగా లేదు. నేను పెరిగిన మ్యాజికల్ ఇండస్ట్రీలోనే ఇంతకాలం నేను ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది. నా మిగతా జీవితాన్ని కూడా ఇండస్ట్రీతోనే ముడివేస్తాను. ఇండస్ట్రీలో నాకు అందమైన పాఠాలు నేర్పినవారందరికీ ధన్యవాదాలు. అలాగే నన్ను ఆదరించిన ప్రేక్షకులు, నా అభిమానులకు థ్యాంక్స్. వీళ్లే లేకపోతే నేను ఇలా ఉండేదాన్ని కాదు'' అన్నారు. రజనీకాంత్ 'కూలీ', ప్రభాస్ 'సలార్: శౌర్యంగాపర్వం', అడవి శేష్ 'డెకాయిట్' చిత్రాల్లో నటిస్తున్నారు శ్రుతీహాసన్.

తనికెళ్ల భరణికి డాక్టరేట్



ప్రముఖ నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణికి వరంగల్ ఎస్ఆర్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. తనికెళ్ల భరణి దాదాపు 800లకు పైగా సినిమాల్లో నటించి ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 52 సినిమాలకు మాటలు అందించారాయన. 'సముద్రం' సినిమాకి ఉత్తమ విలన్‌గా, 'నువ్వు నేను' చిత్రానికి ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్టుగా, 'గ్రహణం' చిత్రంతో ఉత్తమ నటునిగా, 'మిథునం' సినిమాకిగాను ఉత్తమ రచయిత–ఉత్తమ దర్శకునిగా నంది అవార్డులు అందుకున్నారాయన. ఇక ఆగస్టు 3న వరంగల్‌లో జరిగే యూనివర్సిటీ స్నాతకోత్సవంలో తనికెళ్ల భరణికి డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు.

మళ్లీ తల్లి కాబోతున్నాను



● ప్రణీత


'ఏం పిల్లో ఏం పిల్లడో', 'బావ', 'పాండవులు పాండవులు తుమ్మెద, రభస, బ్రహ్మోత్సవం' వంటి సినిమాల్లో నటించిన ప్రణీత తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. ఇక వ్యక్తిగత విషయానికి వస్తే... 2021 మే 30న వ్యాపారవేత్త నితిన్ రాజుతో ప్రణీత వివాహం జరిగింది. 2022 జూన్‌లో ప్రణీత ఓ పాపకు జన్మనిచ్చారు. కొన్ని నెలలు సినిమాలకు విరామం తీసుకున్నాక ఆమె కన్నడలో చేసిన ఒక సినిమా, మలయాళంలో చేసిన ఒక సినిమా ఈ ఏడాది విడుదలయ్యాయి. కాగా తాను రెండోసారి తల్లి కాబోతున్నట్లు పేర్కొన్నారు. 'రౌండ్ 2.. ఇప్పటి వరకూ నేను వాడిన పాంట్స్ ఇక నాకు ఫిట్ కావు'' అంటూ బేబీ బంప్ ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు ప్రణీత.

హారర్... థ్రిల్



● ప్రియా భవానీ శంకర్

అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన తమిళ చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వం వహించారు. విజయ సుబ్రహ్మణ్యన్, ఆర్.సి.రాజ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టులో విడుదల కానుంది. రాజ్ వర్మ ఎంటర్‌టైన్‌మెంట్– శ్రీ బాలాజీ ఫిలింస్ తెలుగులో విడుదల చేస్తున్నాయి. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు రామ్ గోపాల్ వర్మ రిలీజ్ చేసి, 'ట్రైలర్ ఆసక్తిగా ఉంది. సినిమా హిట్టవ్వాలి' అన్నారు. కాగా అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వంలో వచ్చిన 'డీమాంటీ కాలనీ'కి సీక్వెల్‌గా 'డీమాంటీ కాలనీ 2' రూపొందింది. ''హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ఇది. డీమాంటీ ఇంట్లో అనూహ్యమైన ఘటనలు జరుగుతుంటాయి. ఆ ఇంట్లో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు వెళ్లిన వారు చనిపోతుంటారు. ఇంతకీ ఆ ఇంట్లో ఉన్న ఆ శక్తి ఏంటి? చివరగా వెళ్లినవారు ఎలా ప్రాణాలు కాపాడుకున్నారు?' అనేది 'డీమాంటీ కాలనీ 2'లో ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు మేకర్స్.



● రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా

తెగబడవేమీ...

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా ఏఎస్ రవి కుమార్ చౌదరి దర్శకత్వం వహించిన చిత్రం 'తిరగబడరసామీ'. మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న రిలీజ్ కానుంది. తాజాగా ఈ చిత్రం టైటిల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. 'కత్తులు దిగనీ నెత్తురుతోని తడపర భూమి తెగబడవేమీ...' అంటూ సాగే ఈ పాటకి జేబీ సంగీతం అందించారు. సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించిన ఈ పాటని సాయి చరణ్, లోకేశ్వర్ ఈదర, చైతు సత్సంగి పాడారు. ''యూత్‌ని ఆకట్టుకునే రొమాన్స్‌తో పాటు ఫ్యామిలీని ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ని అలరించే హై ఓల్టేజ్ యాక్షన్ అంశాలతో 'తిరగబడర సామీ' రూపొందింది. టీజర్, ట్రైలర్, పాటలు సినిమాపై క్యూరియాసిటీని పెంచాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

రక్షించండి!



● 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబ' పోస్టర్

తాప్సీ నటించిన రొమాంటిక్ థ్రిల్లర్ మూవీ 'హసీన్ దిల్‌రుబ' (2021) హిట్టయిన విషయం తెలిసిందే. విక్రాంత్ మెస్సీ మరో లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమాకు వినీల్ మాథ్యూ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబ' రూపొందింది. సీక్వెల్‌లోనూ తాప్సీ, విక్రాంత్ మెస్సీ లీడ్ రోల్స్‌లో నటించగా, వినీల్ మాథ్యూయే దర్శకత్వం వహించారు. ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'నాతో కలిసి నువ్వు సినిమాకు వస్తావా?' 'నన్ను రక్షించండి... నా భర్త నన్ను చంపబోతున్నాడు' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రం ఆగస్టు 9 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

సినిమా బాగుందని అంటారు



● మహేంద్రనాథ్

''సమాజంలోని ఒక అంశానికి వాణిజ్య అంశాలు జోడించి 'విరాజి' తీశాం. ఈ సినిమాలో మంచి కంటెంట్ ఉంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని అంటారనే నమ్మకం ఉంది'' అని నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల అన్నారు. వరుణ్ సందేశ్ హీరోగా నటించిన చిత్రం 'విరాజి'. ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా మహేంద్రనాథ్ మాట్లాడుతూ– ''వరలక్ష్మితో 'శబరి' సినిమా తర్వాత మా సంస్థలో నిర్మించిన రెండో చిత్రం 'విరాజి'. ఆద్యంత్ హర్ష చెప్పిన కథని అంతే బాగా తెరకెక్కించారు. వరుణ్ సందేశ్ అమెరికా నేపథ్యం ఉన్న వ్యక్తి. అతని డైలాగ్ డెలివరీ విధానం 'విరాజి'కి కలిసొచ్చింది. మా సినిమాని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ వాళ్లు నైజాంలో రిలీజ్ చేస్తున్నారు'' అన్నారు.

ఏమైందో మనసే...



● పవన్, సాహిబా

'మెరిసే మెరిసే' చిత్ర దర్శకుడు పవన్ కుమార్ కొత్తూరి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహా మాలవ్య, సాహిబా భాసిన్, వివియా సంత్ హీరోయిన్లుగా నటించారు. శ్రీ నీలకంఠ మహదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీపై రూపొందిన ఈ చిత్రం పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఆగస్టు 2న విడుదల కానుంది. కాగా 'ఏమైందో మనసే' అంటూ సాగే ఈ చిత్రంలోని రెండో పాటను రిలీజ్ చేశారు. ఈ పాటకు కార్తీక్ బి. కొడకండ్ల సంగీతం అందించారు. కృష్ణవేణి మల్లవజ్జల సాహిత్యం అందించగా, శక్తి శ్రీ గోపాలన్ పాడారు.

‘ఏడు’ దాటి ఎంత వరకు?

‘పారిస్’లో మరిన్ని పతకాలపై భారత్ గురి

- పతాకధారులుగా సింధు, శరత్ కమల్



టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ 7 పతకాలు గెలుచుకుంది. భారత హాకీ జట్టుతోపాటు వ్యక్తిగత విభాగంలో పతకాలు నెగ్గిన నీరజ్ చోప్రా, మీరా బాయి చాను, సింధు, లవ్లీనా పారిస్ ఒలింపిక్స్‌లో కూడా పోటీ పడేందుకు సిద్ధమయ్యారు. గత ఒలింపిక్స్‌లో రజత, కాంస్యాలు నెగ్గిన రెజ్లర్లు రవి దహియా, బజరంగ్ ఈసారి అర్హత సాధించలేదు.

మళ్లీ సత్తా చాటేందుకు...

ఒలింపిక్ స్వర్ణపతకంతో పాటు ప్రస్తుత ప్రపంచ చాంపియన్ కూడా అయిన నీరజ్ చోప్రా జావెలిన్ త్రోలో మళ్లీ పతకం సాధిస్తాడని అభిమానులంతా ఆశలు పెట్టుకున్నారు. టోక్యో తర్వాత ఎక్కడా ఉదాసీనతకు తావు ఇవ్వకుండా ప్రధాన ఈవెంట్లలో నిలకడగా విజయాలు సాధిస్తూ వచ్చి ఎక్కడా వైఫల్యం లేకపోవడం నీరజ్‌పై అంచనాలు పెంచుతోంది. పీవీ సింధు వరుసగా మూడో ఒలింపిక్ పతకమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. నేడు జరిగే ప్రారంభ వేడుకల్లో టేబుల్ టెన్నిస్ స్టార్ ఆచంట శరత్ కమల్‌తో కలిసి సింధు పతాకధారిగా పాల్గొంటుంది. టోక్యో రజతం తర్వాత మీరాబాయి చాను వరుస గాయాలతో ఇబ్బంది పడింది. కోలుకున్న తర్వాత కీలక విజయాలతో క్వాలిఫై అయింది. బాక్సింగ్‌లో వరల్డ్ చాంపియన్‌గా ఉన్న లవ్లీనా గత ఒలింపిక్స్‌కంటే మెరుగైన ప్రదర్శన ఇస్తాననే నమ్మకంతో ఉంది. భారత హాకీ జట్టు కూడా మరో పతకాన్ని సాధించగలమనే నమ్మకాన్ని పెంచుతోంది. అన్ని రకాలుగా టీమ్ సన్నద్ధమై ఉంది.

తొలి పతకం కోసం...

కెరీర్‌లో ఎన్నో ఘనతలు ఉన్నా ఒలింపిక్ పతకం లేని లోటును తీర్చుకునేందుకు మరికొందరు ప్రయత్నిస్తున్నారు. ఈ జాబితాలో రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అగ్ర స్థానంలో ఉంది. ఢిల్లీలో నిరసనల తర్వాత మళ్లీ ఆటపై దృష్టి పెట్టి ఆమె అర్హత సాధించిన తీరు అసమానం. ఇటీవల మంచి ఫామ్‌లో ఉంది. టోక్యోలో కీలక సమయంలో తుపాకీ మొరాయించడంతో పతకం కోల్పోయిన షూటర్ మను భాకర్ నాటి వైఫల్యాన్ని మరచి తనేంటో చూపించాలని పట్టుదలగా ఉంది. వరుసగా నాలుగో ఒలింపిక్స్ ఆడుతున్న ఆర్చర్ దీపికా కుమారి అన్నీ గెలిచినా కీలక సమయాల్లో ఒలింపిక్స్‌లో ఒత్తిడిని తట్టుకోలేకపోయింది. ఈ సారైనా దానిని దాటి తొలి పతకాన్ని గెలుచుకుంటుందా చూడాలి. ఇక బ్యాడ్మింటన్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి అద్భుత ఫామ్ వారు కచ్చితంగా పతకం గెలవగలరనే నమ్మకాన్ని పెంచుతోంది.

కొత్త ఆశలతో...

వరల్డ్ చాంపియన్ అయిన తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, ప్రపంచ రికార్డు స్కోరు సాధించిన షూటర్ సిఫ్ట్ కౌర్, ప్రపంచ అండర్–23 చాంపియన్ రెజ్లర్ అమన్ తమ తొలి ఒలింపిక్స్‌లోనే పతకం సాధించాలనే లక్ష్యంతో సిద్ధమయ్యారు.

10,500 మంది... ఒకటే స్వప్నం!



నేటి నుంచి పారిస్ ఒలింపిక్స్

ఆగస్టు 11 వరకు పోటీలు

- 32 క్రీడాంశాల్లో 329 మెడల్ ఈవెంట్లు
- భారత్ నుంచి 16 క్రీడాంశాల్లో 117 మంది బరిలోకి
- నేటి రాత్రి 11 గంటల నుంచి ప్రారంభోత్సవ కార్యక్రమం
- స్పోర్ట్స్ 18, జియో సినిమాలలో ప్రత్యక్ష ప్రసారం

పతకం... పతాకం... ఒక అథ్లెట్‌కు వీటితో విడదీయరాని బంధం... పతకం గెలిచిన వేళ జాతీయ పతాకం ఎగురుతుంటే సగర్వంగా నిలబడి ఆ అనుభూతిని పొందగలగడం ఒక్క క్రీడాకారుడికి మాత్రమే సాధ్యం... అదీ ఒలింపిక్స్‌లాంటి అత్యంత ప్రతిష్టాత్మక వేదికపై అంటే అంతకు మించిన ఆనందం మరొకటి ఉండదు... ఆ భావోద్వేగ క్షణం కోసమే సంవత్సరాల శ్రమ, పోరాటం, పట్టుదల... ప్రణాళికలు, వ్యూహాలు, సన్నాహాలు, శిక్షణ... డైట్, ఫిట్‌నెస్, మెంటల్ స్ట్రెంత్... అన్నీ అన్నీ కలగలిస్తే ఒలింపిక్స్ పతకం... ప్రపంచవ్యాప్తంగా క్రీడాకారుల కల ఒలింపిక్స్‌లో మెడల్ గెలుచుకోవడమే... ఎన్ని చాంపియన్‌షిప్‌లు సాధించినా, ఎన్ని ట్రోఫీలు గెలుచుకున్నా, ఒలింపిక్ పతకం మాత్రమే అథ్లెట్‌ను ఆకాశాన నిలబెడుతుంది. ఆ కంఠాభరణం మెరుపుల ముందు ఎన్ని ఆభరణాలైనా తక్కువే. స్వర్ణం, రజతం, కాంస్యం... పేర్లు వేరు కావచ్చు... కానీ వీటిలో ఏ పతకం సాధించినా ఆయా అథ్లెట్లకు అది బంగారంతో సమానమే. ఒక్క ఒలింపిక్ పతకంతోనే చరిత్రను సృష్టించినవారు కొందరైతే ... మళ్లీ మళ్లీ గెలుస్తూ వాటిని అలవాటుగా మార్చుకున్న దిగ్గజాలు కూడా ఎందరో... ఇప్పుడు మరోసారి ఆ విశ్వ సమరానికి సమయం వచ్చేసింది. పతకం వేటలో సర్వం ఒడ్డేందుకు ఆటగాళ్లు సిద్ధమయ్యారు.

వందేళ్ల తర్వాత ‘ఫ్యాషన్ సిటీ’ పారిస్ మరోసారి మెగా ఈవెంట్ కోసం ముస్తాబైంది. ఇన్నేళ్ల ఒలింపిక్స్‌లలో ఎన్నడూ చూడని పలు విశేషాలతో ఈ సంబరాన్ని జయప్రదం చేసేందుకు నిర్వాహకులు అన్నీ ఏర్పాట్లు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమం మొదలు విజేతలకు అందించే పతకాల్లో చరిత్రను చేర్చడం వరకు అన్నింటా తమ ప్రత్యేకత కనిపించేలా సిద్ధం చేశారు. 124 ఏళ్ల క్రితం పారిస్ ఒలింపిక్స్‌లోనే తొలిసారి మహిళలు అడుగు పెట్టగా... ఇప్పుడు అదే గడ్డపై జరుగుతున్న పోటీల్లో తొలిసారి పురుషులు, మహిళలు సమాన సంఖ్యలో బరిలోకి దిగుతుండటం విశేషం. ఇంట్లో శుభకార్యాన్ని పర్యవేక్షించే పెద్ద మనిషి తరహాలో దాదాపు వేయి అడుగుల ఎత్తులో ఠీవిగా నిలబడిన ఈఫిల్ టవర్ సాక్షిగా రెండు వారాల పాటు ఒలింపిక్ వేడుకలు అంబరాన్నంటనున్నాయి. మూడేళ్ల క్రితం చుట్టూ కోవిడ్ ముసురుకున్న సమయంలో సాగిన టోక్యో ఒలింపిక్స్ అభిమానులకు అర్ధ ఆనందాన్ని మాత్రమే అందించాయి. ఇప్పుడు జరిగే పోటీలు గత గేమ్స్‌కు భిన్నంగా ఫ్యాన్స్‌కు చేరువగా వచ్చి సంబరంలో భాగం చేయనున్నాయి. హోరాహోరీ సమరాల్లో 206 దేశాల నుంచి 10,500 మంది అథ్లెట్లు 32 క్రీడాంశాల్లో పోటీ పడిన తర్వాత ఎవరు పతకధారిగా శిఖరాన నిలుస్తారో, ఎవరు గుండె పగిలి కన్నీళ్లతో తిరిగొస్తారో చూడాలి!

–సాక్షి క్రీడా విభాగం

2024 పారిస్ ఒలింపిక్స్ షెడ్యూల్

క్రీడాంశం	భారత్	జూలై 26	27	28	29	30	31	ఆగస్టు 1	2	3	4	5	6	7	8	9	10	11
వేడుకలు (ప్రారంభ, ముగింపు)		🔥																🔥
3X3 బాస్కెట్‌బాల్						●	●	●	●	●	●	🏅						
ఆర్చరీ	🇮🇳			🏅	🏅	●	●	●	🏅	🏅	🏅							
ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్			●	●	🏅	🏅	🏅	🏅		🏅	🏅	🏅						
ఆర్టిస్టిక్ స్విమ్మింగ్												●	●	🏅		●	🏅	
అథ్లెటిక్స్	🇮🇳							🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅
బ్యాడ్మింటన్	🇮🇳		●	●	●	●	●	●	🏅	🏅	🏅	🏅						
బాస్కెట్‌బాల్			●	●	●	●	●	●	●	●	●		●	●	●	●	🏅	🏅
బీచ్ వాలీబాల్			●	●	●	●	●	●	●	●	●	●	●	●	●	🏅	🏅	
బాక్సింగ్	🇮🇳		●	●	●	●	●	●	●	🏅	🏅		🏅	🏅	🏅	🏅	🏅	
బ్రేకింగ్																🏅	🏅	
కనోయ్ స్లాలోమ్			●	🏅	🏅	●	🏅	🏅	●	●	●	🏅						
కనోయ్ స్ప్రింట్													●	●	🏅	🏅	🏅	
సైక్లింగ్ బీఎంఎక్స్ ఫ్రీస్టయిల్						●	🏅											
సైక్లింగ్ బీఎంఎక్స్ రేసింగ్								●	🏅									
సైక్లింగ్ మౌంటెయిన్ బైక్				🏅	🏅													
సైక్లింగ్ రోడ్			🏅							🏅	🏅							
సైక్లింగ్ ట్రాక్												🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅
డైవింగ్			🏅		🏅		🏅		🏅			●	🏅	●	🏅	🏅	🏅	
ఈక్వెస్ట్రియన్	🇮🇳		●	●	🏅	●	●	●	🏅	🏅	🏅	●	🏅					
ఫెన్సింగ్			🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅							
ఫుట్‌బాల్			●	●		●	●		●	●		●	●		🏅	🏅	🏅	
గోల్ఫ్	🇮🇳							●	●	●	🏅			●	●	●	🏅	
హ్యాండ్‌బాల్			●	●	●	●	●	●	●	●	●		●	●	●	●	🏅	🏅
హాకీ	🇮🇳		●	●	●	●	●	●	●	●	●	●	●	●	🏅	🏅		
జూడో	🇮🇳		🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅								
మారథాన్ స్విమ్మింగ్															🏅	🏅		
మోడర్న్ పెంటాథ్లాన్															●	●	🏅	🏅
రిథమిక్ జిమ్నాస్టిక్స్															●	🏅	🏅	
రోయింగ్	🇮🇳		●	●	●	●	🏅	🏅	🏅	🏅								
రగ్బీ సెవెన్స్			🏅	●	●	🏅												
సెయిలింగ్	🇮🇳			●	●	●	●	🏅	🏅	●	●	●	🏅	🏅	🏅			
షూటింగ్	🇮🇳		🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅						
స్కేట్‌బోర్డింగ్			🏅	🏅									🏅	🏅				
స్పోర్ట్ క్లయింబింగ్												●	●	🏅	🏅	🏅	🏅	
సర్ఫింగ్			●	●	●	●	🏅											
స్విమ్మింగ్	🇮🇳		🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅							
టేబుల్ టెన్నిస్	🇮🇳		●	●	●	🏅	●	●	●	🏅	🏅	●	●	●	●	🏅	🏅	
తైక్వాండో														🏅	🏅	🏅	🏅	
టెన్నిస్	🇮🇳		●	●	●	●	●	●	🏅	🏅	🏅							
ట్రాంపోలిన్ జిమ్నాస్టిక్స్									🏅									
ట్రయాథ్లాన్						🏅	🏅					🏅						
వాలీబాల్			●	●	●	●	●	●	●	●	●	●	●	●	●	🏅	🏅	🏅
వాటర్‌పోలో			●	●	●	●	●	●	●	●	●	●	●	●	●	●	🏅	🏅
వెయిట్‌లిఫ్టింగ్	🇮🇳													🏅	🏅	🏅	🏅	🏅
రెజ్లింగ్	🇮🇳											●	🏅	🏅	🏅	🏅	🏅	🏅

● లీగ్ దశ పోటీలు 🏅 మెడల్ ఈవెంట్‌లు 🇮🇳 భారత్ బరిలో ఉన్న క్రీడాంశాలు

పారిస్ ఒలింపిక్స్‌ను స్పోర్ట్స్ 18 చానెల్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు

తొలిసారి స్టేడియం బయట...

ఒలింపిక్స్ ప్రారంభోత్సవ వేడుకలను ప్రధాన స్టేడియం లోపల పరిమిత ప్రేక్షకుల మధ్య నిర్వహించడం రివాజు. ఇన్నేళ్ల చరిత్రలో ఇది ఎప్పుడూ మారలేదు. కానీ ఈసారి పారిస్ ఒలింపిక్స్ నిర్వాహకులు ఈ వేడుకలను స్టేడియం బయటకు తీసుకొస్తున్నారు. నగరం నడి మధ్యలో సెన్ నది పక్కన పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజల సమక్షంలో ఈ వేడుకలు జరగనున్నాయి. సాధ్యమైనంత ఎక్కువ మంది దీనికి హాజరయ్యేలా సాధారణ పౌరులందరినీ అనుమతిస్తున్నారు. పారిస్ నగరవాసులే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశానికి చెందినవారైనా సరే ఈ వేడుకల్లో పాల్గొనవచ్చు. ఎనభై భారీ స్క్రీన్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఒలింపిక్ క్రీడల చరిత్రలోనే వీటిని అతి పెద్ద వేడుకలుగా చెప్పవచ్చు. దాదాపు వంద బోట్‌లలో వివిధ దేశాల క్రీడాకారులు సెన్ నదిపై బోటులో ప్రయాణిస్తూ పరేడ్‌లో పాల్గొంటారు. 10,500 మంది అథ్లెట్లు ఇందులో పాల్గొననుండటం విశేషం. ఆరు కిలోమీటర్ల పొడవున సాగే ఈ పరేడ్ పారిస్ నగరం నడిమధ్యలోంచి వెళ్లి చివరకు ట్రొకాడెరో వద్ద ముగుస్తుంది. ఈ ప్రాంతానికి చారిత్రక ప్రాధాన్యత ఉండటంతో పాటు అందమైన గార్డెన్‌లు, ఫౌంటేన్‌లకు ప్రసిద్ధి. గతంలో ఎన్నడూ లేని విధంగా అథ్లెట్లందరినీ ప్రారంభోత్సవ వేడుకల్లో వేదికపైకి ఆహ్వానించి పరిచయం చేయబోతున్నారు.





భారత కాలమానం ప్రకారం రాత్రి 11 గంటల నుంచి వేడుకలు మొదలవుతాయి. ప్రారంభోత్సవంలో ఎలాంటి కార్యక్రమాలు ఉంటాయి, ఎవరెవరు ఏం చేయబోతున్నారు అనే విషయాలను మాత్రం నిర్వాహకులు గోప్యంగానే ఉంచారు. అసలు రోజు మాత్రమే దానిని ‘సర్‌ప్రైజ్’గా చూపించాలని వారు భావిస్తున్నారు. ఎప్పటిలాగే పరేడ్‌లో అందరికంటే ముందు గ్రీస్ దేశపు ఆటగాళ్లు రానుండగా... ఆ తర్వాత శరణార్థి జట్టు గ్రీస్‌ను అనుసరిస్తుంది. ఆ తర్వాత ఆంగ్ల అక్షర క్రమంలో ఆయా దేశాలు పాల్గొంటాయి. నిర్వాహక దేశం ఫ్రాన్స్ ఈ పరేడ్‌లో చివరగా వస్తుంది. ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా తమ దేశం తరఫున కాకుండా వ్యక్తిగత హోదాలో పోటీల బరిలోకి దిగుతున్న రష్యా, బెలారస్ ఆటగాళ్లు ఎవరూ పరేడ్‌లో పాల్గొనరు. దాదాపు నాలుగు గంటల పాటు ఈ మొత్తం ఈవెంట్ సాగే అవకాశం ఉంది.

- ఒలింపిక్స్ చరిత్రలో తొలిసారి పురుషులు, మహిళలు సమాన సంఖ్యలో బరిలోకి దిగుతున్నారు. ఈ పోటీల్లో 5,250 మంది పురుషులు, 5,250 మంది మహిళలు సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు.
- ఒలింపిక్స్‌లో తొలిసారి ఆర్టిస్టిక్ స్విమ్మింగ్ పోటీల్లో పురుషులు కూడా పోటీ పడనున్నారు.
- లండన్ (1908, 1948, 2012) తర్వాత మూడుసార్లు ఒలింపిక్స్ నిర్వహిస్తున్న రెండో నగరంగా పారిస్ (1900, 1924, 2024) గుర్తింపు పొందింది. 1924 జూలై 27న పారిస్‌లో ముగింపు ఉత్సవం జరగా... ఇప్పుడు 100 ఏళ్ల తర్వాత జూలై 26న ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతోంది.
- మొత్తం క్రీడాంశాలు 32... పతకం గెలుచుకునే అవకాశం ఉన్న ఈవెంట్‌లు 329.
- అత్యధికంగా అక్వాటిక్స్‌లో 49 మెడల్స్ అందుబాటులో ఉండగా... అథ్లెటిక్స్‌లో 48 మెడల్ ఈవెంట్లు ఉన్నాయి.
- పారిస్ నగరం, దాని శివార్లలో కలిపి మొత్తం 35 వేదికల్లో పోటీలు జరుగుతాయి. బీచ్ వాలీబాల్ పోటీలను ఈఫిల్ టవర్ పక్కనే నిర్వహిస్తుండటం విశేషం.
- ఒలింపిక్స్ ఈవెంట్‌లలో ఒకటైన సర్ఫింగ్‌ను ‘తహితి’ దీవుల్లో నిర్వహిస్తున్నారు. ఫ్రాన్స్‌కు దాదాపు 15 వేల కిలో మీటర్ల దూరంలో పసిఫిక్ మహా సముద్రం మధ్యలో ఈ దీవి ఉంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లకు ఇది దగ్గరగా ఉంటుంది. అయితే ఇది ఫ్రెంచ్ ప్రభుత్వం ఆధీనంలో ఉన్న దీవి కావడంతో ఒలింపిక్స్ వేదికల్లో ఒకదానిని దీనిని కూడా ఎంపిక చేయడం విశేషం.



- క్రీడా గ్రామంలో మొత్తం 14,250 మంది కోసం గదులు సిద్ధం చేశారు. ప్రతీ రోజూ కనీసం 60 వేల భోజనాలు అందిస్తారు. క్రీడల తర్వాత దీనిని ఒక బస్తీగా మారుస్తున్నారు. నిర్వహణలో సహాయకారిగా ఉండేందుకు 40 వేల మంది వలంటీర్లు ఈ గేమ్స్‌లో అందుబాటులో ఉన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
26-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
109	7
80,040	24,406

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,449	△	106
డోజోన్స్	40,224	△	370
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,186	△	33
డాక్స్	18,299	▽	89
షాంఘై	2,887	▽	15
నికాయ్	37,870	▽	1,285

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)		
68,227	▽	924
బంగారం (22 క్యారెట్)		
67,954	▽	920
వెండి (కేజీ)		
81,474	▽	3,388

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.31	84.33
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.80	109.38
€	యూరో	ఎస్‌బీఐ	89.71	92.08
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.41	55.62
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.97	55.90
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.04	64.73
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.43	22.98
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.90	23.68
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.70	12.53

మూడోరోజూ తగ్గిన బంగారం

- ఢిల్లీలో రూ.1,000 తగ్గుదల
- కస్టమ్స్ కోతకు అంతర్జాతీయ ధరల పతనం తోడు
- 3 రోజుల్లో రూ 5,000 డౌన్



న్యూఢిల్లీ/న్యూయార్క్: భారత్‌లో 15 శాతం నుంచి 6 శాతానికి కస్టమ్స్ సుంకాల కోతకు తోడు, అంతర్జాతీయ ఫ్యూచర్స్ కమోడిటీ మార్కెట్–కామెక్స్‌లో ధరల భారీ పతనం నేపథ్యంలో వరుసగా మూడవరోజూ దేశంలో బంగారం ధరలు భారీగా తగ్గాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలో వరుసగా 99.9, 99.5 స్వచ్ఛత ధరలు రూ.1,000 చొప్పున తగ్గి వరుసగా రూ.70,650, రూ.70,300కు దిగివచ్చాయి. ఇక్కడ పసిడి వరుసగా మూడు రోజుల్లో దాదాపు రూ.5,000 తగ్గింది. వెండి ధరలు సైతం ఇక్కడ గురువారం భారీగా తగ్గాయి. కేజీ ధర రూ.3,500 తగ్గి రూ.84,000కు దిగివచ్చింది. అంతర్జాయంగా ఫ్యూచర్స్‌లో ధర ఔన్స్‌కు (31.1గ్రా) 2 శాతం (55 డాలర్లు) పతనమై 2,360 వద్ద ట్రేడవుతోంది. జపాన్ సెంట్రల్ బ్యాంక్ మాత్రం వచ్చేవారం వడ్డీరేట్ల పెంచవచ్చని వచ్చిన వార్తలు, దీనితో డాలర్ ఇండెక్స్ దేశాల కరెన్సీల్లో భాగంగా ఉన్న జపాన్ యన్ భారీ పెరుగుదల అంతర్జాతీయంగా బంగారం తాజా భారీ పతనానికి కారణం. ఇక దేశీ కమోడిటీ ఫ్యూచర్స్–ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల పసిడి ధర క్రితం ముగింపులో పోల్చితే రూ.1,392 (2%పైగా) తగ్గి రూ.67,560 వద్ద ట్రేడవుతోంది.

కెనరా బ్యాంక్ లాభం అప్



ముంబై: ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ నికర లాభం ఈ ఏడాది తొలి త్రైమాసికం (2024–25, క్యూ1)లో 10% పుంజుకుని రూ. 3,905 కోట్లను తాకింది. గతేడాది (2023–24) ఇదే కాలంలో రూ. 3,535 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 29,823 కోట్ల నుంచి రూ. 34,020 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 6% వృద్ధితో రూ. 9,166 కోట్లను తాకింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 5.15% నుంచి 4.14 %కి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు సైతం 1.57 శాతం నుంచి 1.24 శాతానికి దిగివచ్చాయి. అనుబంధ సంస్థలు కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్, కెనరా రొబెకో అసెట్ మేనేజ్‌మెంట్‌లలో లిస్టింగ్ ద్వారా 25 శాతంవరకూ వాటాలు విక్రయించనున్నట్లు బ్యాంక్ ఎండీ కె.సత్యనారాయణ రాజు వెల్లడించారు.

స్టార్టప్ పిచ్‌పై

ఎంట్రప్రెన్యూర్లు, ఇన్వెస్టర్లుగా రాణిస్తున్న మెన్ ఇన్ బ్లూ

నవతరానికి కనెక్ట్ అయ్యే స్టార్టప్‌లపైనే దృష్టి

ఎక్స్‌ట్రా ఇన్నింగ్స్!

టీ20 ప్రపంచ కప్‌లో దుమ్మురేపి దేశాన్ని మరోసారి జగజ్జేతగా నిలిపింది 'మెన్ ఇన్ బ్లూ' టీమ్. 'హిట్'మ్యాన్ రోహిత్ కెప్టెన్సీ.. కింగ్ కోహ్లీ మెరుపులకు బుమ్రా మ్యాజిక్.. పాండ్యా పంచ్.. మొత్తం టీమిండియా పోరాటపటిమ తోడవ్వడంతో కప్పు మన వశమైంది. బ్యాట్, బాల్‌తో చెలరేగిపోయే మన క్రికెట్ ధీరులు.. వ్యాపారవేత్తలుగా కూడా పవర్‌ఫుల్ ఇన్నింగ్స్‌తో అదరగొడుతున్నారు. ఒక పక్క క్రికెట్‌లో మునిగితేలుతూనే.. స్టార్టప్‌లలోనూ స్మార్ట్‌గా ఇన్వెస్ట్ చేస్తూ పర్ఫెక్ట్ కవర్ డ్రైవ్‌లతో అలరిస్తున్నారు. స్టార్టప్ పిచ్‌పై మార్కెట్ డిమాండ్లు, నవ కల్పనల వంటి దూసుకొచ్చే బంతులను మన ఎంట్రప్రెన్యూర్ బ్యాట్స్‌మెన్ దీటుగా ఎదుర్కొంటున్నారు. క్రికెటర్లు స్టార్టప్స్‌లో ఫైనాన్షియల్ సిక్సర్ కొట్టినా.. కొత్త వెంచర్‌లను లాంచ్ చేసినా గ్యాలరీలో కూర్చున్న అభిమానులకు ఈ బిజినెస్ గేమ్ కూడా థ్రిల్ అందిస్తోంది. సరైన పార్ట్‌నర్‌షిప్ కుదిరితే స్టార్టప్ కాస్తా 'యూనికార్న్'గా మారి.. అద్భుతమైన విజయం సాకారం కావచ్చు! ఎంట్రప్రెన్యూర్లుగా మారి సత్తా చాటుతున్న క్రికెటర్ల సంగతేంటో చూద్దాం...

– సాక్షి, బిజినెస్ డెస్క్

కోహ్లీ.. ఇన్వెస్ట్‌మెంట్ 'కింగ్'



స్పోర్ట్ కాన్వో: ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడా ప్రేమికులను కనెక్ట్ చేస్తోంది. కోహ్లీ ఇన్వెస్ట్ చేసిన ఈ సంస్థ ఆన్‌లైన్ స్పోర్ట్స్ కమ్యూనిటీ ఏర్పాటుపై దృష్టి సారించింది.

స్టెపాథ్లాన్ లైఫ్‌స్టయిల్స్: పిల్లల ఆరోగ్య సంరక్షణ, ఫిట్‌నెస్‌పై దృష్టి సారించిన సంస్థ ఇది. నవతరానికి ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చేందుకు కోహ్లీ కృషి చేస్తున్నారు.

పెట్టుబడుల్లోనూ 'మిస్టర్ కూల్'..



7ఇంక్‌బ్రూస్: గ్రౌండ్‌లో కూల్ కెప్టెన్‌గా, ప్రత్యర్థులకు సెగలు పుట్టించే ధోనీ.. ఈ ఆహార పానీయాల స్టార్టప్‌తో ఎఫ్‌ఎంసీజీ వ్యాపారంలోకి అడుగుపెట్టారు. మూడు సిక్స్‌లు, ఆరు ఫోర్లతో లాభాల పరుగులు పారిస్తున్నారు.

ఖాతాబుక్: చిన్న మధ్య తరహా సంస్థల (ఎంఎస్‌ఎంఈ)కు అకౌంట్ల నిర్వహణను సులభతరం చేస్తున్న డిజిటల్ లెడ్జర్ యాప్ ఇది. దీనిలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా చిన్న వ్యాపారాలకు దన్నుగా నిలుస్తున్నారు.

క్లియర్‌ట్రిప్: ఈ ట్రావెల్ సంస్థకు ధోనీ బ్రాండ్ అంబాసిడర్. ట్రావెల్ ఆప్షన్లను ప్రమోట్ చేస్తూ, ప్రయాణికుల్లో విశ్వాసం నింపుతున్నారు.

యువరాజ్... 'గేమ్'ఛేంజర్



యువరాజ్ సింగ్ ఫౌండేషన్ (యూవుయ్‌కెన్): హెల్తియాన్స్, ఎడ్యుకార్ట్.కామ్ వంటి ఆరోగ్య, విద్యా సంబంధ స్టార్టప్‌లలో ఇన్వెస్ట్ చేస్తోంది. నవ కల్పనలను ప్రోత్సహిస్తున్న యువరాజ్ సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ సత్తా చాటుతున్నారు.

గంభీర్... ఈకామర్స్ చాంపియన్



ఫైండ్ కామర్స్ ప్లాట్‌ఫామ్: డిజిటల్ రిటైల్ సొల్యూషన్లను అందించడం ద్వారా ఆన్‌లైన్ వ్యాపారంలోకి ప్రవేశించే వారికి దన్నుగా నిలుస్తోంది. దీంతో ఆఫ్–ఫీల్డ్‌లోనూ సాటిలేదని గౌతమ్ నిరూపించుకుంటున్నారు.

హార్దిక్.. కొత్త 'అడుగులు'



అరెటో: చిన్న పిల్లలకు వారికి తగిన సైజుల్లో ఫుట్‌వేర్‌ను అందిస్తున్న వినూత్న సంస్థ ఇది. పాండ్యా పెట్టుబడితో పరిశ్రమలో కొత్త అడుగులు పడ్డాయి.

యూ ఫుడ్‌ల్యాబ్స్: రెడీ–టు–ఈట్ మీల్స్‌లో ప్రత్యేకతను చాటుకుంటున్న డీ2సీ (డైరెక్ట్–టు–కస్టమర్) ఫుడ్ స్టార్టప్. ఇన్వెస్టర్‌గా, బ్రాండ్ అంబాసిడర్‌గా హార్దిక్ దన్నుగా నిలుస్తున్నారు.



కేఎల్ రాహుల్.. ఫిట్‌నెస్ స్ట్రోక్

హ్యూగాలైఫ్: ఫిట్‌నెస్ ప్రియుల కోసం ఆన్‌లైన్‌లో అత్యుత్తమ న్యూట్రిషన్ సప్లిమెంట్ ఉత్పత్తులను అందిస్తోంది. బాలీవుడ్ నటి కత్రినా కైఫ్‌తో కలిసి టీమిండియా స్టార్ కేఎల్ రాహుల్ ఈ స్టార్టప్‌ను నెలకొల్పారు.

రహానే.. ఫ్యాన్స్‌తో 'కనెక్ట్'

ఫ్యాన్‌కైండ్: స్వచ్ఛంద సేవల కోసం సెలబ్రిటీలు, ఫ్యాన్స్‌ను కనెక్ట్ చేస్తోంది. దాతృత్వం, ప్రజలతో మమేకం అయ్యేందుకు రహానే ఇందులో పెట్టుబడి పెట్టారు.

సచిన్.. 'మాస్టర్' ఇన్వెస్టర్



స్మాష్: స్పోర్ట్స్, వర్చువల్ రియాలిటీ (వీఆర్), గేమింగ్‌ను కలగలిపి అందిస్తున్న స్టార్టప్ ఇది. సచిన్ పెట్టుబడి ఈ సంస్థను మాస్టర్ బ్లాస్టర్‌గా నిలుపుతోంది.

ముసాఫిర్: పర్యాటకులకు మంచి ట్రావెల్ అనుభూతిని కల్పించడమే లక్ష్యంగా ఇది ఏర్పాటైంది. ట్రావెల్ పరిశ్రమపై టెండూల్కర్ మక్కువను ఈ ఇన్వెస్ట్‌మెంట్ చాటిచెబుతోంది.

ప్రపంచ మార్కెట్లు పడగొట్టాయ్!

సూచీలకు అయిదో రోజూ నష్టాలు



ముంబై: వరుసగా అయిదో రోజూ స్టాక్ సూచీలు నష్టాలు చవిచూశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, బడ్జెట్‌లో సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను, స్వల్ప–దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను పెంపు ప్రతిపాదనతో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు పెరిగాయి. ఫలితంగా మెటల్, బ్యాంకులు, ఫైనాన్స్, ఐటీ, రియల్టీ షేర్లలో అమ్మకాలు తలెత్తాయి. సెన్సెక్స్ 109 పాయింట్లు నష్టపోయి 80,040 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఏడు పాయింట్లు కోల్పోయి 24,406 వద్ద నిలిచింది. అమెరికా మార్కెట్ల భారీ పతన ప్రభావంతో ఉదయం సూచీలు భారీ నష్టాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 671 పాయింట్లు క్షీణించి 79,478 పాయింట్లు వద్ద, నిఫ్టీ 202 పాయింట్లు పతనమై 24,219 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి.

యూఎస్ టెక్ స్టాక్స్ విలవిల

కొన్ని నెలల సూపర్ బుల్ ర్యాలీ తర్వాత ఇటీవల అమ్మకాలతో యూటర్న్ తీసుకున్న యూఎస్ టెక్నాలజీ స్టాక్స్ భారీ పతనదిశగా సాగుతున్నాయి. ప్రధానంగా టెక్ దిగ్గజాల ఫలితాలు నిరాశపరచడం నాస్‌డాక్ డౌన్ ట్రెండ్‌కు తెరతీసినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. క్యూ2లో ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా నికర లాభం 45 శాతం తగ్గడంతో బుధవారం షేరు 12 శాతం కుప్పకూలింది. ఈ ఏడాది 130 శాతం ర్యాలీ చేసిన చిప్ దిగ్గజం ఎన్‌విడియా 7 శాతం పతనమైంది. గూగుల్, యూట్యూబ్ సైతం 5 శాతం చొప్పున క్షీణించాయి. ఈ బాటలో హాట్‌ఫేవరెట్లుగా పేర్కొనే జాబితాలోని మెటా, యాపిల్, మైక్రోసాఫ్ట్ సైతం అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. టెస్లా, అల్ఫాబెట్ ఫలితాల నిరాశతో బుధవారం నాస్‌డాక్ 2022 అక్టోబర్ 7 తదుపరి 3.6% పతనమైంది. పాయింట్ల (654) పరంగా కరోనా కాలం (2020 మార్చి 16) తదుపరి అత్యధికంగా క్షీణించింది.

మ్యాన్‌కైండ్ ఫార్మా చేతికి భారత్ సీరమ్స్

భారత్ సీరమ్స్ అండ్ వ్యాక్సిన్స్‌లో 100% వాటాలను ఆడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి కొనుగోలు చేసేందుకు మ్యాన్‌కైండ్ ఫార్మా ఒప్పందం కుదుర్చుకుంది. డీల్ విలువ రూ. 13,630 కోట్లుగా అంచనా.

ఐపీవోకు స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్

రూ.600 కోట్లు సమీకరించనున్న కంపెనీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజినీరింగ్ ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ఐపీవోకు వస్తోంది. ఈ మేరకు ప్రాస్పెక్టస్‌ను సెబీకి దాఖలు చేసింది. ఐపీవో ద్వారా కంపెనీ రూ.600 కోట్లు సమీకరించనుంది. ఇందులో ఫ్రెష్ ఇష్యూ రూ.250 కోట్లు. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.350 కోట్ల విలువైన 1.84 కోట్ల షేర్లను జారీ చేస్తారు. ప్రమోటర్లు ఎస్2 ఇంజనీరింగ్, కందుల రామకృష్ణ, కందుల కృష్ణ వేణి, నాగేశ్వర్ రావు కందుల, కాట్రగడ్డ మోహన్ రావు, కాట్రగడ్డ శివప్రసాద్, కుదరవల్లి పున్నారావు ఈ ఆఫర్ ద్వారా తమ వాటాలో కొంత భాగాన్ని విక్రయిస్తారు. స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టర్నోవర్ 2023–24లో రూ.544 కోట్లకు చేరింది. భారత్‌లో ఫార్మా, కెమికల్ రంగాలకు ప్రత్యేక ఇంజనీరింగ్ ఉపకరణాల తయారీలో కంపెనీ టాప్–5లో నిలిచింది. హైదరాబాద్‌తోపాటు యూకేలోనూ ప్లాంటు ఉంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
టెక్ మహీంద్రా లాభం జోరు
గూగుల్ 'మ్యాప్' వార్

సాక్షి స్పోర్ట్స్



సుమిత్‌కు క్లిష్టమైన 'డ్రా'

పారిస్: భారత టెన్నిస్ నంబర్‌వన్ సుమిత్ నగాల్‌కు పారిస్ ఒలింపిక్స్‌లో క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. తొలిసారి ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న ప్రపంచ 80వ ర్యాంకర్ సుమిత్ తొలి రౌండ్‌లో ప్రపంచ 68వ ర్యాంకర్ ముటెట్ కొరెన్‌టిన్ (ఫ్రాన్స్)తో తలపడతాడు. ముఖాముఖి రికార్డులో వీరిద్దరు 2–2తో సమంగా ఉన్నారు. ఒకవేళ తొలి రౌండ్‌లో సుమిత్ గెలిస్తే రెండో రౌండ్‌లో ప్రపంచ 6వ ర్యాంకర్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)తో ఆడాల్సి ఉంటుంది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా), స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో గెలిస్తే రెండో రౌండ్‌లో ముఖాముఖిగా తలపడతారు. మరోవైపు పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న–శ్రీరామ్ బాలాజీ (భారత్) జోడీకి కూడా కఠినమైన 'డ్రా'నే ఎదురైంది. తొలి రౌండ్‌లో ఫాబియన్ రెబూల్–రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్)లతో బోపన్న–బాలాజీ తలపడతారు. 44 ఏళ్ల బోపన్న వరుసగా నాలుగోసారి ఒలింపిక్స్‌లో ఆడుతున్నాడు.



తరుణ్‌దీప్ రాయ్, ధీరజ్, ప్రవీణ్

మన గురి అదిరింది!

- ర్యాంకింగ్ రౌండ్‌లో మెరిసిన భారత ఆర్చర్లు
- టీమ్ విభాగాల్లో నేరుగా క్వార్టర్ ఫైనల్ చేరిన భారత జట్లు
- అదరగొట్టిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్

పారిస్: శుభారంభం లభిస్తే సగం లక్ష్యం నెరవేరినట్లే...! ఒలింపిక్స్‌లో ఎన్నో ఏళ్లుగా భారత్‌ను ఊరిస్తున్న ఆర్చరీ పతకం అందుకునేందుకు మన ఆర్చర్లు సరైన దిశగా అడుగులు వేశారు. గురువారం జరిగిన రికర్వ్ విభాగం ర్యాంకింగ్ రౌండ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు అదరగొట్టాయి. ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాదవ్‌లతో కూడిన భారత పురుషుల జట్టు 2013 పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఫలితంగా తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడే అవకాశాన్ని సంపాదించింది. కొలంబియా, టర్కీ జట్ల మధ్య మ్యాచ్ విజేతతో క్వార్టర్ ఫైనల్లో భారత్ తలపడుతుంది. క్వార్టర్ ఫైనల్లో నెగ్గితే భారత్ సెమీస్‌పై నల్లో ఫ్రాన్స్, ఇటలీ, కజకిస్తాన్ జట్లలో ఒక జట్టుతో ఆడుతుంది. మరో పార్శ్వంలో దక్షిణ కొరియా, చైనా, జపాన్, మెక్సికో ఉన్నాయి. వ్యక్తిగత విభాగంలో ధీరజ్ 681 పాయింట్లతో నాలుగో స్థానాన్ని పొందగా... 674 పాయింట్లతో తరుణ్‌దీప్ రాయ్ 14వ స్థానంలో, 658 పాయింట్లతో ప్రవీణ్ జాదవ్ 39వ స్థానంలో నిలిచారు.

అంకిత భకత్, దీపిక కుమారి, భజన్ కౌర్‌లతో కూడిన భారత మహిళల జట్టు ర్యాంకింగ్ రౌండ్‌లో 1983 పాయింట్లతో నాలుగో స్థానం దక్కించుకుంది. తద్వారా తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. ఫ్రాన్స్, నెదర్లాండ్స్ జట్ల మధ్య మ్యాచ్ విజేతతో క్వార్టర్ ఫైనల్లో భారత్ ఆడుతుంది. ఈ అడ్డంకిని భారత్ అధిగమిస్తే సెమీఫైనల్లో దక్షిణ కొరియా, అమెరికా, చైనీస్ తైపీ జట్లలో ఒక జట్టుతో తలపడుతుంది. ఆదివారం మహిళల మెడల్ టీమ్ ఈవెంట్, సోమవారం పురుషుల మెడల్ టీమ్ ఈవెంట్ జరుగుతాయి.

ఆర్చరీలో కొత్త ప్రపంచ రికార్డు

694 పాయింట్లతో కొరియా అమ్మాయి లిమ్ సిహైన్ ఘనత



పారిస్ ఒలింపిక్స్ క్రీడలు నేడు అధికారికంగా ప్రారంభమవుతున్నా... గురువారం ఈ క్రీడల్లో తొలి ప్రపంచ రికార్డు నమోదైంది. మహిళల ఆర్చరీ రికర్వ్ వ్యక్తిగత ర్యాంకింగ్ రౌండ్‌లో దక్షిణ కొరియా అమ్మాయి లిమ్ సిహైన్ కొత్త ప్రపంచ రికార్డుతోపాటు ఒలింపిక్ రికార్డును కూడా నెలకొల్పింది. లిమ్ సిహైన్ 694 పాయింట్లు స్కోరు చేసింది. తద్వారా 692 పాయింట్లతో కాంగ్ చాయెంగ్ (దక్షిణ కొరియా; 2019లో) సాధించిన ప్రపంచ రికార్డును లిమ్ బద్దలు కొట్టింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కొరియాకే చెందిన ఆన్ సాన్ 680 పాయింట్లతో నెలకొల్పిన ఒలింపిక్ రికార్డును కూడా లిమ్ సిహైన్ తిరగరాసింది.



పతకాలతో తిరిగి రావాలని...

తెలంగాణ రాష్ట్ర క్రీడాకారిణులు ఆకుల శ్రీజ (టేబుల్ టెన్నిస్), ఇషా సింగ్ (షూటింగ్), నిఖత్ జరీన్ (బాక్సింగ్) తొలిసారి ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో విశ్వ క్రీడల్లో తమ కుమార్తెలు సత్తా చాటాలని, దేశానికి ఖ్యాతి తేవాలని, పతకాలతో తిరిగి రావాలని శ్రీజ తల్లిదండ్రులు ప్రవీణ్, సాయి సుధ... ఇషా సింగ్ తండ్రి సచిన్ సింగ్... నిఖత్ జరీన్ తండ్రి జమీల్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆల్ ద బెస్ట్ చెప్పారు.



నేనేంటో కోర్టులోనే చూస్తారుగా!

పారిస్ ఒలింపిక్స్ సన్నద్ధతపై పీవీ సింధు వ్యాఖ్య

పారిస్: 'హ్యాట్రిక్' ఒలింపిక్ పతకంపై దృష్టి పెట్టిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు తను ఎంతగా కష్టపడింది కోర్టులోనే తెలుస్తుందని చెప్పింది. రియో (2016)లో రజతం, టోక్యో (2020)లో కాంస్యం నెగ్గిన ఈ సీనియర్ షట్లర్ గత కొన్నాళ్లుగా కఠోర ప్రాక్టీసులో నిమగ్నమైంది. ఇప్పుడదే ఆత్మవిశ్వాసంతో 'పారిస్' కలను సాకారం చేసుకునేందుకు వచ్చింది. గతంలో ఏ భారత క్రీడా కారుడు కూడా మూడు ఒలింపిక్ పతకాలు గెలిచిన దాఖలాల్లేవు. ఒకవేళ సింధు గనక పోడియంలో నిలిస్తే అది గొప్ప చరిత్రే అవుతుంది. దీనిపై ఆమె మాట్లాడుతూ 'అవును మరో పతకమే నా లక్ష్యం. నేను ఇప్పటికే రెండు పతకాలు గెలిచాను. కానీ అదేపనిగా ఆలోచించి ఆ ఒత్తిడిని తలకెక్కించుకోను. ఎప్పుడు ఒలింపిక్స్ ఆడినా అదే కొత్తగా అనిపించింది నాకు. అందుకేనేమో పతకం గెలిచా. ఇప్పుడు కూడా అలాగే బరిలోకి దిగుతాను. మూడో పతకంతో 'హ్యాట్రిక్' సాధిస్తా' అని సింధు తెలిపింది. ఇక్కడికి వచ్చేముందు చివరగా ఆమె జర్మనీలోని సార్ బ్రుకెన్‌లో తుది సన్నాహాలు చేసింది. పారిస్‌లాంటి వాతావరణ పరిస్థితులు సార్‌బ్రుకెన్‌లోనూ ఉండటం వల్ల సింధు స్థానిక పరిస్థితుల్ని ఆకళింపు చేసుకునేందుకు వ్యూహాత్మకంగా ప్రాక్టీస్ వేదికను ఎంచుకుంది. ప్రకాశ్ పదుకోన్ వద్ద తీసుకున్న శిక్షణలో కచ్చితమైన స్ట్రోక్స్‌ను నేర్చుకున్నానని చెప్పింది. 'ప్రస్తుతం మహిళల సింగిల్స్‌లో సుదీర్ఘ ర్యాలీలు ఎక్కువగా జరుగుతున్నాయి. మ్యాచ్‌లు కూడా చాలా సేపు జరుగుతుండటంతో ఆ దిశగా నేను కసరత్తు చేశాను. ఇప్పుడు ర్యాలీలు ఎంతోసేపు సాగినా ఏ ఇబ్బంది లేదు. ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాను' అని 29 ఏళ్ల సింధు వివరించింది.



ఫైనల్ లక్ష్యంగా...

నేడు బంగ్లాదేశ్‌తో భారత్ సెమీఫైనల్ పోరు

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–3లో ప్రత్యక్ష ప్రసారం

దంబుల్లా: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో జైత్రయాత్ర కొనసాగిస్తున్న భారత మహిళల జట్టు ఇప్పుడు ఫైనల్ వేటలో పడేందుకు సిద్ధమైంది. నేడు జరిగే తొలి సెమీఫైనల్లో గ్రూప్ 'ఎ' టాపర్, డిఫెండింగ్ చాంపియన్ భారత్... గ్రూప్ 'బి'లో రెండో స్థానంలో నిలిచిన బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. రాత్రి ఏడు గంటలకు జరిగే రెండో సెమీఫైనల్లో పాకిస్తాన్‌తో ఆతిథ్య శ్రీలంక జట్టు ఆడుతుంది.

అజేయంగా హర్మన్‌సేన

ఈ టోర్నీలో 'హ్యాట్రిక్' విజయాలతో అజేయంగా దూసుకెళ్తున్న భారత్ ఇక నాకౌట్ దశలోనూ ఇదే జోరును కొనసాగించాలనే లక్ష్యంతో ఉంది. ఓపెనర్లలో షఫాలీ వర్మ సూపర్ ఫామ్‌లో ఉండటం జట్టు విజయాలకు దోహదం చేస్తోంది. మరో స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన, హేమలతలతో టాపార్డర్ పటిష్టంగా ఉంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్‌లు కూడా రాణిస్తుండటంతో బ్యాటింగ్ ఆర్డర్‌కు ఏ ఢోకా లేదు. లోయర్ ఆర్డర్‌లో దీప్తి శర్మ బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో కీలకంగా మారింది. రేణుకా సింగ్, పూజ వస్త్రకర్ నిలకడగా వికెట్లు తీస్తున్నారు. ముఖ్యంగా ఈ టోర్నీలో గట్టి ప్రత్యర్థి అయిన పాకిస్తాన్‌ను కట్టడి చేయడంలో ఈ ముగ్గురు కీలకపాత్ర పోషించారు. యూఏఈ, నేపాల్‌లపై భారీస్కోర్లు సాధించిన భారత మహిళల జట్టు ఈ నాకౌట్ దశలోనూ బంగ్లాదేశ్‌పై మరో భారీ స్కోరును నమోదు చేస్తే మిగతా పనిని బౌలర్లు సమర్థంగా పూర్తి చేస్తారు.

సర్వశక్తులు ఒడ్డేందుకు...

మరోవైపు బంగ్లాదేశ్ కూడా ఫైనల్ కోసం గట్టి పోరాటానికే సన్నద్ధమైంది. పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న భారత్ మెడకు తమ స్పిన్ ఉచ్చు బిగించాలని చూస్తోంది. లెఫ్టార్మ్ స్పిన్నర్ నహిదా అక్తర్, లెగ్ స్పిన్నర్ రబియా ఖాన్‌లు ఈ టోర్నీలో చక్కగా రాణించారు. సెమీస్ మ్యాచ్‌లో పిచ్ ఏమాత్రం అనుకూలించినా... తమ మాయాజాలంతో భారత బ్యాటర్ల ఆటకట్టించే ఎత్తుగడలతో పాక్ సేన ఉంది. మలేసియాతో ఆడిన చివరి లీగ్ మ్యాచ్‌లో బంగ్లా భారీస్కోరు (191/2) నమోదు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు ముర్షిదా, దిలారా, కెప్టెన్ నిగర్ సుల్తానా ఫామ్‌లోకి రావడం బంగ్లా శిబిరానికి కలిసొచ్చే అంశం.

జట్లు (అంచనా)

భారత మహిళల జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), షఫాలీ, స్మృతి మంధాన, హేమలత, జెమీమా, రిచాఘోష్, దీప్తిశర్మ, అరుంధతి, రాధాయాదవ్, తనూజ, రేణుకా సింగ్.

బంగ్లాదేశ్ మహిళల జట్టు: నిగర్ సుల్తానా (కెప్టెన్), ముర్షిదా, దిలారా రుమానా, ఇష్మా తంజీమ్, రీతు మోని, రబియా, షోర్న, నహిదా, సబికున్ జాస్మిన్, జహనారా.

క్లుప్తంగా...

ముగిసిన ఒంగోలు ట్రిపుల్ ఐటీ అడ్మిషన్ల ప్రక్రియ

1,035 సీట్లకు 792 మందికి అడ్మిషన్లు



విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

వేంపల్లె: వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న ఒంగోలు ట్రిపుల్ ఐటీ అడ్మిషన్ల ప్రక్రియ మొదటి విడత గురువారం ముగిసింది. మొత్తం 1,035 సీట్లకు గాను 792 మంది విద్యార్థులు హాజరై అడ్మిషన్లు పొందినట్లు ఆర్జీయూకేటీ అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సంద్ర తెలిపారు. ఆర్కేవ్యాలీ, ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు సంబంధించి మిగిలిన సీట్లకు గాను రెండో విడత ఎంపిక జాబితాను త్వరలోనే విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ భాస్కర్ పటేల్, ఆర్కేవ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా పాల్గొన్నారు.

దేశానికి త్రిభాష సూత్రం శ్రేయస్కరం: యార్లగడ్డ

సాక్షి, న్యూఢిల్లీ: దేశానికి త్రిభాష సూత్రం అనేది శ్రేయస్కరమని విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు.'అరవింద్ ఘోష్–హిందీ' అనే అంశంపై ఢిల్లీలోని ఎన్‌డీఎంసీ కన్వెన్షన్ హాలులో నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ హిందీ సమ్మేళనాన్ని కేంద్ర మంత్రి మేఘవాల్, పార్లమెంటు సభ్యులు సత్యనారాయణ్ జటియా, రాజ్యసభ మాజీ సభ్యుడు కేసీ త్యాగిలతో కలిసి యార్లగడ్డ గురువారం ప్రారంభించారు. దేశ విదేశాల నుంచి 500 మంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఐసెట్ కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎంసీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఐసెట్–2024 కౌన్సెలింగ్ ప్రక్రియను శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు ఉన్నత విద్యా మండలి వైస్ చైర్‌పర్సన్ పి.ఉమామహేశ్వరి దేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1వ తేదీ వరకు రిజిస్ట్రేషన్, ఈనెల 27 నుంచి ఆగస్టు 3వతేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన, 4 నుంచి 7వ తేదీ వరకు ఆప్షన్ల ఎంపిక, 8న ఆప్షన్లను మార్పు చేసుకోవచ్చునన్నారు. అభ్యర్థులకు తొలి దశ సీట్లను 10వ తేదీన కేటాయిస్తామని తెలిపారు. సీట్లు పొందిన కళాశాలల్లో 12 నుంచి 16వ తేదీలోగా రిపోర్టు చేయాలన్నారు. ఇక ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులకు ఆగస్టు 2న ఆంధ్ర లయోలా కాలేజీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.



శ్రీశైలంలో కనీస మట్టాన్ని దాటిన నీటి నిల్వ

- ప్రాజెక్టులోకి 2,54,700 క్యూసెక్కులు
- 855.2 అడుగుల్లో 92.49 టీఎంసీలకు చేరిన నిల్వ

సాక్షి, అమరావతి/శ్రీశైలం ప్రాజెక్టు/కర్నూలు సిటీ/హొళగుంద/ఆలూరు: జూరాల నుంచి కృష్ణా జలాలు, సుంకేశుల నుంచి తుంగభద్ర ప్రవాహంతో శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ఉధృతి పెరిగింది. కనీసస్థాయికి మించి నీటిమట్టం పెరిగింది. గురువారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం ప్రాజెక్టులోకి 2,54,700 క్యూసెక్కులు చేరుతుండటంతో 855.2 అడుగుల్లో 92.49 టీఎంసీలకు చేరుకుంది. ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం 8.501 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 17,469 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తోంది. శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ఉధృతి మరింతగా పెరుగనుంది.

అక్కడ పెరుగుతూ.. ఇక్కడ తగ్గుతూ..

గోదావరి లంక గ్రామాల్లో గుబులు

పోలవరం రూరల్/ధవళేశ్వరం/అమలాపురం: భద్రాచలం వద్ద స్వల్పంగా తగ్గిన గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. బుధవారం రాత్రి కొంత తగ్గినప్పటికీ ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి చేరే నీరు పెరుగుతుండటంతో క్రమేపీ ప్రవాహం ఎక్కువవుతోంది. భద్రాచలం వద్ద 45.10 అడుగులకు చేరిన వరద నీటిమట్టం క్రమేపీ పెరుగుతూ గురువారం రాత్రికి 48.60 అడుగులకు చేరింది. అక్కడ రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. మరోవైపు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ నుంచి సమాచారం అందిన నేపథ్యంలో వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని జల వనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. గురువారం సాయంత్రానికి పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 31.11 మీటర్లకు నీటిమట్టం పెరిగింది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి 10,97,880 క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది.

లంక గ్రామాలను వీడని ముంపు

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాల్లో ముంపు వీడకున్నా వరద మాత్రం అడుగు నుంచి రెండు అడుగుల మేర తగ్గింది. వరద తగ్గుముఖం పడుతోందనుకుంటున్న సమయంలో భద్రాచలం వద్ద వరద పెరుగుతుండటంతో లంక వాసుల్లో ఆందోళన నెలకొంది. పి.గన్నవరం మండలంలో వరద కొంత తగ్గింది. కోనసీమలోని ఆరు లంక గ్రామాలకు, పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే మూడు లంక గ్రామాలకు ఇప్పటికీ పడవల పైనే రాకపోకలు సాగిస్తున్నారు. మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వేపై వరద నీరు ప్రవహిస్తోంది. బి.దొడ్డవరం, అప్పనపల్లి, పెదపట్నంలంకల్లో వరద నీరు స్వల్పంగా తగ్గినా.. ఇంకా ముంపులోనే ఉన్నాయి. అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం, పొట్టిలంక, కొండుకుదురులంక, అయినవిల్లింక, కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంకల్లో వరద ముంపు కొనసాగుతోంది. ఎదురుబిడియం కాజ్‌వేపై వరద నీరు ఉండటంతో ఇంకా పడవల మీదనే రాకపోకలు కొనసాగుతున్నాయి. ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠానేల్లంక, గురజాపులంక, కమిని వద్ద కొంతవరకు వరద నీరు తగ్గింది. ఐ.పోలవరం మండలం మురమళ్ల, కొమరిగిరి, ఎదుర్లంక, జి.మూలపొలం ఏటిగట్టు దిగువన ఉన్న ఇళ్ల మధ్య ముంపు కొనసాగుతూనే ఉంది. కేశనకుర్రు పంచాయతీ పరిధిలోని పల్లెగూడెం, పొగాకులంక, జాంబవానిపేటల్లో వరద ముంపు నీరు ఇళ్ల మధ్యనే ఉంది. అల్లవరం మండలం బోడసుకుర్రు పల్లిపాలెం మత్స్యకార కాలనీలో వరద క్రమేపీ తగ్గుతోంది. ఇప్పటికీ 15 ఇళ్లు జలదిగ్బంధంలోనే ఉన్నాయి.



అప్పనపల్లిలో వరద ముంపులోనే ఇళ్లు

కాటన్ బ్యారేజీ వద్ద తగ్గుముఖం

తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద గురువారం గోదావరి వరద స్వల్పంగా తగ్గింది. గురువారం ఉదయం 6 గంటలకు 13.90 అడుగులున్న నీటిమట్టం ఉదయం 9 గంటలకు 13.70 అడుగులకు తగ్గింది. దీంతో రెండవ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. సాయంత్రం 6 గంటలకు 13.40 అడుగులకు చేరింది. బ్యారేజీ నుంచి 12,30,242 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేశారు. కాలువలకు 4,900 క్యూసెక్కులు వదిలారు.

ఏపీకి విషమ కాలం

బడ్జెట్‌లో బీహార్‌కు నిధులిచ్చి, ఏపీకి రుణాలిచ్చారు

- రాష్ట్రానికి వేటికి ఎంతిచ్చారో కేంద్రం, ఆర్థిక మంత్రి స్పష్టంగా చెప్పాలి
- అమరావతికిచ్చే రూ.15 వేల కోట్లు రుణమే.. రాష్ట్రమే భరించాలి
- పోలవరానికి నిధుల విషయంలో స్పష్టత లేదు
- రాష్ట్రం దమనకాండకు కేంద్ర బిందువుగా మారింది
- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చింది ఏమీ లేనప్పటికీ, రూ.48 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్ మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్‌కే కేటాయించారన్నట్లుగా ఎన్డీఏతో పాటు ఇండియా కూటమి సభ్యులు ప్రచారం చేయడం శోచనీయమని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి మండిపడ్డారు. ఆ రెండు కూటముల నేతలను ఏపీ సీఎం చంద్రబాబు తన గారడీతో బుట్టలో వేసుకుని, ఇలా మాట్లాడిస్తున్నారని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌పై గురువారం రాజ్యసభలో జరిగిన చర్చలో విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. ఇది భారత దేశానికి అమృత్‌కాల్ కావచ్చు కానీ, ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం విషమ కాలమని అభివర్ణించారు. వాస్తవంగా ఆంధ్రప్రదేశ్‌కు ఎన్ని నిధులు వేటికి కేటాయించారో కేంద్రం, ఆర్థిక శాఖ మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీ, బీహార్‌లో అధికారంలో ఉన్న భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జేడీయూల ద్వారానే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. బీహార్‌లో మళ్లీ అధికారంలోకి రావాలన్న ఉద్దేశంతోనే ఆ రాష్ట్రానికి నిధులిచ్చారని, ఏపీలో ఇప్పటికే అధికారంలో ఉండడంతో కేటాయింపులు జరగలేదన్నారు. బీహార్‌లో రహదారులకు రూ.26 వేల కోట్లు గ్రాంట్‌గా ఇచ్చి, ఆంధ్రప్రదేశ్‌లో అమరావతికి ఇస్తామన్న రూ.15 వేల కోట్లు రుణంగా ఇచ్చారన్నారు. ఈ రుణం మొత్తాన్ని వడ్డీతో సహా రాష్ట్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. పోలవరం ప్రాజెక్ట్‌కు రూ.55 వేల కోట్లు కేటాయింపు పైనా ఆర్థిక మంత్రి స్పష్టత ఇవ్వలేదన్నారు. పోలవరం నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలని విభజన చట్టంలో ఉన్నప్పుడు 2014లో నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు ఇచ్చారని నిలదీశారు. డబ్బులు దండుకొనేందుకే చంద్రబాబు పోలవరం బాధ్యతలు తీసుకున్నారని అన్నారు. ఏపీ గత 50 రోజులుగా దమనకాండకు కేంద్ర బిందువుగా మారిందన్నారు. ఫేక్ వార్తల కట్టడికి ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేక హోదా ఎందుకివ్వలేదు?

ఏపీకి ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వలేదో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి, కేంద్ర ప్రభుత్వం చెప్పాలని నిలదీశారు.

చంద్రబాబుతో సర్వ నాశనమే

2014 నుంచి 2019 మధ్య చంద్రబాబు అనేక కుంభకోణాలతో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారన్నారు. ఆ కేసులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా ఉంటే ఏపీకి నిధులు కోరబోమని చంద్రబాబు బీజేపీతో క్విడ్ ప్రోకో చేసుకున్నారని ఆరోపించారు. టీడీపీ అంటే 'టోటల్ డిజప్పాయింట్‌మెంట్ పార్టీ' అని వ్యాఖ్యానించారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఇక్కడిలా.. అక్కడలా..

రాష్ట్రంలో అధికార కూటమి రాక్షస పాలనను విజయసాయి రెడ్డి సభ దృష్టికి తెస్తుండగా బడ్జెట్ పైనే మాట్లాడాలని, లేదంటే రికార్డుల్లోంచి తొలగిస్తామని రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ హెచ్చరించడం గమనార్హం. మరోవైపు లోక్‌సభలో బీజేపీ ఎంపీ సీఎం రమేష్ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు సభాపతి స్థానంలో ఉన్న టీడీపీ ఎంపీ కృష్ణప్రసాద్ అడ్డుచెప్పకపోవడం కొసమెరుపు.

వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీస్తే ఊరుకోం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత మిథున్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ /పుంగనూరు: తమ వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతీసేలా ఆరోపణలు చేసే వారిని ఇకపై ఉపేక్షించం అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత ఎంపీ మిథున్ రెడ్డి హెచ్చరించారు. తప్పుడు ప్రచారం చేసిన వారు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే పరువు నష్టం దావా వేసి, న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై కొందరు టీడీపీ నేతలు తమను ఉద్దేశిస్తూ ఆరోపణలు చేస్తున్నారని.. కొన్ని పత్రికలు, టీవీ చానళ్లు అసత్య కథనాలు ప్రచురిస్తున్నాయని మండిపడ్డారు. ముందుగానే వాటి గురించి అడిగితే వివరణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. గురువారం ఆయన ఢిల్లీలోని ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'సంఘటన స్థలానికి డీజీపీ వెళ్లి చూశారు కదా.. మరి నిజాలను వెలికి తీయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారు' అని ప్రశ్నించారు.

పోలీసుల అదుపులో ఉన్నది టీడీపీ మనిషే

మదనపల్లి ఘటనలో అనురాగ్ అనే వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నట్లు వార్తల్లో చూశానని, తాము టీడీపీ మనుషులమేనని స్వయాన అతని తల్లిదండ్రులే చెబుతున్న మాటలను కూడా వింటున్నామని మిథున్ చెప్పారు. ఇలాంటప్పుడు ఆ ఘటనకు పాల్పడింది ఎవరనే నిజాన్ని తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో జత చేసిన అఫిడవిట్‌లో తన తల్లిదండ్రులు, భార్య, తనకు సంబంధించిన ఆస్తుల వివరాలన్నీ ఉన్నాయని తెలిపారు. ఆ ఆస్తులన్నీ ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేసినవేనని స్పష్టం చేశారు. '30 ఏళ్లుగా రాజకీయం చేస్తున్నాం. క్రమం తప్పకుండా ట్యాక్స్ చెల్లిస్తున్నాం. వందల, వేల ఎకరాల భూములు ఉన్నాయంటూ, కొద్ది రోజుల క్రితం ఓ నేత ఎర్రచందనం వ్యాపారం చేస్తున్నామని ఆరోపించారు. ఆధారాలు ఉన్నాయా.. అని అడిగితే తోక ముడిచారు. ఇలా మా వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీస్తే సహించేది లేదు. మా వ్యాపారాలన్నీ పారదర్శకం' అని వివరించారు.

నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

దాదాపు 50 ఏళ్లుగా తన తండ్రి రాజకీయాల్లో ఉంటూ 10 సార్లు ఎన్నికల్లో పోటీ చేశారని, తాను కూడా మూడు పర్యాయాలు ఎన్నికల్లో ఉన్నానని ఎంపీ మిథున్ చెప్పారు. తన తండ్రి కానీ, తాను కానీ ఏ ఎన్నికల్లోనైనా ఏ ఒక్కరి నుంచి ఒక్క రూపాయి తీసుకుని రాజకీయం చేయలేదని స్పష్టం చేశారు. అలా డబ్బు తీసుకుని రాజకీయం చేసినట్టు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకునేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. రికార్డులను తారుమారు చేసేందుకే మదనపల్లి ఘటన జరిగిందని మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.